
# త్యాగశిలువము

## లేపాక్షి దేవాలయ చరిత్ర



శ్రీ లంకా కృష్ణమూర్తి

మధర్మన మల్లికేశ్వర

కమలానగర్ : : అనంతపురము

శ్రీః

# 1. తూర్పు

శ్రీమంతంబయి సేవ్యమానమయి చారిత్రంబు సౌభాగ్యమున్
క్షేమం బీశ్వరి భక్తిశక్తి మొదలౌ శ్రీలొప్ప పౌరాళికిన్
ధామంబై కళ కాటపట్టయి చరిత్రఖ్యాతమై పావనం
బై మా రాయలసీమరత్నమయి లేపాక్షీ పురంబొప్పెడిన్.

ఆ పురసమీపమందున
నేపారెడి నొక్కగుట్ట యీశ్వరనిలయం
బౌ పుణ్యగిరి నిఖిలపా
పాపహమయి 'కచ్ఛపాద్రి' యనఁబ్రథితంబౌ.

ఘనమగు స్కాందపురాణం
బున నఱువది యెనిమిదైన పుణ్యస్థలులం
దొనరఁగ "లేపాక్ష్యం పా
పనాశనః" అనుచుఁ జెప్పఁబడియుండుటచే.

ఈ లేపాక్షి పవిత్రధాత్రి యిట సర్వేశుండు పాపాపహుం
డై లీలన్ విలసిల్లుచుండు సతభక్తాభీష్టదుండౌచు నే
వేళన్, దన్నిలయంబు కూర్మగిరిపై వెల్గున్, దదంతస్థితం
బౌ లింగంబు నగస్త్యుఁడే నిలిపి సంచారోక్తి యేపారెడిన్.

ఏకాలమందొ నిలిపిరి
ప్రాకటముగ రామభద్ర వాయుతనుజులే
యాకూర్మశిఖరిపై నన్
శ్రీకంఠుని లింగములను రెంటిని భక్తిన్.

సీతాదేవిని గాని చను
నాతస్కరుఁడాఁకి యజ్జటాయువు హతుఁడై
పాతితుఁడై యున్న నతనిఁ
బ్రీతిన్ శ్రీరాముఁ డిటనె 'లేపక్షి' యనెన్.

అనియె నందుచే దానికి ననుగుణముగ
జనులు 'లేపక్షి' 'లేపాక్షి' యనుచు నీప్ర-
దేశమును బిల్వసాగిన దీనిపేరు
నట్లె 'లేపాక్షి' యనుచునే యయ్యెనండ్రు.

మధుర మీనాక్షి, కంచిఁ గామాక్షి యెట్లో
అల్ల కాశీపురిని విశాలాక్షి యెట్లో
అట్లె లేపాక్షియందు లేపాక్షి యనెడి
దేవి కల దని కొందఱు తెలుపుచుండ్రు.

నూటయెనిమిదిగాఁగ సన్నుతికి నెక్క-
నట్టి దివ్యతిరుపతులయందు నిదియుఁ
జేరు ననుటకుఁ గల దిప్డుఁ జిహ్న మగుచు
నచటఁ దిరుమల దేవర యాలయంబు.

విజయనగర సామ్రాజ్యము
విజయధ్వజ మెత్తియున్న వేళ నిదియు ది
గ్విజయము లొనర్చెఁ గడు న
క్కజముగఁ బ్రతిరవిదిసంబు కలిసెడి నంతన్.

శ్రీలు పొంగిన వా దివ్యకాలమందుఁ
గాలమును దప్పకెప్పుడుఁ గలుగుచుండె
వర్షములు, దాన వర్షించె వసుధ సుధను
బోలు సస్యంబుఁ దాఁ బ్రాణిజాలములకు.

పాఁడిపంటలు, ప్రజయును, పైకములును
ఇండ్లు వాకిండ్లు పూలును పండ్లు నగలు
గుళ్లు గోపురములు మేటి కోటపేట
లతిశయంబుగ నుండె లేపాక్షిపురిని.

ధర్మముఁ దప్పరెవ్వరు, నుదారులె యంద, అహర్నిశంబు స
త్కర్మపరాయణుల్, పరమతంబులఁ బ్రీతిని జూచువారు, దు
ష్కర్మ పరాఙ్ముఖుల్, సతతసత్యవచో విభవాభిరాములన్
బేర్మిఁ జెలంగుచుండిరి వివేకులునై ప్రజ లాపురంబునన్,

సత్యము పల్చబారిన యసారపు యంత్రయుగంబుఁ జూడకే
సత్యము నమ్మి, యెల్లపుడు సత్యమునందె చరించుచున్, సదా
సత్యముఁ బెద్దగాఁ దలచి, సత్యసమృద్ధిఁ జెలంగువారలై
సత్యము చల్లఁగా మసిరి సజ్జనులై యలనాఁటి మానవుల్.

శిలల నెత్తుటన్నఁ జెక్కుటన్నను, గుళ్ళు
కట్టుటన్నఁ గోట కట్టుటన్న
చెఱువు త్రవ్వుటన్నఁ జెయి తీఁటపోనాట
బలిమి చెలిమి కలిమివారి కపుడు.

రసికులెల్లరు నట, రసప్రసరణంబుఁ
జేయు కళలకు నాశ్రయసిద్ధి గలదు
అచటి గొల్లఁడుకూడ సత్యాద్భుతంపు
శిల్పసృష్టికి వెలగట్టు చేవఁ గలఁడు.

పలు తెఱఁగుల వృత్తులుగల
కులములతో నెల్లయూళ్ళుఁ గులుకుచునుండెన్
కులవృత్తులందె కళలను
వెలయించుచు భుక్తి ముక్తిఁ బేర్చిరి వారల్.

నరుల కేనాఁడు నుండు ప్రశ్నలు మతంబు
తత్త్వమాచారములు; వీనిఁ దవిలియున్న
నేఁటి వేరొకనాఁటి సందేహపటలి
నాఁటి యీనాటి జీవుల నలఁపలేదు.

కన్ను చెదరనివారు, లక్ష్యమ్ము శ్రద్ధ
సులభమార్గముల్ గలవారు, పలు తెఱఁగుల
వారలైనను వారలు స్వస్వ యోగ్య
పూర్వ సంతూర్ణాసరణులఁ బోవువారు.

వేదమందలి వర్ణముల్ వేరువేరు
గతులు, స్వరములు, శక్తులుఁ గలిగియున్న
నెట్లు లేకార్థ యోగత నేపుఁ జూపు
నట్టి వారలు నియతి నొప్పారువారు.

సంప్రదాయంబనెడి భూమి, శ్రద్ధయనెడి
శిలఁ, గళాశిల్ప వైచిత్రి వెలుఁగ, మోద
దేవగృహములఁ గట్టిరి తృప్తి వారు
మనవలెన్ గాలిమేడలఁ దనివి సనక.

నాఁటి జీవుల భావముల్ నాఁటివాఙ్మ-
యంబు కళలును, బద్ధతులన్నిటికిని
ఆ పరాత్పరుఁ డాధార మయ్యెఁ బుట్ట
నలరె గుడిగాఁగఁ జరముల కచలయట్లు

అట్టి దివ్యకాలమున విఖ్యాతమైన
విజయనగర సామ్రాజ్యాన వీర రసము
నిండి తొనకెడి పెనుగొండ మండలమునఁ
జేరియుండెను లేపాక్షి సిరులుపండ.

విజయనగరేశునకుఁ గడుఁ బ్రీతిపాత్రుఁ
డగుచుఁ, బెనుగొండ పట్టణ మందుఁ గోశ-
మునకుఁ జెందిన యుద్యోగము వహించి
నరవరుం డొక్కఁడుండె సంతసము మీఱ.

'నందిలక్కి సెట్టి' నామకుం డాతఁడు
అతని పత్ని మద్దమాంబ యనఁగఁ
బరగుచుండె, వార లిరువురుఁ గడుపుణ్య
దంపతులు సదా స్వధర్మపరులు.

పూర్వపుణ్యఫలమొ, పురహరు కరుణయొ
వారి హృదయమ్ములరి వరుసగాను
ప్రియముఁగూర్చ సుతులు విరుపణ్ణ, వీరణ్ణ,
యనఁగ నిరువు రందు నగ్రజుండు-

కన్నులు తెఱచిన కడు చిన్ని పాపఁడే
చూపఱ మనసెల్ల జూఱగొనియె,
నెలరాజువలె రోజు లలి హెచ్చ బాలలీ-
లల నలలను లేపె నెలమిజలధి,
ముగ్ధమోహనమూర్తి మురిపెంపుఁగొమరుఁడై
వృద్ధినొందుచు నేర్చె విద్యలన్ని,
నూనూగు మీసాల నూత్న యౌవనమందె
పూర్ణ కళానిధి స్ఫూర్తి వెలిఁగె,

శక్తి, మతి, ధృతి, కాంతియు, శాంతి, భక్తి
అతని వరియించియుండె, జాడ్యంబుగాని
వైక్లబముగాని నాస్తికత్వంబుగాని
పురుషపుంగవు నాతనిఁ బొరయకుండె.

ఆత్మగుణముల వీరణ్ణ యనుఁగు ననుజుఁ
డగుచు నతనిని యన్నింట ననుసరించె
రామచంద్రుని లక్ష్మణస్వామియట్లు
పురుష వృషభుల జత సిరి మూల మయ్యె.



శ్రీ వీరణ్ణ, విరుపణ్ణలు
లేపాక్షి వర్ణచిత్రము

ఎత్తగువారి తీరు కడుహృద్యము, మధ్యములెన్న సన్నముల్,
చిత్తములెట్టు లట్టెదలశ్రీలు విశాలము, లింపునింపు న
త్యుత్తమమైన మేని జిగి, తోరపు సారపు దీర్ఘదోర్గళుల్
పెత్తన మెత్తి చూపు, ముఖబింబము లంబుజవైరిఁ గేరెడిన్,

అన్న విరుపణ్ణ కన్నులయందు భువన
మోహకంబగు నొక సౌరు, స్ఫూర్తి, శక్తి
భావదివ్యకళాజ్యోతిప్రభలు గలవు
అనుజు కన్నులు నట్టివే యనఁగవలెనె?.

వారి ముఖాంబుజంబుల విభాసిలు తేజము, వారి శీవియున్
వారల మీసకట్టు నెరపట్టున నాడెడి ముల్కునవ్వు, గం
భీరత, వారి భ్రూలతల బింకము, కొంకని వారివాక్కులున్
వారిని వీరశూరులని వారక చెప్పుచు నొప్పు నెప్పుడున్.

వీరశైవులు వారు తద్వీరరూప
మందు సుందరతయుఁ గళాస్పందనమును
దేవభక్తియుఁ బరమశాంతియును నగుచు
వెల్గెడిని విశిష్టాద్వైత విధిని శివత.

వీరభద్రుఁడు వారి యిల్వేల్పు, కల్ప
వృక్షమని యాతనినె నమ్మి వీరవరులు
భద్రమును గాంచుచుండిరి, పాపపటలిఁ
ద్రుంచు జగజ్జెట్టి వీరభద్రుండు సూవె.

వారల తాతతండ్రులు లోకపాటిని దేనికి లోటులేక, సా
ధారణ వృత్తులన్ గాని ముదంబున నుండిరి కాని యీ యసా
ధారణ శక్తియుక్తులు పదారు పదేడు వయస్సునందె వి
స్తారముగా సిరిన్ బరులసౌఖ్యముఁ బెంపఁగఁగోరి దీక్షతోన్.

తమ భుజశక్తి, సంతతము ధర్మమునం దనురక్తి, రాచకా
ర్యములను యుక్తి, దుష్పథవిరక్తి, యకృత్రిమరాజభక్తియున్
దమ కవకాశమున్నపుడు తప్పక చూపి, ప్రజాళి మెప్ప, భూ
రమణు ననుగ్రహంబుఁగని ప్రాయము శ్రేయముఁగూర్ప
నేర్పుతోన్.

సోదరు లిద్దరున్ సమరశూరులు వీరులు శాత్రవాజ్యహ
వ్యాదులు వీరభద్రుఁడు షడాననుఁడున్ బలె వైరి శీర్ష వి
చ్ఛేదము చేసి, యాత్మవిభుచిత్తము హర్షరసాబ్ధి ముంచి, సం
పాదన చేసి రాతఁడు సెబాసని యీయఁగ మండలేశతన్.

అట్లు పెనుగొండ మండలాధ్యక్షులైన
వార లిరువురు ధర పరిపాలనంబు
సలుపు నప్పుడు రెండు కన్నుల విధాన
నికట దూరంబులను గాంచి రొకట లెస్స.

పురుష వృషభుల జత శ్రమమ్మునకు నోర్చి
సుప్రజోద్యానమున కెల్ల సుస్థిరత్వ
ధర్మకుశలామృతముఁదోలె, దాని వలన
సిరుల విరు లవి కొల్లగా విరియసాగె.

బసవనిరుక్త సూక్తపథ వర్తను లా నగపుంగవ్రతి సదా
వ్యసనములందుఁ జిక్కక సమార్జిత సంతత సంపదోఘనమ్ము
గుసుమసరంబుఁ దానుఁ దమకూర్మి జనంబులుఁ ప్రేంక
త్రాణ్యా
యసుర నిహంత కా శివున కర్పణసేయఁగ దాచినట్టి శ్రీ.

తమ విభుని పాలి ధనమును
తమ ప్రజకై యుంచినట్టి ధనమును, బరవి
త్తము దేనిని స్పృశియింపక
తమ పాలిటి విత్తములను దాచిరి వారల్.

ఎట్టి యాడంబరములేక యెట్టిభోగ
లాలసత్వములేక యుల్లాసయుక్త
సరళ జీవితంబును వారు జరుపుచుంట
ప్రజలకెల్లను మేల్బంతివలె నెసంగె.

'తలపరిగలు' వారు త్రవ్వించి చెరువులు
కట్టించి కృషి కెద తట్టినారు
సరియగు నూళ్ళలో సంతల నేర్పాటు
చేసి, సౌకర్యంబుఁ జేసినారు
వర్తక, కర్షక పౌరసంఘములను స్థా
పించి వానిని ప్రోత్సహించినారు
సత్పాత్రములకును సత్కార్యములకును
హెచ్చుగా దానంబు లిచ్చినారు

తాము చేయుటేగాక ప్రోత్సాహులగుచుఁ
ప్రజల చేతను సభలచేఁ ప్రభులచేత
నెన్నొ సత్కార్యములను జేయించినారు
ప్రజకుఁదల్లియుఁ దండ్రియై పరగినారు.

పరమభక్తిని, గొరవనిపల్లియొద్ద
శ్రీ మహాలక్ష్మి గుడిని నిర్మించి వార
లాదివారమునాఁటి లేపాక్షి సంత
జతకు శుక్రవారపు సంత జరిపి రచట.

శ్రీదేవి సేవకై సం
పాదించి యొసంగి రెన్నొ మడి మాన్యములన్
పేదలకై త్రవ్వించిరి
ఆదరి 'నవతుంగభద్ర' యను నొక కాల్వన్.

చిన్నతనంబు నుండియును శిల్పమటన్నను బ్రాణమా 'విరూ
పణ్ణ'కుఁ గన్నులారఁగని భావసమాధి మునుంగు, భావముల్
చిన్నెలు వన్నెలున్ వెలయు చిత్రములన్న మరింత యాశ వీ
రణ్ణకు సన్నదమ్ములు కళార్పితచిత్త మనోహరాకృతుల్.

అలనాఁడా పెనుగొండ పట్టణము మధ్యన్ వెల్గునా కోటలో-
పలి యంతఃపుర సీమలందు, బహు దేవస్థాన సంస్థాన మం
దల ద్రాక్షావన దాడిమీ వనములం దా కొండపైఁగోనలం
దల 'కిల్లా'పయి వారు కాంచి రతిదివ్యంబౌ కళాస్వప్నముల్.

వివిధ ప్రదేశములఁగల
వివిధములగు శిల్పములను వీక్షింప మదిన్
దవిలిన కోర్కెన్ వారలు
శివాజ్ఞఁ బయనంబు చేసి చెచ్చెరఁ జనుచున్.

విద్యానగర శిల్ప విద్య గన్గొని, రమ్య
చాళుక్య శిల్పాల సౌరు చూచి,
ఆ కదంబుల శిల్ప మాలోకనము చేసి,
యాంధ్రుల శిల్పము లట్టె కాంచి,
పల్లవ శిల్ప సౌభాగ్యంబు, చోళుల
శిల్పముల్, గంగుల శిల్పములను
గన్గొని హొయసళఘనశిల్పచాతురి
లక్షించి, వానిలో లయము నొంది,

సోదరులు వానిలోని ప్రభేదములను
విదిత నాగర ద్రావిడ వేస రాది
రీతులను చాల నెఱిఁగి వేర్వేరుచోట్ల
శిల్ప శిల్పుల కథలెన్నొ చెలఁగి వినిరి.

'జకణాచారి' యనఁబడు జ
నకుఁడగు 'దాసోజ' పుణ్యనామక శిల్పిన్
'డకణాచారి' యనెడి పు
త్రకుఁడగు 'చావణుని' గూర్చి తనరెడి కథలన్.

విని, యా సోదరు లెల్ల వేళలను దద్విఖ్యాత శిల్పంబులన్
ఘనహా కేశవ దేవళంబును నమోఘ ప్రజ్ఞ బేలూరు నం
దుఁన గట్టించిన విష్ణువర్ధనుని యుద్యోగంబు వే మెచ్చుచున్
గనఁగాఁజొచ్చిరి తామునట్టి పనులన్ సాధించు స్వప్నంబులన్.

ఏకాంతంబున రమ్యదేశములఁ జిత్తైకాగ్రతన్ నిల్చి తా
లోకాంతిన్ 'విరుపణ్ణ' యెన్నొ దివిషల్లోకాల నెంచెన్, గళా
శ్రీ కళ్యాణ విశాల మండపములన్ సృష్టింపఁగా, వేడ్క భూ
లోకంబందున శిల్ప కల్పక పనుల్ పూరింపఁగాఁ గోరుచున్.

వార లిట్టులు దివ్య శిల్పాలతోడ
వెలుఁగు దేవాలయంబులు విత్తమెల్ల
వెచ్చ పెట్టి కట్టించి సేవింప నెంచి
రీశు, నిలువేల్పు, విష్ణుని నితరసురల.

అందుకై వారు తమ దేశమందు నెందు
నెందు నున్నట్టి శిల్పుల కందఱకును
తగిన సౌకర్యములఁను ప్రోత్సాహ మిచ్చి
ప్రతిభ ప్రాకఁగఁ బందిళ్ళు పరచినారు.

అప్పుడప్పుడు శిల్పుల నన్నిచోట్ల
నుండి పిలిపించి చాల మనోహరముగ
సభలు చేయించి కళ ప్రదర్శన మొనర్పఁ
జేసి, వారికి బహుమతుల్ చేసినారు.

ఆ సభలందు వారు ప్రతిభాన్విత శిల్పి సమూహమందు న
గ్రేసరులైన వారిని పరీక్ష యొనర్చి సుదీక్షఁ గూర్చి వి
శ్వాసముఁ బేర్చుచుండిరి స్వవాంఛితసిద్ధిని, కాని యందు న
గ్రాసనమందు మేటి మొనగాఁ డొక డెందు లభింపకుండెనన్.

ఎన్నోనాళ్ళు నిరీక్ష చేసి రటులే స్వేచ్ఛాచకోరాలకున్
జ్యోత్స్నా వెన్నెల వెన్నవిందు లిడగా చిన్నారి లోకాసకున్
కన్నుల్ చల్లఁగఁ జేయ రాల్ గరగఁ జీఁకట్లెల్ల ఛేదిల్లగా
గ్రన్నన్ వచ్చు కళా కళాధురుని రాకన్ గోరుచున్ వారిఁకన్.

# 2. కూర్పు

అంత నొకనాఁడు విరుప భూకాంతుఁ డొకఁడె
యేగి లేపాక్షి పురమున కేదో యొక్క
రాజ కార్యంబుపైఁ గొన్ని రోజులందె
నిలిచె నందలి ప్రజలెల్ల నెలమిఁ గొలువ.

అటనొక పూర్ణిమా దివసమందు మహీశుఁడు సోమవారమం
దెటులనో రాజకార్యముల నెల్లను వేగ ముగించి, సంజఁ జెం
గటఁగల కచ్ఛపాద్రికి నొకండ ముదంబుననేఁగి యందుఁ దొ
ల్లిటి దగు పాపనాశనుని లింగము నర్చన చేసె భక్తితోన్.

తరువాత రామలింగము
వర హనుమల్లింగమును నపారశ్రద్ధా
పరుఁడై పూజించెను పుర
హరుమూర్తి విశేషముల నహార్యంబుపయిన్!

పిమ్మట నత డొక సువిశా
లమ్మును రమ్యమ్మునౌ శిలాతలమందున్
నెమ్మదిఁ గూర్చుండె మనో
జ్ఞమ్ముగు చంద్రోదయమ్ముఁ గనుటకు నంతన్.

లోకబంధువు పగలెల్ల లోకమెల్లఁ
గాచి విశ్రాంతి గొనఁగఁ బ్రతీచి మునిఁగ
జగము నెల్లను స్వకర ప్రసార విధిని
దనుపఁ బూర్ణ కళానిధి తరలి వచ్చె.

ప్రాక్ ప్రతీచుల రాగ మేపారి యుండె
సద్దు సందడి లేనట్టి సంధి వేళ
అప్పుడు విరుపణ్ణ విభున కల్లంతదవ్వు
నందె కాన్పించె నొక క్రొత్తవ్యక్తి యెవరొ.

విరుప భూపతి కనుదోయి విస్మయమున
వికసితముగాఁగఁ జూపెల్ల నికట భూమి
వర్తిలుచునున్న యా క్రొత్తవ్యక్తి యందు
లగ్న మొనరించి యోచనా మగ్నుఁడయ్యె.

గౌరవర్ణుఁడు సుందరగాత్రుఁడతఁడు
త్రిదశసమునట్లు గాన్పించు మధుర మూర్తి.
క్షితి ధరమునిండ నున్న యున్నత విశాల
శిలలఁ బరికించుచుండె నాకలన దృష్టి.

అతని యంగపుసౌరును నతఁడు శిలలఁ
గాంచు చుండిన తీరును గాంచఁగానె
ప్రభుని హృదయాన నాశావిపంచి యందు
మృదులగతి నొక్క తంత్రి కంపించె నెందో

ఆ యువకుఁడల్లె మెల్లగా నవని విభుఁడు
కూరుచుండిన యా శిల చేరువకును
వచ్చి యచ్చట సుందర ప్రతిమవోలె
వెలయు విరుపణ్ణ వీక్షించి విస్మయమున.

నిలిచి తటాలునన్, గనుల నిండుగ నాతని భవ్యసుందరో
జ్జ్వలమగురూపమున్ వెలుఁగుపానముచేయుచునుండ భూవిభుం
డలఘు కళాతపస్వివలె నాతడు తోఁచినఁ దన్ముఖాబ్జ మం
దలి లలితాచ్ఛ దివ్యకళ త్రావఁగ సాగెను నేత్ర పాత్రలన్.

నిమిషమాత్ర మ ట్లనిమిషులై యొక్కరి
నొకరు వారు చూచుచుండు నపుడు
హృద్విపంచితంత్రులెల్లఁ గంపించి స
రాగముగ స్రవించె రాగసుధలు.

అంత నదేమితోఁచినదో, యావిభుడట్టులె లేచి ముందుకున్
గొంత క్రమించె, నల్లె యువకుండును ముందుకువచ్చె
ముందు భూ
కాంతుడె యేఁగి సాగిపడగాఁగయిసాచెనొ? యాగతుండె భూ
కాంతుని మ్రొక్కఁగాఁజనెనొ? కౌఁగిటఁ జేరిరి వారవారిగన్.

ఎఱుఁగ రొకరి నొక రదే జన్మ స్నేహమో
వీక్షణంబునందె ప్రియవయస్యు
లగుచు గాఢమైన యాలింగనంబునఁ
దనిసినారు తమ్ముఁదాము మరచి.

నిండు జాబిల్లి తూరుపు కొండదాటి
స్వల్ప మాత్రమ్ము ముందుకు సాగియుండె
స్నిగ్ధ ముగ్ధరాగంబు నిర్ణిక్తమగుచు
పండు వెన్నెలలై దివి నిండుచుండె.

ఆ యఖండామల జ్యోత్స్నయందు, మంద
మంద మారుతమందు, రమ్యప్రదేశ
మందు, స్వేచ్ఛావిహాయస మం దపూర్వ
సఖుల సంభాషణము విలాసముగ సాగె.

స్వేచ్ఛాకాశములందు శాంతముగ విశ్వేశాన శశ్వత్కృపా
స్వచ్ఛజ్యోత్స్నలఁ దేలుచుండి, ప్రతిభాపక్ష ప్రభావంబునన్
స్వచ్ఛందంబుగ మింట నీదుచుఁ గళాస్వర్లోక సంచారినై
స్వచ్ఛాచ్ఛిన్న మహారసామృతఝరీస్నాతుండనై యుండెదన్.

శిశులోకంబునువీడి, బాలలలితశ్రీలోకమం దాడి, బా
లిశలోకంబునుగూడ కేడుగడగా లేఖాకళాసాధనల్
వశమౌనట్లు పదంబు పాడి, సుకళాస్వర్లోకమున్ జూడ నే
నశనాదుల్ విడనాడి శిల్పతపమం దా లక్ష్యమున్ గూడితిన్.

భావమునందు రమ్యనవభావ విలాసకళా సమేత నా
నానావిధ రూపరేఖల ఘనంబుగఁ గాంచి ధరింతు నా పయిన్
జీవము నిచ్చి వాని నులిచే శిలలందున గండరింతు సం
భావన సేయుదుం జెలఁగి పాడుదు నాడుదుఁ గోర్కె రేగినన్.

కలికి మిటారి గుబ్బెతలఁ గంతునిఁ గాదనుకోడెకాండ్ర, మం
జుల మహనీయమూర్తు లయి శోభిలు దేవవరిష్ఠులన్ లతా
ఫలకుసుమాదులన్ వృషభవారణవాజుల, వింత మ్రుగ్గులన్
మలచితి నందునందు నవమాధురి చిందగఁ గౌతుకంబునన్.

చిన్నెల వన్నెలన్ వెలయు శిల్పములన్ సృజియించుచుండగా
నన్ను బ్రజల్ నుతింప, నరనాథుఁడు చెంగటఁ జేర్చి నాకు పె
న్మన్ననసల్పి పెక్కు మడిమాన్యములిచ్చి బ్రియంబుఁ జూపె, న
త్యున్నతినిచ్చె రాష్ట్రమున నొప్పగఁ జేసెఁ బ్రధానశిల్పిగా.

కానీ యానరనాథుఁ డెన్నడును నా కౌశల్యమున్ జూడఁగాఁ
గానీ రమ్యములైన శిల్పము లనేకంబుల్ సృజింపింపఁగాఁ
గానీ నోచఁకొనండు, మంత్రియుతుఁడై కౌటిల్య తంత్రాలతో
నే నిత్యంబును బ్రొద్దుపుచ్చు, ధనమున్ వెచ్చించు నవ్వానికే.

సేవ్యుఁడనైతి నెందరికొ శిల్పుల కచ్చట, వార లెల్లరున్
భవ్యత దివ్యతం గనని బండలు చెక్కెడివారె, యాత్మలో
నవ్యయ దివ్యభవ్య నరసాద్భుత శిల్పము లొప్పఁగా మహా
కావ్యమువంటి సత్కృతి నొకానొకదాని రచింపఁగోరితిన్.

దానికి నా ధరావిభుని దగ్గర నెన్ని దినాలు కాచినన్
గాని లభింప దయ్యె సహకారమొకింతయు, సంతనెంతయున్
మానసమందుఁజింతిలి సమస్త సుఖాలకు స్వస్తి చెప్పి, యెం
దైనను నాశఁదీర్చుకొననౌనొ యటంచిటు వచ్చితి న్సుమీ.

ఓయి మహాశయా! యతిసముజ్జ్వల సుందరమైన నీదు కం
దోయిని దోఁచుచున్నవిగదోయి మదీయ మనోరథంబు భ
ద్రాయితమౌచు సిద్ధిఁగను రమ్యమహోదయ రాగరేఖ లే
మో యెటులున్నవో నియతి పుస్తకమందు నదృష్టరేఖలున్.

ఇది శుభవేళయంచు మదినెంతుఁ, గనుంగొను మల్లదే కళా
నిధికర సుప్రసారమున నీరయి యా శిలలెల్ల లీనమౌ
విధముగఁదోఁచుచున్న దిటఁ జెల్లుగ నున్నదిరాయి, దేవతా
సదనము లెన్నియైన నొక స్థానమునందె సృజింప శక్యమౌ.

కావలె ముందు కోర్కె, మరికావలె శ్రద్ధ, కళాపిపాసయుం
గావలెఁ దోడి శిల్పు లిఁకఁగావలెఁ గొల్లగ సర్థరాసులుం
గావలె ధారుణీశు సహకారము లోకులతోడు మెప్పులుం
గావలె నిన్ని గల్గిన వికాసమునొందుఁ గళాలతాంతముల్.

డకణాచార్యన్వయమునఁ
బ్రకటముగాఁ బుట్టి చేతఁబట్టితి నులి నో
సుకృతీ! నీవైనను దా
నికిఁ బనికల్పింపుమయ్య! నెగడుం గీర్తుల్.

అనెడి యా కళావంతు వాక్యామృతంబు
చెవులఁదనియింప విరుపణ్ణ చిత్తజలధి
పొంగు సూచించుచును నేత్రముల ముదశ్రు
కణము లురలగ సతిని కిట్లనియెఁ బ్రీతి.

ధన్యుఁడవోయి శ్రీయుత! సుధామయమౌ కళ నీకు నబ్బఁగా
ధన్యము నీదు జన్మ విబుధస్తుత! నీదు మహాశయంబునుం
ధన్యము, నిన్నుగాంచి కడు ధన్యుడనైతి, మదీయ రాజ్యమే
ధన్యతనొందె నిప్పుడుగదా నిజమయ్యెను నాదు స్వప్నముల్.

ఈ పెనుగొండ మండలము నేలెడి వాఁడను నేను, నా మదిం
దీపులు చేపుచుండుఁ గమనీయ విలాస కళాపిపాస సం
దీపితమౌచు నెల్లపుడు దివ్యమహాద్భుత శిల్ప సృష్టి కు
ద్యాపన ముందె చేసితి. సమస్తము నీ చెయి నున్నదింకఁబో.

నా యనుజుండు వీరజననాథుడు నేనును నిన్నినాళ్ళుగా
న్యాయముగా గడించిన ధనంబును న్యాసము చేసి యుంచినా
మోయి! శివార్చనంబునకు నుజ్జ్వల పుణ్య కళార్చనంబుకున్
దీయుడు దాని కైటికిఁక నీ వొనరింపుము సార్థకంబుగా.

కల్పక మట్లనల్ప సహకారమునిచ్చుఁ బ్రజాళి పుణ్య సం
కల్పము దేనికైన నిటఁగాదన కూడదిది నేని శంఖమున్
శిల్పవరిష్ఠ గోష్ఠికి విశిష్ట కళామయ సృష్టి సేయఁజే
తు లుత్పులకించుచున్న నిటఁ దోడయి వత్తురు నీకు నెల్లరున్

ఇది కూర్మాద్రి, ప్రసిద్ధపావననగం. ఔ త్తేమియున్ లే, దీటన్
విదితోదంతములౌచు మూఁచు వెలయున్ విశ్వేశులింగాలు,
కం

వద లేపారెడి పట్టణం బిచటనే భాసిల్లు లేపాక్షియున్
కొదవే లేదిఁక దేనికిన్ మనకుఁ గోర్కుల్ పూచిపండ్లౌటకున్.

ఓ కళావన్మహారాజ! నీకు నిపుడె
శ్రీ కళారాజ్య పట్టాభిషేక మిచట
నీ కళానిధినుండి స్రవించు సుధలఁ
జేయుచున్నాఁడ దశదిశల్ చెలఁగిచూడ.

నా మనమున్ ధనంబులును నా ప్రజతోడును నాసమస్తమున్
నీ మృదులాచ్ఛ శిల్పకమనీయత కిచ్చితిఁ గాన్కగా నిదే
స్వామి శివార్పణంబుగ భవన్మహిమాతిశయంబుతో కళా
శ్రీమహిళా మనోహరుని సేవకకోటిని నేలుకొ మ్మిఁకన్.

ధరణికెల్లను నా పరాత్పరుఁడె ప్రభువు
అతఁడె కళాశ్రీపతి యతఁడ కాదె
యీ జగన్నాటకమునకుఁ బ్రేక్షకుఁడగు
రసికుఁ డాతని లీల కేఁ బ్రణతులిత్తు.

అను చా ధరణీవిభుడున్
విను చా శిల్పియును విశ్వవిభు ప్రభయందే
మనములను లగ్న మొనరిచి
కనుగవలన్ మూసి యల్లె కనిరి సమాధిన్.

కను తెరచి చూడ వారికిఁ
కనిపించెను లోకమెల్లఁ గను తెరచుట క
న్యా నవారుణ రేఖలలో
వినోదముగ నంత వారు వెడలిరి పురికిన్.

సంబర మొప్పనంత నరసంబుగ నామహనీయశిల్పిభా
వాంబరమందుఁ గైపయిఁదమంతటఁదామె స్ఫురింపసాగె ది
వ్యంబుగఁదాను చూపఁగడు నాసలువడ్డ శిలాకళామహా
శాంబరి దివ్యమంత్రములు సాధితముల్ సవశక్తియుక్తముల్.

అంచిత కూర్మశైలశిల లన్నియు శిల్పివరేణ్యుడున్ బరీ
క్షించె, మహాద్భుతప్రతిభ నేర్పఱచెన్ మదిఁ గట్టడాలు క
ట్టించు క్రమంబు, శిల్పముల నెల్లను దీర్చుక్రమంబు సాయమే
తెంచిరి శిల్పులున్, ప్రజనుతించెఁ జలించెను గుప్తవిత్తముల్.

ఆ విరుపక్ష రాచరికమంతయుఁ దమ్మున గొప్పఁజెప్పి తా
నా వరకూర్మ పర్వతమునందె తిరంబుగ నిల్చె సత్కళా
సేవకుఁడై యమోఘముగ శిల్పశతంబు లుపక్రమించు నా
నావిధ శిల్పగాన వహానంబునకు న్నవరించుచున్ శ్రుతిన్

ఈ శుభవార్త దేశమున నెల్లెడలన్ ప్రసరించె సమ్ముదా
వేశము నిండ లోకమునఁ బెల్లుగ సాయము సేకురె న్నమా
వేశము లుత్సవంబులును భేరులు మ్రోఁతలె యొందు నిండి పో
గా శుభవా ముహూర్తమును గన్గొని నిల్పిరవేగ శంకువున్.

లేపాక్షిపురము సమీపంబునందు నా
కూర్మాద్రియను చిన్న గుట్టపైన
నొకవైపు పాపనాశకుని లింగంబు నిం
కొకవైపు వాయుపుత్రకుఁడు, రాము
డును బ్రతిష్ఠించిన మునుపటి లింగముల్
పరగు తీరున మధ్య భాగమందు
విరుపణ్ణ యిలువేల్పు వీరభద్రస్వామి
దేవళం బుత్తర దిక్కు ముఖము
కలిగియుండెడి విధమునఁగట్టుటకును
దాని కీశాన్య దిక్కునఁ దనరునట్లు
పాపనాశేశు గుడి దాని ప్రక్క గౌరి
దేవళంబును నిర్మింపఁ దివిరి యంత.

పాపనాశున కెదురుగాఁ బరగునట్లు
శ్రీ మహావిష్ణు గుడిని నిర్మింప మరియు
వీరభద్రుని భార్యయై వెలయు భద్ర
కాళిదేవళ మొక ప్రక్కఁ గట్టఁ దివిరి.

ఈ గుడులగుంపు సర్వము నిమిడియుండు
నట్టి యొక పెద్ద భవనంబుఁగట్టి యందు
దుర్గ మొదలగు దేవమూర్తులను స్తంభ
పంక్తి సృజియించి నిలుప భావమున నెంచి.

పరగ దానియందే పంచలోహంబుల
ప్రతిమ లుంచ నొక్క పాత్రయును
సర్వలోకనాథు శయనమందిరమును
సుస్తముగ సృజింపఁగోరి మరియు.

ఉత్తరపుదిశ వాకిలి యొప్పుచుండు
నా భవనము ముంగిట నొక యద్భుతమగు
రంగ మంటపమునుగట్టి రంగుమీఱు
శిల్పములనందు స్తంభాల నిల్పఁదలఁచి.

దాని కద్భుతమగు మహాద్వార మొకటి
కట్టి యట్టులే యొక ప్రాకార మచటి
నుండి కట్టుచుఁ గల్యాణ మండపమును
నితర శిల్పాలనందు నిర్మింపఁదలఁచి.

వీనికెల్లను చుట్టును వెలయునట్లు
భద్రముగ బృహచ్ఛిలలతో భవ్యమయిన
యొక్క ప్రాకారమునుగట్టి, యున్నతముల
ద్వారముల మూఁటినందు నిల్పంగనెంచి.

వచ్చు భక్తుల వసతికై పరగునట్లు
మండపంబుల వరుసలు మహితమైన
సోమవారమండపమును సొబగుమీఱ
ప్రహరిలోపల, చుట్టు నిల్పంగఁదలచి.

గుట్ట క్రిందను లేపాక్షి పట్టుదాకఁ
గట్టఁగా నెంచి వరుస ప్రాకారములను
వాని లోభాగమున మంటపములు గట్టి
తగిన సౌకర్యముల్ గూర్పఁదలచి మదిని.

ఆ మహాశిల్పి యందరియభిమతంబు
వడసి, యిన్నింటికిని దగువారి నందు
నందు నయ్యయికార్యములందు నిల్పి
అంతమందికిఁ దగుసలహాలు చెప్పె.

ఎంతమందిశిల్పు లెందరు పనివార
లెన్నియులులు సుత్తు లెన్నిశిలలు
నెన్నిపరికరమ్ము లెంతధాన్యము ధన
మ్మెంతసంబర మ్మదెంతభక్తి.

అమ్మహాశిల్పి శంఖారవమ్ము మేలు
కొలిపె వేయా ఉలుల కలకలకలమ్ము
నాస్వనమ్మున వినిపింపదయ్యె నేమొ
నభమునందలి దేవదుందుభిరవమ్ము.

చీల్చుచుఁజీల్చుచుంజనఁగఁ జేతికిలోఁగను గండశైలముల్
తొల్చుచుఁదొల్చుచుంజన గతుల్ గని రూపములన్
ధరించుచున్
మల్చుచుమల్చుచుంజనఁగ నవ్యవిలాసముఁ బెంచుచున్ శిలల్
నిల్చుచునిల్చుచుంగనియె నిశ్చలనిత్యసురాలయస్థితిన్.

సంకల్పించినటుల్ పనుల్ నడువగా సాగెన్ మహాశిల్పరా
జాంకంబొప్ప నులిన్ ధరించి యటు లేపుంఖానుపుంఖంబుగా
సంకల్పా లవతారమెత్తినటు విశ్వస్తుత్యశిల్పంబులం
గైంకర్యంబుగ నాపరాత్పరునకుం గావించె నెన్నింటినో.

తోడిశిల్పులుగూడ నద్భుతములైన
శిల్పశతముల వరుస సృజించినారు
లలితకలితాచ్ఛదివ్యశిల్పములతోడ
సాగె నాలయనిర్మాణసరసకృతియు.

మైనమా కాదు, మరిబంకమన్న గాదు,
కనకమునుగాదు, లోహముల్ గావు, కావు
జలపపున్ రాళ్ళు పెట్టుకు 'ఘట్టు' మనుచుఁ
బగులురాతిలోఁ గళఁజూపుపగిది వింత.

రాయియే శిల్పులకు నపరంజియయ్యె
నంతయేగాదు సత్కళానంతదివ్య
శక్తి నయ్యెను స్వరములు, శబ్దములును
భావములు, శిల్పనాట్యసంభారములును.

ప్రసరించి లేపాక్షి పట్టు ముట్టుచునున్న
ప్రాకారములు మంటపములు మొదలు
లోనిగర్భగృహాల లోభాగములదాక
మలవనిరాతినే నిలుపలేదు


నేరుగా చూపులనేరలే నుట్టు ప్రా-
కారాల కొకయింత గారలేదు
మదపుటేన్గులకును మొదము గ్రక్కదలించు
పెద్దరాదిమ్మ్రలే పేర్చినారు

బహువిధంబుల చెక్కడాల్, పార్శ్వములును,
ముఖములును, శిల్పములు గల్గు ముద్దుస్తంభ
ములనె నిల్పిరి మంటపంబులకుఁగూడ
మొండికంబాలు గింబాలు మొదలె లేవు.

సముచితోన్నతపీఠముల్, స్తంభపంక్తి,
కుడ్యములు, మంచిమేల్కప్పు, గోపురములు
గలుగు నానావిధాలశాలలను, మంట-
పముల గుళ్ళను గట్టి రబ్రమ్ముగొలుప.

పొలములును, చెట్లు, పట్టణమున నెసంగు
సౌధములకంటె నెత్తైన స్థలముగాన
ప్రహరిలోఁగల మూఁడుద్వారములఁ జొచ్చి
విమలమారుతము ప్రదక్షిణములె సలుపు.

వెలయఁ బ్రదక్షిణమ్ములుచేయుచునె చూచు
మంటపపంక్తులన్ మహితమగుచు,
నుత్పాతమును, పాత, ముత్పాతమును గల
అలవలెఁ జెలువులు గులుకుచుండు



స్త్రీలు - శిరోజాలంకరణము
లేపాక్షి వర్ణ చిత్రము

చుంచుఁ జూపులుపారి చూచునందాకను
దప్పనిసరియంచుఁ గప్పినారు
చుంచులోవైపు మె ట్లంచులఁదీర్చి రం
ధ్రములుదొల్చినది యబ్రమ్ముగొల్ప

మెట్లయంచులఁ దీరిచి మేలిమ్రుగ్గు
లలరుఁదీవలు సరిపెణల్ పలువిధముల
బంధములుఁ జూపి రాశిల్పివరులు విప్పి
వివిధరేఖావిధాకళావిశ్వములనె.

స్తంభములు నూర్లకొలదిగఁ దవిలి తనివిఁ
గనక నొక్కొక్క స్తంభంబునను న వెన్నొ
ముఖము లొక్కొక్కముఖమున ముద్దులొలుకు
శిల్పములుఁ దీర్చ శిల్పుల సిద్ధియేమొ.

ఒక్రముగ్గున్నటు లుండ దింకొకటి సంయోగంబు కేలోటులే
దొక టింకొక్కటిఁబోల వాముడులు సంయోగంబు
భద్రంబై యా
నొకపూవుంబలె నుండ దొక్కపువు సంయోగంబు
సౌందర్యమా
నొకశిల్పంబునుబోల దింకొకటి సంయోగంబు పెంచున్గళల్.

సూర్యులు, చంద్రులు, క్షోణీజములు పూలు
పండ్లును, జిలుకలు, వారిజములు,
మీనముల్, కూర్మముల్, మృదుహంసలును పాము
లును పాఁపముళ్ళును వనచరములు

వృషభంబు లావులు మృగములు మునులును
అంగనలును శివలింగములును
విఘ్నేశ్వరులు మహావీరులు, శూరులు,
వారువంబులు మత్తవారణములు
నింక నెన్నియో శిల్పము లేదిలెక్క
వేనవేలుగ స్తంభాల వివిధములుగ
సృష్టిచేసిరి విశ్వంపుసృష్టివలెనె
విపులమయి యుండ శిల్పుల ప్రేమయెంతొ.

త్రిజగన్మాతఁ బయోఽభిషేకములచేఁ బ్రీతాత్మఁ గావించు గజరాజంబు లటన్న నెంతమదిలో గారాబమో, శిల్పులా ధ్వజ పీఠమ్ముకు చుట్టునున్ మహాద్వారాల పార్శ్వంబులన్ గజరాజంబులఁ దీర్చి రెన్నిటినో నానాభంగులన్ రంగుగన్.

ధ్వజపీఠమ్ముకు ముంగిటన్ గల మహాద్వారంపు చౌకట్లపై త్రిజగన్మోహనలీలఁ దీర్చిరి లతా శ్రీమండలాంతర్నటీ వ్రజనాట్యాద్భుతభంగులాదిగను శిల్పాల న్విలాసంబుగన్ స్రజముల్ గూర్చినరీతి నెల్లరు మహాశ్చర్యంబున న్మగ్నఁగన్.

అలశిల్పార్ణవ మల్లె పొంగెనో, కళాచ్ఛాకాశమే శిల్పితారల మ్రుగ్గుల్ వెలయించెనో, లలితశిల్పాలన్ ప్రసూనంబులన్ గళయన్ కల్పవనంబె రాల్చెనో, కళాగాంధర్వవేదంబె ముద్దుల శిల్పాలను రాగమాలికలు మాధుర్యంబులే చిల్కెనో,

అనఁగా నొప్పెడి రంగమంటపము సత్యంత ప్రయత్నంబునన్
ఘనమా శ్రద్ధఁ గళాపిపాస హరిసత్కారుణ్య సంపత్తి నా
యనఘుల్ శిల్పులు సృష్టిచేసి పరమాహ్లాదంబునన్ బొంగి రెం
డను హద్దున్నదె ? సత్కళా సృజన సంతోషాన కీర్ధారుణిన్.

ఉన్నతరంగమంటపపు టుజ్జ్వలపీఠముచుట్టు నేలదా
క న్నగిషీపనుల్ గలవు కాంచనకారుల మేలుబంతియై
యన్న వచింపఁగావలెనె యం దొకకొంత ప్రదేశమున్ వృథా
యన్నది లేదటంచు, నిసుమంత కొఱంతయు నుండరాదొకో.

రంగమంటపమధ్యరంగమ్మునన్ వల
యాకృతి స్తంభము లమర నిల్పి,
యా స్తంభముల మనుష్యప్రమాణముగల
దివ్యమూర్తుల నెన్నొ తీర్చినారు,
వీని కిర్వంకల వివిధాద్భుతములైన
శిల్పముల్ దీర్చిన చికిలిపనుల
స్తంభాల వరుసలు చాళ్ళుగా నిలిపి రం
దంతరిక్ష స్తంభ మనఁగ నొకటి
నేలఁదాకక యుండెడి లీల నిలిపి
రడుగుభాగంబునం దొక్క యంబరంబు
వేసితీసినఁ బూర్తిగా వెడలిరాఁగఁ
బైన నైనచో బిగియింపె కానరాదు.

మధ్యరంగమ్ము చుట్టు స్తంభములఁదీర్చి
అప్సర స్త్రీలు యక్షులు నమరవరులు
నాడుచును పాడుచును నున్నయట్లు తాళ
మొప్ప వాద్యముల్ వాయించుచున్న యట్లు.

ఆపూర్ణేందుముఖంబు లాకనులలో హాసంబు లాభావముల్
శ్రీపూర్ణంబులు హారముల్ మకుటముల్ శృంగారభూషాదులున్
ఆపాంగా రెడి నాట్యభంగులును రమ్యత్వప్రభుత్వంబెకా
నా పాదాగ్రనఖంబు సుందరములై యామూర్తులొప్పారెడిన్.

పరమ సుందరగంభీర సరసమూర్తి
ప్రకట భిక్షాటనేశ్వరు పట్టునందుఁ
జిక్కె మోహనఁ దా శిల్పి యొక్కయింత
వెలికిఁ బచ్చిశృంగారమ్ము నొలుకఁబోసె.

మధ్యరంగంపుఁ బైకప్పుమాత్ర మొక్క
బోరలించిన సుందరఫుల్లపద్మ
మట్లు నిర్మించి మధ్యను నజ్జ మొకటి
తీర్చినా రౌర! చెలువుల తేనె లొలుక

ఇంక భవనమ్ములోపల నెన్నో విగ్ర
హముల తీర్చిరి స్తంభాల, నందు నొక్క
స్తంభమందునె నిల్పిరి జగతి నోము
దుర్గఁ జంద్రమౌళీశు సంతోష మొప్ప.



పాంచాలజాతి పురుషుడు
లేపాక్షి - శిల్పము



కి రా తా ర్జు నీ య ము

లేపాక్షి వర్ణచిత్రము.

వరసౌందర్యము సంగసౌష్ఠవము దివ్యంబైన లావణ్యమున్
బరగన్ పద్మినిజాతిదివ్యవనితన్, బాంచాలజాత్యుల్లస
త్పురుషశ్రేష్ఠుని నొక్క స్తంభమునసేప్రోత్తంబులౌలక్షణాల్
వరలన్ జూర్ణముగా రచించిరి మహాప్రావీణ్యమొప్పారఁగన్.

విరుపణ్ణయిలు వేల్పు వీరభద్రస్వామి
భద్రసుందరమూర్తి భద్రకాళి,
రమ్యరాజన్మూర్తి రఘునాథదేవుని
నతని సోదరియైన యభవుభార్య
గౌరీమహాదేవి, ఘనభక్తి నిర్మించి,
యయ్యయి దేవళాలందు నిల్పి,
రా భవనము గోడలందున వెలుపల
దివ్యశిల్పము లెన్నొ తీర్చినారు,
భక్తసిరియాళుకథ నొక్కవైపు వరుస
నద్భుతంబగు నా కిరాతార్జునీయ
కథను నొకవైపు తీర్చిరి కర్ణములకె
గాక రచియింపఁ గనులకుఁ గట్టినట్లు.

లేపాక్షి బసవనకుఁ దా
నేపున సరియగుచు సరిగ నెదురుగ నుండన్
రూపించి తీర్చి రంతన్
లేపాక్షి ఫణీంద్రు నభవులింగముతోడన్.

దొడ్డగణపతి సీతమ్మ తూగుటుయ్యె
లలనె యూగిన మంటప మ్మలరు "దోన"యు
మున్నగాఁ దీర్చి శిల్పలు కన్నులారఁ
గాంచి యుప్పొంగి ధన్యతఁగనిరి కలిసి.

జగతికే యశనభిక్షను బెట్టు కర్షకు
    కృషికంటె హెచ్చగు కృషిని జేసి,
జనతావిరాట్స్వరూపునె కప్పు తంతువా
    యుని మించి యల్లిక పనిని జూపి
గృహదాత చిరగృహితేచ్ఛ వేసెడి పునా
    దుల మించి మేల్పునాదులను వేసి,
రమ్యరత్నాలకై రస నబ్ధిఁజొచ్చు శూ
    రులమించి భూతార్థములను దరచి,
పలువిరులఁ బెంచు తోటమాలులను మించి
నవ్యసుమనోవికాససుందరతఁ బెంచి
పరమనిర్వృతి నొసగు శిల్పములు వారు
చేరి సముదాయశక్తి సృజించి రార!

విశ్వశక్తిజమౌ సృష్టిబీజ మరయ
వరసరస్వతిశక్తి విస్తరము గనుచు
ధరఁ గళావిశ్వసృష్టి సుందరతఁ జేయు
వరుస విశ్వకళలె యందుఁ బ్రతిఫలింప.

ఇరులఁ జెండాడి రాగరసాన నుదయించు
వేవెలుంగువెలుఁగు విరియుచుండ
విరివిగా విరిసి సుపరిమళమ్ములె చిమ్మ
ప్రసవాభిరామ సంపదలె కురియ
నప్పుడే ప్రసవించినట్టి గోమాత పా
విత్ర్యంపునింపులే పేర్మి నొసఁగ,
సుపవిత్రు నింటిలో సుతరత్న ఫలము జ
నించి పెంచెడి మోదనిధులు పేరఁ

గలశపాథోధి వల్గితగర్భవీచి
యమృతరసమును గార్చు నాయమృతకిరణుఁ
గడుపు చల్లఁగఁ గనుకొన్న కలికిచలువ
చిలుకఁగులుకుచు సత్కళాసృష్టి వెలసె.

వివిధ సురూపరేఖలు, విభిన్నసహస్రవిలాసభంగులున్
వివిధసువస్తువిస్తృతులుఁ బెక్కువిధంబుల హావభావముల్
వివిధరసంబులుం బలువివేకవిశేషవశోపదేశముల్
వివిధరుచుల్ ధ్వనించెడిఁ బవిత్రశిలామయశిల్పసృష్టిలో.

ఎన్నేండ్లీ పని సాగుచుండినను భూమీశుం డాకేదీక్షతోఁ
గన్నుల్ మూయక కాచుచుండె సుకళాకల్యాణపీయూషమున్
గన్నుల్ గ్రోలఁగఁ గ్రోలఁగన్ దనివియే కన్పింప దాయెం
గదా
యెన్నండీపని పూర్తియౌనో యెఱుఁగండెవ్వండు నచ్చోటునన్

వీరభూపతి పెనుగొండవిభుత్వ మెఱయ
రాజ్యపాలన చేయుచుఁ బ్రజల కెల్ల
విరుపభూపతి లేని యాకొఱతఁగూడ
తీర్చుచుండెను దులలేని దీక్షతోడ.

తాను, దనసోదరుండును, దాచిపెట్టి
యుండిన ధనమ్ముఁ దాఁ జేర్చుచున్న ధనము
నంతటిని బంపె లేపాక్షి కన్నయాజ్ఞ
భ్రాతృభక్తిని దేవతాభక్తి నతఁడు.

అంతియ కాదు, మోద మెసలారఁగ రమ్యకళాపిపాస య
త్యంతము పల్లవింప మధురాద్భుతచిత్రకళావిధాతలన్
ఎంతో ధనం బొసంగి పిలిపించి నిజాగ్రజునొద్ద కంపె శ్రీ
మంతుఁ డతండు శిల్పములమధ్య లిఖింపఁగఁ జిత్రచిత్రముల్

పూర్ణములై నభాగములఁ బొల్పుగ వారు లిఖించి రెన్నడుం
జీర్ణముగాని వన్నెల విశేషము మిద్దెలఁ గొంత గోడలం
జూర్ణకళల్ వెలుంగఁగ నపూర్వపుఁజిత్రము లెన్నొ వేడ్క శి
ల్పార్ణవపూర్ణతం గొలుపు చబ్బుర మందగ నెల్లవారలున్.

ఎచట నేదేవతను బ్రతిష్ఠింపవలెనొ
యచ్చటా దేవతను నిల్పి, యతిముదమున
దివ్యవైభవ మొప్పఁ బ్రతిష్ఠ సలిపి
నిత్యపూజాదికములకు నియతిసేసి.

వరభక్తిన్ విరుపణ్ణ దేవతలకై సా్వర్ణంబు వెచ్చించి, వి
స్తరహా భూముల నెన్నొయాళ్ళఁ గొని, యాచంద్రార్క
తారంబుగా
బరఁగన్ దానముసేసె సస్యధనికుల్ భక్తాళియున్ దానముల్
వరుసం బెక్కులుసేయునట్లుసలిపెన్ భవ్యాత్ముఁడై త్యాగియై.

ఇంతయైనను నిర్మాణ మేమొ ముగియ-
లేను, విరుపణ్ణ ధన మెల్ల లీన మయ్యె
సృష్టదృష్టమౌ కళయం దదృష్ట మింక
నెట్టు లున్నదో తెలియలే దెవ్వరికిని.

విజయనగరానఁ గడతేరె వృద్ధరాజు
బాలుఁ డొక్కఁడు సామ్రాజ్యపాలనంబుఁ
జేతులనుబట్టె, శాత్రవుల్ చెలఁగి రంతొ
కూటకౌటిల్యఘూకసంకులము కూసె.

శిల్పు లెట్టులో తమపనుల్ చేయుచుండి
రవనినాథుండు చాలసాహసముచేసి,
ధనికవర్గంపుఁ బ్రజల యాదరముఁ దెచ్చి
యేదొ విధముగఁ బని నడిపించుచుండె.

విరుపభూపతిగాని, తత్ప్రియవయస్యు
డైన యాదివ్యశిల్పియేకాని, యెంత
మాత్రమును బట్టువిడువక మధురశిల్ప
వారినిధి మున్గి తేలుచు వరలినారు.

ఇఁకను గల్యాణమండప మొకటి యచ్ట
మిగిలియుండెను, బసిఁడియే మొల్లగాని
సాగుచుండెను, కాలము చాలమారు–
చుండె నెంతయుఁ గలి వగుచుండె ధనము.

జరుగుటయె కష్ట మగుటచేఁ జాలమంది
శిల్పు లచ్చోటు విడిచిరి, జీవనంబుఁ
జేయు చెట్టులో తక్కు–వశిల్పివరులు
విరుపభూపతియును పట్టు విడువ రైరి.

## 3. మార్పు

పట్టుగ నమ్మహీశునెడ వైరము పెంచుచు దుర్గుణాలకుం
బుట్ట యనంగ నుండెఁ బరిపూతున కాతని కొక్క జ్ఞాతి లోఁ
గట్టిడి చెట్ట, పైకి నవకంబును జూపెడి మేడిపండు, స
మ్రాట్టును జేరె వాఁ డెటులొ మంతనముల్ సలుపంగ
వానితోన్.

బాలుఁడు రాజరా జిఁకను వంచకులం గనిపెట్టు శక్తి లే
దాలములే యెటుంగనిన నాతనిచుట్టును, వీనిమాయ వా
గ్జాలమునం బడెం బరమసత్పురుషుం డని నమ్మి వానిఁ దా
నే, లయకారిని న్వైరిగి నేతినిబడ్డది వానిరొట్టెయున్.

అతివినయంబుఁ జూపు నధమాధమధూర్తుడు వాఁడు త్రేనికిన్
గుతుకముతోఁ గతల్ పెనిచి కొండెములం గడు చెప్పి వీరభూ
పతిపయి, వానియన్నపయి, వానికి నూకొని రాజరాజు స్థా
పితశుభులైన వారిఁ బదపీచ్యుతులన్ సలిపె న్మహాత్ములన్.

అధికారంబు తొలంగెనంచు మదిలో నారాటముం జెంద కా
విధి దూషింపక పీనసోదరవరుల్ పెన్గొండనే వీడి య
త్యధికాధ్యాత్మికశాంతికాంతు లలరం దద్రమ్యదేవాలయ
మ్మధివాసమ్ముగ నుండి రుల్లసిల లేపాక్షి ప్రజల్ సర్వులున్.

గోముఖవ్యాఘ్ర మాకుటిలాత్మకుం డెక్క
నటఁ బెనుగొండ సింహాసనంబు
గద్దితిం చిన్నాళ్లఁ గాలంబు గడిపిన
వానికి సుప్రజోద్యానమెల్ల
మేసివేయఁగ లోన మొండగునాఁకలి
జనియించె వెంటనే చపలమతికి
నరులమాంసము భక్షణము నేయు నాశయు
ములుగుచ్చుచుండె లో మూలయందు
బకతపస్వులు, కడియాలు పట్టుకొన్న
ముసలిపులులును, వృద్ధజంబుకము లెన్నొ
వాని యాస్థానమున వానిబంటు లగుచుఁ
జేరెఁ గ్రొత్తగా నింకేమి సెప్పవలయు?

చల్లని ప్రభువు లాచక్కని సోదరుల్
దనువీడఁ బ్రజయెల్ల తల్లడిల్లెఁ
గపటవేషము విడి కాల్చసాగిన ధూర్త
ఖరకరు కరపరంపరలు పెరిగి

సారమంతయుఁబీల్చిసాగినఁదపియించె
ధర్మజ్ఞు లిట్టి యధర్మమైన
కార్యంబుఁ గని చాల కళవళపడి ధైర్య
ముగఁ జాటసాగిరి మూలమూల

"విరుపభూవిభు వీరభూవిభునిఁ దొలఁగఁ
జేయ నేకారణము లేదు, న్యాయ మొప్ప
దీపనిని, న్యాయరీతిగ నిపుడుగూడ
వారె మనవిభులై యున్నవా" రటంచు.

సరి యనిరి పెద్ద లెల్లరుఁ
గరముల నీయ మని రేకకంఠమునఁ బ్రజల్
చిరచిర లాడెను ధూర్తుం
డరమరపడెఁ గుమిలెఁ గమలె నాతని ముఖమున్.

అదయుడు నూత్న గోపుడు దురాశకు లోఁబడి సుప్రజాళియన్
మొదవునుబట్టి తీక్ష్ణకరముల్ నిగిడించి బలాత్కరించి సం
పద లనుపాల నావిరుపవత్సముకై నను దొట్టు నిల్పకా
పొదుగునఁ దానె పిండుకొని పోవుటచేఁ గడుబీద దయ్యెనున్.

ఆప్రజాధేను వాకళార్ధార్ధి విరుప
వత్సముం గనుగొని తత్పిపాసఁదీర్చ
నవ్యయప్రేమ హృది నూధమందుఁ బాలు
పొంగ మరలను నడపెఁదత్పోషణంబు.

దీనిఁ గనినంత మండలాధీశ్వరునకుఁ
గడుపుమండెను, మరియింత కసలి యతఁడు
ప్రజల హింసింపసాగెను, ప్రజలు మాత్ర
మాగ్రహంబును విడువలే దప్పుడు వాడు

కొంచెముకూడ లొంగ దిటు కొట్టినఁ దిట్టిన నీ ప్రజాళి, తాఁ
బెంచు మరింత వైరమును, బిమ్మట నమ్మదు నన్నటంచు లో
నెంచి ప్రజాధినాయకుల నెల్లను లంచము లిచ్చి మెల్లఁగా
వంచనచేసి యల్లె తన వైపునకున్ మరలింపఁజూచినన్.

విరుపభూపతిశిక్షణఁ బెరిగియుంట
ఖలుడు వేసినవాత లింకను మనంబు
నందు సమయకయుంట, నాయకుఁడెవండు
వాని వలలోనఁ బడకుంటవలన వాఁడె

వంచితుఁడై చురుక్కు మని భావము నొవ్వఁగ లోన రోషమున్
బెంచుచు నింతకున్ విరుపవీరుడె కారణ మంచు, వాని హిం
సించుట యెట్టు లంచుఁ బ్రజలెల్లరు నాతనియందె ప్రేమపూ
రించిరె నన్ను గాదనిరె యే దిఁక దిక్కనుచున్ దహించుచున్.

యోచన చేసిచేసి మది నూరక యూర్పుల నూర్చి యూర్చి యా
నీచుఁడు పాప మాఘునుని నిందలపా లొనరించి కూల్పఁగా
యోచనచేసి, తత్ప్రజల యుల్లముఁ ద్రిప్పఁగ నెక్కువెట్టి తాఁ
బాచికలన్ రహస్యముగఁ బాణిని ద్రిప్పఁగ సాగె మెల్లఁగా.

తిరిగెను గాలచక్రమును, దీప్తులు చేసు వసంతమంత్రియున్
బిరబిరసాగిపోయి యతిభీషణమై యరుదెంచె గ్రీష్మమున్
ఖరకర తీక్ష్ణతేజ మధికం బయి దుస్సహమౌ స్తరంబునై
కొఱవులు గ్రుచ్చుచుండెఁ గనుగ్రుడ్లకుఁ దాపమె నిండె
నెల్లెడన్.

వేడిగాడ్పులు చెలరేగి తోడొసంగ
మండె వేసవి మంటలు మంటినుండి
మింటిదాకను నొకటిగా మేడలందు
నుండు జనులును లోననే యుడికిపోవ.

విజయనగరాన మరియింత వేడి, యంతి
పురము, యంతఃకలహాశిఖుల్ పెరుగుకొలిమి
విసివి సామ్రాట్టు వేసవివిడిదియైన
* 'ఘనగిరి'కి వచ్చి యెక్కె నా గగనమహాలు.

అది కృష్ణపక్షమందలి
తుదిరాత్రులయందు నొకటి, ధూర్తుడు తలఁపుల్
మదిఁ బేర్చు చొకటిపై నొక
టిది యది యని మహాలుమెట్ల నెక్కుచు వచ్చెన్.

పగలెల్ల లోక మంతట
భగభగమని మండి గ్రీష్మపటుశిఖ లారన్
పొగనిండుకొన్న తీరున
జగమెల్లఁ గవోష్ణతమ మొసంగుచు నుండెన్.

* పెనుగొండ - [నేటి అనంతపురము జిల్లాలోని]

అవనిరాజరా జప్పుడు హర్మ్యముపై గదిముందున్నెటఁ దా
లోపల వేడిగాలి బయలున్ బరికించుచు, రత్న హాటకో
ద్దీపితమంచమందుఁ గరదీపికలన్గొని కొంతదూరమం
దే పరిచారికల్ కొలిచి నిల్వఁగ నుండెను విశ్రమించుచున్.

అట్లు పరుండియుండిన యిలాధిపుఁ డాకసమందుఁ జిమ్మచీఁ
కట్లను, మిన్కుమిన్కుమని కన్పడికన్పడ కుండు తారకా
కోట్లను గాంచు చేదా మది గాఢముగాఁ దలపోయుచుండె నా
కట్లు చలింప, దచ్చటికి హాజరు పంచకచక్రవర్తియున్.

విభుఁడు నంతట నిట్టూర్పువిడిచి లేచి
కూరుచుండెను బడమట కొండవైపు
ముఖముగా నంత మండలభూవిభుండు
విభుని దవ్వుల నుండియె వినుతిసేసి.

వినయ మెంతయుఁ జూపుచు విభునికడకు
నమ్రుడై వచ్చి తచ్చరణములయందు
సాగిపడె వాని యనుచరుల్ సాగిపడిరి
కనకరత్నాలకానుకల్ గొనుచువచ్చి.

దీని నెల్లను గాంచి సంతృప్తి నొంది
రాజరా జాతనిని 'లెమ్ము రాజ!' యనిన
భక్తి చూపు చతఁడు లేచి ప్రభునిచరణ
యుగళి కొద్దనె క్రిందఁ గూర్చుండె నపుడు.

విభుడు పరిచారికాధృతవివిధదీప
కాంతి వంచకుముఖమును గాంచఁగల్గె
లెస్సగాఁ గాని తమమున లీనమైన
యెదుటి పెనుగొండకొండ లక్షించు నెట్లు?

ముఖమున మందహాసమును ముగ్ధతభక్తిని దోఁపఁజేయుచున్
సుఖకరవాక్కులన్ బతిని జొక్కఁగఁజేసి ఖలుండు వానితో
సఖునివిధాన వానిమది సక్తముఁగా విషయాలమర్మముల్
నిఖిలమెరింగి తద్విషయనిర్వృతిఁ గూర్చుచుముచ్చటించినన్

ముగ్ధుఁడౌ రాజరాజు తా మురిసిపోయెఁ
దాపహర మగుచు శీతవాతంబు వాని
పైన వీచిన ట్లాయె, దీపశిఖ లేమొ
నిశ్చలంబుగ మండుచు నిలిచియుండె.

వంచకుం డంతఁ బతి తనవాక్కులకును
ముగ్ధుఁడై యుంటఁ గనిపెట్టి ముఖమునందు
వన్నెమార్చుచు నట్టులే ప్రకృతమునకు
వచ్చి మెల్లఁగ నిటు విన్నపంబు సేసె.

అంతగ మీకు ద్రోహము హృదంతరమందున నెక్కువెట్టి నాఁ
డంతలు సేయ నావిరుపుఁ జాతనితమ్ముఁడుఁ బన్నుమాయలన్
సుంత యెఱింగి నామనసు నొచ్చిన వచ్చి భవత్సమీపమం
దంతయుఁ జెప్పికొంటిఁ గద! యన్నిటి కేలినవారె దిక్కుగా.

దైవవశంబునన్ మనకుఁ దత్కుటిలాత్ముల యొత్తులెల్ల ముం
దే విదితంబు లయ్యెఁగద, దేవుని చల్లనినూవు, ధర్మమున్
మానయి పుండఁబట్టి సుగమంబుగ వారిని బారఁద్రోలి, రా
జ్యావనమున్ ప్రజావనముఁ బ్రాణధనావనమానరక్షణల్-

చేసికొనంగనయ్యెఁ గద చిత్రము గ్రుచ్చెడి ముల్లు బైటికిన్
దీసినగాని యెందుఁగలదే సుఖ మొక్కక్షణంబుగూడ, క
న్నాసిన మోసమూనరసి ముందును వెన్కయుఁగుక్కవోలె వి
శ్వాసముఁ జూపువానిఁగద బంటుగఁ జేసికొనన్ వలెన్ నృపుల్

మీకయి ప్రాణముల్ విడుచు మేటిగులామని కాదె వీనిపై
మీకృపఁజూపి వీని కొకమేటితనంబు ననుగ్రహించినా
రోకరుణాపయోనిధి! సముజ్జ్వలరత్నచయంబి దంతయున్
మీకరుణాపయోనిధి జనించినదే కయిక్కొమ్ము దేవరా!!

మీకరుణామృతం బది యమేయముగా బ్రసరించుచుండునం
దాఁకను మండలం బిది నిదాఘమునందు వసంతశోభతో
రేకులువిచ్చుచుండు సుపరిమళముల్ వెదజల్లుచుండు మీ
రేకను దుండరే యిచటి యింపగుతోటలనీలు నేటికిన్.

విజయనగరేశకరుణాపవిత్రజలధి
జనితలక్ష్మికి నుద్యానవనముసూవె
వినుతఘనగిరిపురి, మీకు వేసవికిని
విడిది, యెవ్వరైన దీనిని విడువఁగలరె?!

ఈపెనుగొండమండలము నేలుచు నిచ్చట నేనుపెట్టు నీ
దీపముమీది తండ్రి! నలుదిక్కుల దీప్తులుచిమ్ముచుండు నీ
దీపపుదీప్తి యావిరుపధ్రష్టుని కన్నులఁగ్రుచ్చుచుండఁ దా
రేపుచునున్న వా డతడు రేగి ప్రజాశలభంబులన్ ప్రభూ!

పన్నుల నీయకే తిరుగుబా టొనరించిరి నాపయిన్ ప్రజల్
నన్నను మిమ్ముసైతము తృణంబుగనెంచుచు నావిరూపునే
మిన్నయొనర్చి యాతనికె మిక్కిలిగౌరవము నిచ్చుచుండి రా
కన్నులుచూచి, వాఁడు గుడికట్టునెపంబున మ్రింగివేయగన్.

శాత్రవభీషణా! తమకు శాత్రవుఁడౌ నృపునొద్దనున్న యా
మాత్రపుశిల్పిగాక మనమండలమం దిక లేరె శిల్పులే
చిత్రము! వాఁడువచ్చి మనసీమ నెసంగెడిశిల్పికోటికే
సూత్రముపట్టు టెట్టు లని చూపుట సిగ్గులుచేటుగాదొకో!

అంతియగాదు శిల్పి దురితాత్మకుఁ డావిరుపుండు వైరిభూ
కాంతునితోడఁ జేతులనుగల్పెడున ట్లొనరించినాఁడఁటే
యంతయువింటిఁ జారులు రహస్యముగాఁ గనిపెట్టి చెప్పఁగా
నెంతకువచ్చె నింకను నుపేక్షయొనర్చినఁ గొంపకూలదే!

పుణ్యము, పాపము, దయ, దా
క్షిణ్యముఁ జూడకయె రిపు నశేషముగ ధరన్
శూన్యముచేయఁగవలె రా
జన్యున కటుగాక స్మృతులుచదివిన నగునే!

శత్రుమహీపతి వాతము
మిత్రంబై వీచుచుండ మిగిలిన విరుప
క్షాత్రాగ్నికణము రగిలెడి
నాత్రంబున నేగి దాని నార్పం డిపుడే.

అను చాదుష్టుఁడు పాప మావిరుపకళ్యాణాత్ముపై రాజరా
జనకున్ లేనివి పోని వెల్లఁజెవిలో జొన్పించి తనుస్నిగ్ధమా
మనసున్ భగ్నమండఁ జేసె యువసింహం బింక రోషంబుపై
కొనఁగా నెచ్చట దూకునో యెచట నేగోహత్య గావించునో.

చిరచిరలాడు చావిభునిచిత్తముఁ జీల్చుచు రేగి సాగి దు
ర్భర మగునట్టి రుడ్వేషధరంబు గురిన్గని కాటువేయునో
విరుపనరేంద్రుకన్నుల పవిత్రమనోహరకాంతి కట్టులో
సొరగునొ లేక వెన్దిరిగి చోదకునే పరమార్చివేయునో.

ఇచ్చటఁ జీఁకటిన్ జరుగు నీపితలాటక మెల్ల వెల్గునం
దచ్చట శిల్పనాటకము నాడగఁ జేయుచుఁ జూచుచుండు నా
సచ్చరితుం డెఱుంగునెటు? సంయుగమందున నేదిగెల్చునో
యెచ్చట చీకటో వెలుతు రెచ్చటొ యీ విధినాటకంబునన్

## 4. నేర్పు

శ్రీలం గోరి గడించుటాయె రిపులన్ జెండాడుటాయెన్ ధరా
పాలత్వంబునునొంది ప్రీతిఁ బ్రజలన్ బాలించుటాయెన్ ధరన్
జాలన్ బుణ్యము కీర్తి నిచ్చుపనులన్ సాధించుటాయెన్ కళా
లోలుండై రమియించుచుండె నతఁడున్ లోకాంతిధీరుం డటన్.

మాన్యం బయ్యును నేసుఖంబునకు నేసూత్రంబు భోగ్యంబు ళ్ళ
కన్యల్ తీర్చుచునుండఁ గూర్చుకొనువన్ బ్రాప్తిన్ దగన్
గన్న ధా
జన్యం బయ్యు సమస్తభోగరతులన్ జాలించి యేతెంచె నా
ధన్యం డాస్థలికిన్ గళామధురిమన్ దా మెచ్చ నేభోగముల్,

సుందరమూర్త్యచ్ఛ సౌందర్య పానంబు
సరియె కామిని గాంచి మురిసిపడుట ?
అతిభోజనుని విగ్రహాపుహాస్యరస మాను
టకు నీడె తెగదిని డప్పివడుట ?
బహుపుష్పలతల శిల్పపువిప్పుఁ జెప్పునే
కూర్చిన నాణ్యాల క్రుమ్మరింత ?
హృద్య రేఖాభంగు లిచ్చిన ట్టిచ్చునే
హాయిని వట్టియభ్యంజనములు ?

దివ్యసౌందర్య సంతత నవ్య భవ్య
రమ్యరససుధఁబనుపడి త్రవ్వినట్టు
లెల్ల నూరించు కళకు సదృక్ష మగునె
భోగముల నెల్ల సమకూర్చు భూపతియును ?

చక్కిలిగింతవోలె నొక స్వల్పసుఖంబు నొసంగి మానవున్
జొక్కఁగఁగఁజేయు భోగముల చొక్కున జిక్కుచు వాని
'లడ్డు'లే
మెక్కుచు నెల్లవేళ మితిమీరి యనర్థము లందుచుంటయే
యొక్కుడో? నిత్యనూత్నరసహృద్యకళన్ శర ణొందు
టెక్కుడో!

భోగము కొంతసేపు సుఖమున్ కలిగించెడియట్లు తోచుచున్, ఆ కనిపించినన్ మదకుఁ బైనయిఁ గోరిక చిచ్చు నాలుకల్ సాగగఁ జేయుఁగాని సరసంబగు సత్యశివాలె ముందుకున్ సాగదు శాశ్వతంబుగ నొసంగదు తృప్తిని నెవ్విధంబునన్

రాజసములైన భోగాలు రక్త మాన్పఁ
దామసంబగు జడత ఛిద్రంబుఁ జేయు
సత్త్వగుణమును బెంప విశ్వంబు నిండ
సాత్త్వికం బగు కళగాక శక్తి మెద్ది ?

రాజభోగాల చవిగన్న రాజవరుఁడు
కళల రుచిఁ గన్న రసికాగ్రగణ్యుఁడతఁడు
రెంటి భేద మ్మెరుగు జ్ఞాని శ్రేయ మెంచి
శాశ్వతంబుగఁ గళనె దా శరణుఁజొచ్చె.

లలితకళానురాగ సువిలాసములే మధురస్వరూప హృల్లలితసరోజరాగసువిలాసములై తొలినుండి యొప్పుచున్ జిలుకుచునుండె సవ్యమధుశీకరముల్, హృదయాబ్జ,మాతఁడా స్థలి సుధఁ గ్రోల దివ్యకళసన్నిధిఁ బట్టెను శైశుపాత్రగా.

ఏనాఁడావిరుపణ్ణ కూర్మగిరిపై నేతెంచి యుద్యత్కళా నానాగానవితానతానములకున్ బట్టెన్ శ్రుతిన్ నిశ్చల ధ్యానం బేర్పడె నాఁటినుండి పరుసన్ దత్పూర్వకర్మార్తముల్ నానా వాసనలున్ లయింపఁదొడఁగెన్ లక్ష్యంబు సిద్ధించెఁబో.

లక్ష్య నిర్మాణమునకు మూలంబు దాన,
యొసఁగు నయ్యది నవనవరసము, దానిఁ
ద్రావు చానందకాంతిఁ బర్యటన సలుపు
నాతఁ డాత్మను వెదకు కళాతపస్వి.

శిల్ప మతనికి మొదట విశిష్ట రీతిఁ
బ్రకృతికిని లోకవృత్తాంతమునకుఁ జెందు
వివిధరసములఁ గురిసెను విడువ కల్లై
దానియందే నిమగ్నుఁడై తలఁపు నిలుప.

కళలోని యలౌకిక మగు
కళ నానారసములకును కందము, దివ్యో
జ్జ్వలసుందరైకకాంతియు
లలి నా మహనీయునకును లక్షిత మయ్యెన్.

అది సాక్షాత్కారం బయి
నది మొదలు విరూపపతికి నవనవరసముల్
మది నూరు చూరు చుండగ
నొదవె నవిచ్ఛిన్నమోదయోగ మ్మెలమిన్.

వెనుదిరిగి ప్రకృతి, లోకం
బును, జూపులు పరపి లీల మునుకొని చూడన్
గనుపించె నతని కంతయు
ఘనశిల్పమువోలెఁ గ్రొత్తగా రసమయమై.

శిల్పమున లోకరసముల చేవ గాంచి
మొదట, పిమ్మటఁ దా లోకమునునె శిల్ప
రసము గన్గొని సర్వంబు రసమయముగఁ
గాంచ నేర్చెఁ గళాయోగి ఘనుఁ డతండు.

బహుజన్మవాసనాఫలితమై యొప్పుచు
   దివియును గంధర్వాత్మజములును
రసమును గనయునై ప్రకృతిసవిత్రి గ
   ర్భము చల్లగాఁ గన్న రమ్యశిశువు
శైశవదినములఁ జక్షువుల్ విప్పి తా
   మధురవాసన లొప్పు మారుతములఁ
జల్లఁగా మెల్లఁగాఁ జాక్రమించుచు వచ్చి
   యూడు చాకుచె వృద్ధి నంది యుండి
జ్ఞానదీప్తిని రూపముల్ గనుచు వచ్చి
పలురసంబులఁ గ్రోలుచుఁ బలురుచులను
దెలిసి బహుసత్యసిద్ధాంతములను భూమిఁ
బొందియుండిన యామహాభూవిభుండు.

ఆమహాభూమి నారస భూమిఁ గాంతి
భూమి మారుతభూమి నాపుణ్యదివ్య
భూమి నాఘనచిత్కళాభూమి నిలిచి
సత్కళాయోగసంజీవి జనఁగఁ జనఁగ.

అరయ నాకేగతిన్ క్షణము నాగక యేగెడి కాలవాహినిన్
బరిణతి నందుచున్ జనెడి బాహ్యజగత్తున దోచుచుండు సు
స్థిరతరమూలతత్త్వముల తీరున దోచె దొలిన్ గళాజగత్
స్థిరతరసచ్ఛిలాకలిత శిల్పసహస్రముఖప్రరేఖలున్.
స్థిరతరసచ్ఛిలాకలిత శిల్పసహస్రముఖప్రరేఖలం
దరుదుగ వేరువేరుగ ద్వయత్రితయాదిగ లెక్కలేని ప్ర
స్తరముల, వానిప్రస్తరశతప్రశతాల, సమష్టిలో బర
స్పరకలనంబు, బాంధవము, సౌష్ఠవమున్ గనులార
గాంచుచున్.

విరుపవిభుం డలౌకికపవిత్రకళారసకాంతిసంప్లుతుం
డరుదగు సత్యముల్ గనె, ననంతజగత్తున దోచుచుండు సు
స్థిరతరమూలతత్త్వముల శిల్పమె చూచెను, వానిలో బర
స్పరకలనంబు, బాంధవము, సౌష్ఠవమున్ గనె సత్యమున్
గనెన్.

నరులహృదంబుధిన్ వివిధనాట్యము లాడెడిదై రహించు నా
'కరుణము' లోకవృత్తముఖకంపితమై రసభంగులన్ వెసన్
బొరలెడి, లోకవృత్తపరిపూర్ణమనోహరభావతత్కళా
స్థిరమృదుశిల్పకంపితహృదిన్ రసనాట్యము లాడె నాతడున్.
స్థిరమృదుశిల్పకంపితహృదిన్ రసనాట్యము లాడ నాడ నా
కరుణ మెఱింగె నారసముఖంబు విభిన్నరసా లనేకమై
పరగు ప్రమోదమన్ రసము భవ్యము దివ్యము నిత్యనవ్యమై
పరగెను దాన సంఖ్య రసభంగుల నిర్మలజీవనంబుగా.

విరుపవిభుం డలౌకికపవిత్రకళారసకాంతి సంప్లుతిన్
గరగుచుఁ గాంచె దివ్యరసకందము, సృష్టివిభిన్నతన్ బర
స్వరము విరుద్ధతన్ గడు నసంఖ్యములైన రసంబులందుఁ బా
నరసె సమానతన్ వెలయు హ్లాదరసంబె కళాకృతిన్ వలెన్.

సురుచిరసుందరాకృతులఁ జూపుచుఁ జూపుచు సృష్టిలోఁ దెరల్
దెఱచుచుఁ బోవుకాంతులఁ బ్రదీప్తిని బొందిన లోనివెల్గునన్
సురుచుల వెల్గు నా ప్రతిభ శోభిలఁ జేసిన నూత్నసృష్టియా
స్థిరరుచిశిల్పమందు గనె దీప్తమనోహరభావరూపముల్.

స్థిరరుచిశిల్పమందు నవదీప్తమనోహరభావరూపముల్
మెఱయఁ గనన్ గనన్ గనఁ గ్రమేణ క్రమేణ క్రమేణ వానిలో
నురురుచి నిండుచున్ నవనవోన్మిషదంతరదృష్టిదృష్ట సుం
దరతరదివ్యకాంతి మహితప్రతిభా ప్రతిభా విహారియై.

విరుపవిభుం డలౌకికపవిత్రకళారసదివ్యకాంతి సం
భరితుఁడు, బాహ్యసృష్టిప్రతిభామయసృష్టుల స్రష్ట
యాచు సుం
దరబహునూత్నభంగులనె నాట్యము లాడెడి యేకకాంతి సుం
దరబహునూత్నభంగిమల నాట్యమునం గనె దివ్యశిల్పమున్.

వివిధసురూపరేఖలు విభిన్నసహస్రవిలాసభంగులున్
వివిధసువస్తువిస్తృతులుఁ బెక్కువిధంబుల భావజీవముల్
వివిధరసంబులున్ బలువివేకవిశేషవశోపదేశముల్
వివిధరుచుల్ ధ్వనించెడిఁ బవిత్రశిలామయశిల్పసృష్టిలో.

అవిరళభావయోగమున నా శ్రుతులన్ విభునాత్మలో మహా
కవితసృజించు నా ప్రతిభ గానమహాశ్రుతి మేలుకొల్ప భూ
దివములు సృష్టి యయ్యె నవదీధితు లొప్పఁ బునఃపునఃపున
ర్నవనవనవ్యశిల్పసృజనంబును గల్గెను దివ్యరీతులన్.

నవనవరూపరేఖలును, నవ్యవిలాసము, నవ్యభంగులన్
నవనవభావవస్తువులు నవ్యరసంబు, నవోపదేశముల్
కవితయు నిండి పండు నవశిల్పము లా ప్రతిభావిహారికిన్
నవనవదివ్యలోకము లనంతమునన్ దెరవిప్పి చూపెడిన్.

భావము శబ్దమూలమయి భాసిలుచుండును, శబ్దమే భువిన్
భావపరంపరాధ్వనుల భాసిలఁజేయు న వెల్ల శబ్దమే
భావము శబ్దరూప మగు భావమునందలి కాంతి శబ్దమే
భావనచేయ శబ్దవిభవ మ్మయి తోఁచు సమస్తసృష్టియున్.

లోవెల్లెల్లను నాదమై విభుఁడు తా లోలో విలోకించు నా
భావా లెల్ల స్వరంబులై లలితశిల్పశ్రీలై గానంబులై
లావణ్యంబె సురాగమాధురిగఁ గల్యాణాత్మకంబౌ కళా
శ్రీవిస్తారమె యొప్పె నద్వయత నచ్ఛిన్నాచ్ఛసంగీతమై.

భావస్వైరవిహారభంగి భవశిల్పస్నిగ్ధ సౌందర్యను
శ్రీవిస్తార కళావిలాస మధురాచ్ఛిన్నాచ్ఛ గాంధర్వల
బ్ధావిచ్ఛిన్న లయప్రలీన పవనవ్యాపార సంపూర్ణ స
ద్భావాత్మద్వయ చిత్ప్రమోదఘనశబ్దబ్రహ్మ సంవేదియై.

ఆనందమొ యానందమొ
యానందమె యై సమస్త మాత్మాద్వయమై
యానందమె యానందమొ
యానందమె తా నగుచు సమస్తము మఱచెన్.

ఆనందోద్భూతాత్మకు
నానందమె పూర్ణసచ్చిదానందఘనం
బై నిరవధిసౌందర్య
శ్రీనవనవనవ్యమై వరిష్ఠత వెలసెన్.

సర్వతోవ్యాప్తసత్త్వవిశాల మగుచు
సర్వతోదీప్తచిత్త్వభాస్వంత గనుచు
సర్వతోరమ్యసౌందర్య సరణిఁ గొనుచు
సర్వతస్సంప్లుతామృతజనని వెలసె.

లీల నేదేవి స్పర్శ నున్మీలత మయి
లలితకలితాద్భుతాద్భుతోజ్జ్వల మహోజ్జ్వ
లంబులౌ సృష్టు లెల్ల శిల్పములువోలె
విరియుఁ దల్లీల బాలుఁడై వెలసె విభుఁడు.

అంతర్బహిస్సృష్టు లన్నింటికిని మూల
    మచ్ఛిన్న మద్వయానంత మగుచు,
ప్రత్యక్పరాశక్తి పరిపూర్ణపరిశుద్ధ
    పరమమంగళ కృపాభరిత యగుచు,

ఆవ్యక్తమధురతావ్యక్తసౌందర్యాల
నవ్యక్తమై మహావ్యక్త యగుచు
నమృతమేయై పొంగి యఖిలంబు నావరిం
చుకయున్న దివ్యమాతృకయె యగుచు

ప్రకృతి ప్రకృతికి, వికృతికిఁ బ్రకృతి యగుచు
విశ్వకును సర్వభూతనై విధ్యములకుఁ
బ్రకృతియై యున్న చల్లని ప్రకృతి తల్లి
ఒంటఁటొడిలోన శిశువుగా నుండె విభుఁడు.

ఎటు చూచిన సౌందర్యమె
యెటు కాంచిన దివ్యకాంతియే మధురిమయే
యెటు సాగిన నానందమె
యెటు లాడిన దివ్యనాట్యమే యయి వెలసెన్.

ఆయవ్యక్తసుమాధురి
యాయచ్ఛిన్నాచ్ఛమైన యానందరసం
బాయంబ కృపాపూరం
బాయమృతము పొంగిపొంగి యాతని ముంచెన్.

ఎంతదూర మేగెనో తా ననంతమందు
నేదొ యాలోక మది కాలమెంతొ యేమొ
యెఱుక యున్నదో లేదో యే మెఱుఁగు దివ్య
రససమాధిసుధారస ప్లావమందు

తేటతేటఁగఁ దీపులై తీపు లగుచు
దివ్యదివ్యమ్ములౌ దీప్తిదీప్తులఁ జను
మధురమధురసుధాధుని మృదులమృదుల
భావసంగీతగీతాలఁ బాయలయ్యె.

ఆనందో బ్రహ్మ
ఆనందో బ్రహ్మ
ఆనందో బ్రహ్మ
ఆనందమే బ్రహ్మం ఆ
బ్రహ్మమె ఆనందం    ఆనందమె బ్రహ్మం.

ఆనందమె ఆనందం
ఆనందమె ఆనందం
ఆనందమె సర్వం
సర్వము ఆనందం    ఆనందమె బ్రహ్మం.

ఆత్మయు సర్వమునం
దానందమె యందుఁగదా
సర్వము నాత్మమయం
ఆత్మయె సర్వమయం    ఆనందమే బ్రహ్మం.

ఆత్మయె సర్వమయం ఆ
ఆత్మయె బ్రహ్మమయం, ఆ
ఆత్మయె నందమయం పర_

మాత్మయె సర్వమయం
పరమాత్మమె సర్వమయం
పరమాత్మయె ఆత్మమయం
పరమాత్మయె ఆనందం
ఆత్మయె ఆనందం
అంతా అద్వైతం
అంతా ఆనందం, ఆనందం, ఆనందం, ఆనందం.

ఆనందమె ఆనందం
ఆనందమె చిత్త్వం
ఆనందమె సత్త్వం
ఆనందమె సర్వం ఆనందం ఆనందం ఆనందం.

ఆనందమె సౌందర్యం
ఆనందమె మాంగల్యం
ఆనందమె సత్యం
ఆనందమె సర్వం ఆనందం ఆనందం ఆనందం.

ఆనందమె ఓమ్‌బీజం
ఆనందమె శ్రీంబీజం
ఆనందమె హ్రీంబీజం
ఆనందమె ఆ ప్రకృతి
ఆనందమె ఆ వికృతి

ఆనందమె ఆవిద్య
ఆనందమె ఆసృష్టి
ఆనందమె ఆస్థితి
ఆనందమె ఆ లయం
అంతా ఆనందం ఆనందం ఆనందం

అంతా ఆలీల
ఆలీలయే ప్రతిభ
ఆలీలయే గాంధర్వం
ఆలీలయే మహానాట్యం
లీలయే ఆనందం
అంతా ఆనందం ఆనందం ఆనందం.

ఆలీలయే ప్రకృతి
ఆలీలయే వికృతి
ఆలీలయే విద్య
విద్యయే సంగీతం
సంగీతమే నాట్యం
నాట్యమే సర్వం
సర్వం ఆనందం ఆనందం ఆనందం.

ఆనందమే అమృతం
విద్యయే అమృతం

సంగీతమే రసం
నాట్యమే ప్రవాహం
అమృతప్రవాహం
ఆనందప్రవాహం ఆనందం ఆనందం ఆనందం.

ఆనందమే సృష్టి
ఏకసృష్టి, వివిధసృష్టు
అంతస్సృష్టి, బాహ్యసృష్టి
అంతస్స్థితి బాహ్యస్థితి
అంతర్లయం బాహ్యలయం
అమృతమె సృజయించున్
అమృతమె పోషించున్
అమృతమె కరగించున్
ఆనందమే అమృతం
ఆనందమె సృజయించున్ పోషించున్ కరగించున్

ఆనందం ఆనందం ఆనందం.
ఆనందమె ఆకాశం
అందునుండి వాయువూ
అందునుండి అగ్ని
అందునుండి జలం
అందునుండి భూమీ

ఆనందమునుండి అన్ని
అంతా ఆనందం ఆనందం ఆనందం.

దివ్యలోకసహస్రాలు
ఊర్ధ్వలోక మధ్యలోక
అధోలోక విలాసాలు
కోట్లుకోట్ల నక్షత్రాలు
సూర్యచంద్రముఖగ్రహాలు
అనూహ్యదీప్తివికాసాలు
అనాద్యంతవిస్తారం
కాలసరిత్ ప్రసారం
కాలసరిత్ ప్రభావం
జీవకోటివిస్తారం
జీవకోటివైవిధ్యం
జీవకోటివిన్యాసం
విస్తారం వైవిధ్యం విన్యాసం

శక్తికోటివిస్తారం
శక్తికోటివైవిధ్యం
శక్తికోటివిన్యాసం
విస్తారం వైవిధ్యం విన్యాసం.

భావకోటివిస్తారం
భావకోటవైవిధ్యం
భావకోటివిన్యాసం
విస్తారం వైవిధ్యం విన్యాసం.

బాహ్యసృష్టి బింబానికి
భావసృష్టి ప్రతిబింబం
భావసృష్టి బింబానికి
బాహ్యసృష్టి ప్రతిబింబం
బింబం ప్రతిబింబం
శబ్దం ప్రతిశబ్దం.

ఏకం ప్రత్యేకం
విస్తారం వైవిధ్యం విన్యాసం
విస్తారంలో వైవిధ్యం
వైవిధ్యంలో విన్యాసం
విన్యాసములో శిల్పం
శిల్పములో సౌందర్యం
సౌందర్యములో కాంతి
కాంతిలో దేవత్వం
దానిలో అమృతత్వం
ఆనందం మహానందం
అంతా ఆనందం ఆనందం ఆనందం.

సృష్టి నిలుచు సత్యముపై
కళాసృష్టి సత్యనిష్ఠ
సృష్టి మెసగు చిత్త్వముతో
కళాసృష్టి శివనాట్యవి
లాసమహాద్భుతవికాస
సృష్టపుష్ట మానందము
నందు నందు సంపూర్ణత
కళాసృష్టి అలౌకిక
సౌందర్యానందపూర్ణ
సత్యమ్ము శివమ్ము సుంద
రమ్ము నైన కళాసృష్టి
సత్తు, చిత్తు, ఆనందము
నై రహించు విశ్వసృష్టి
తత్త్వములనె చూపుచుండు
తత్త్వములకు తత్త్వమైన
బ్రహ్మమునే చూపుచుండు
మహావిశాలజగత్తనే
సముద్రమందు మఱ్ఱియాకు
వలె తేలుచునుండును కళ
మఱ్ఱియాకుపై శిశువై

పన్వాళించియున్న మహా
నారాయణు డాదిమూర్తి
బ్రహ్మాండము లెల్ల పొట్ట
నిలుపుకొన్న పరబ్రహ్మ
మట్లు కళన్ పరబ్రహ్మ
మణగియుండు నతిచిత్రము
అతిచిత్రము అతిచిత్రము
అతిచిత్రము ఆనందం
ఆనందమె ఆనందం ఆనందం ఆనందం ఆనందం.

చిత్రముగాఁ దీర్చియున్న
యశోదయింటి చిన్నిబిడ్డ
చిరునగవుల చిద్విలాస
మం దీభావమె ధ్వనించు
బ్రహ్మాండములెల్ల పొట్ట
నిలుపుకొన్న పరబ్రహ్మ
లీలయే ధ్వనించుచుండు
లీలయే ధ్వనించుచుండు
లీలయే ఆనందం ఆనందం ఆనందం ఆనందం.

ఆ బాలుని నెందునుండి
యైనఁ జూడ మనవై పే

చూచుచుండుఁ జూచుచుండు
జూచుచుండుఁ జూచుచుండుఁ
జూపులలో భావ మేమొ
భావ మేమొ భావ మేమొ
చూచుచుండుఁ జూచుచుండు
గోపికనై చూచుచుండు
గోపికయై విభునియాత్మ
చూచుచుండెఁ జూచుచుండెఁ
జూచుచుఁ జూచుచునె నిలచె.

ఆగఁ గొంత వివిధ మధుర
తత విస్తృత తాళబద్ధ
సంగీతపు నృత్యమెల్ల
హృదయ మెల్లఁ బులకింపఁగ
మృదువేణురవం బదొకటి
యెందో దూరమందుఁ గొంత
కొంతగ వినిపించుచుండె.

హృదయంబెల్లను, దన్మయంబయి వినన్ శృంగారభంగీచల
న్మృదుసూక్ష్మస్వనమ్ర శ్రుతశ్రుతముగా నేతెంచుచవ్యక్తమా
మధురత్వంబుననే మరుల్ గొలుపుచున్ మర్యాదలన్
మాపుచున్
బ్రిదులన్ జేయుచు వచ్చుబంధములనే ప్రేమానుభావంబునన్.

స్వరము స్వరమున పలితము పలితమందు
మెలపు మెలపునఁ గులుకునఁ గులుకున హృది
చలితమై సర్మబంధముల్ గళితములుగఁ
బ్రేమ గీతాలె పాడె నా వేణురవము

ఆద్యబ్రహ్మమునుండి సూక్ష్మపరమాణ్వంశాంశ లౌదాక నా
యాద్యబ్రహ్మజమౌచు నందెలయమౌ నందాక విశ్వంబు తా
విద్యుచ్ఛేదకబంధము క్తిబహుధావిఖ్యాతశక్త్యాత్మమై
హృద్యంబై పరిపూర్ణమై వెలిఁగడిన్, ప్రేమైకచైతన్యమే.

ఆద్యకాంత్యంశమే యసంఖ్యంబులైన
కాంతి శాఖోపశాఖలై కల్పకల్ప
విశ్వశిల్పపుబంధమై వేదములను
పూల నిడఁ బ్రేమసుధయె తాఁ బోషకంబు.

ఆమహానాద మదియె యనాహతముగ
నాహతంబుగ వెలయుచు నశ్రుతశ్రు
తంబుగా, దివ్యగానముఁదాళబద్ధ
గానమై యుంట ప్రేమసంగతులఁగాదె.

భువన మెల్లను నాంగికంబుగను, వేద
గాన మెల్లను దా వాచికంబు గాఁగ
జ్యోతులెల్ల నా హార్యమై యొప్ప సాత్త్వి
కముగ శివుడు ప్రేమానుభావమున నాడు.

విష్ణుపదోద్భూత విమల మందాకిని
దేవలోకాలకు దీప్తి నిచ్చి
శివజటాజూటరంజితసుస్థితిని గాంచి
యావేశమున భూమి కట్టె దుమికి,
సాగరంబుల నింపి జగతి నోముచునుండి
జీవకోటికి నెల్ల జీవన మిడి
సృష్టిస్థితుల మూలపుష్టియై యొప్పి స
ముద్ర బంధమునకుఁ బొదిగియుండి.

యస్థిరంబగు జగతి లయంబునందు
వేళ శివనాట్యచలితమై వేల మీరి
పొంగి తేజోమరుద్భావములను బొంది
విష్ణుపదమందు గంగయై ప్రేమ వెలయు.

విశ్వమం దెల్లఁ బూర్ణమై వెలుగుచుండు
ప్రేమ చైతన్యమన్ కాంతి విశ్వమందు
నేదొ యొక పాద మిట్టు లనేకవర్ణ
శబలితం బగు భూతవిశ్వముగ వెలుగు.

తక్కు చైతన్య మేకనిత్యప్రశాంత
మమృతదివి యాచు వెలుగు ననంత మగుచు
బంధముక్తస్థితిని దానిఁబడయుటకును
భక్తిరూపమా ప్రేమ యవశ్యకంబు.

భక్తి సత్త్వప్రధానమ్ము భ్రమగు ప్రేమ
ముక్తిహేతువు బంధపుశక్తు లయిన
రక్తి కామాదు లెల్లను రజముఁదమము
నక్తమై యుండు ప్రేమయంశములె సుమ్ము.

తమమున రాగాంకురమై
రమణీయ తత్ప్రతాన రాగలతలలో
సుమధురమధుసుమధురమై
సుమధువునన్ ప్రేమ యొకటె సుధయై యొసఁగున్.

హృదయంబునం బొంగు ప్రేమాంబుధి సవిత్రి
స్తనముల క్షీరామృతంబుఁ జేపఁ
గ్రోలుచు నల్లె నిద్రాలింగితుఁడయి
తల్లి చల్లనియొడి దాగియుండి
నిదురలోనసె లోన నుదయించు ప్రేమరా
గాంకురంబుల కలలట్లు కనుచుఁ
బట్టఁబోవుచుఁ గేళిబద్ధుఁడై కిలకిల
నవ్వెడి శిశువును నవనవముగఁ
బెంచు చాడించు చట్టులే పెద్దచేసి
తోడివారల తోడను- తోడిప్రకృతి
తోడఁ బెనవైచి పెంచుచుఁ దుదియె లేని
విశ్వబంధము లల్లు నీప్రేమసుధయె.

ఉదయసాంధ్యరాగము జగదుదర మెల్ల
నిండియుండగ విరఁబూచి నిగ్గు లొలుక
రక్తపాటలి చల్లుచు రాగములనె
మ్రోలి కెంపగు సుడిఁబెంచు లీల నరయ.

క్రొత్తక్రొత్తలా సుడులెల్లఁ గొనలు సాగి
పల్లవమ్ములైఁ బత్రముల్ మొల్లలు నయి
యల్లనల్లన నాఁడుఁ బూర్వాహ్ణమందుఁ
దెల్లతెల్లని నవ్వులు తేట పడఁగ.

వీచు తెమ్మెర లేదో యావేళ మొసఁగఁ
గాడలే యాడ నొండింటి కడకుఁ జనుచు
పైఁబడుచు వీడు చెగయుచుఁ బలువిధముల
నాడుచున్నవి తెలిపూవు లంద మొలుక.

మండుటెండనుగూడ ధర్మమును వదల
కన్నివన్నెలపూవు లాహారసృష్టిఁ
బుష్టి నొందుచు మధుదానపుణ్యకర్మ
చేయుచున్నవి ప్రేమతో సృష్టిఁజేసి..

సగముచంద్రుఁ డాకాశాన జలదపంక్తి
పలుచ తెరల దోఁబూచుల నలలవలెనె
హెచ్చుతగ్గుల వెన్నెలల్ హేలఁ బరుపఁ
జీఁకటుల మల్లియుంటులు వీఁక రేగి.

తలలు నున్నఁగఁ బులకించి పిలుచఁ జూచుఁ
వెల్లగా నెల్లెడల విరి మల్లెపూలె
సువ్వని సుగంధముల్ రేగి కప్పుకొనఁగ
విరుల మిథునంబు లాకుల మఱుగుకుఁజన.

కలువ కుముదినీకాంతునే కలవరించు
నిలిచి జలముల, జలముల నిలిచి నెమ్మి
తమ్మి శతపత్రములు విచ్చి తరణిఁ జూచుఁ
జూచుచునె యుండు నన్యముఁ జూడఁబోదు.

ప్రేమయే పూవులై యుండుఁ బ్రేమి హృదికి
ప్రేమపూవులే కళలలో విరియుచుండు
కవులు శిల్ప్యాదులును రసికప్రవరులుఁ
బ్రేమహృత్పుష్పవికసనప్రియులె కాదె.

విరుల జనియించుఁ బూవుల పేరు లెన్నొ
పేరులును దోఁచుఁ బూవుల విధిని నౌర !
ఎందు వీక్షించినను నెట్టి యెట్టి పూలొ
పూలె కనిపించెడిన్ గళాబుద్ధహృదికి.

ప్రేమయోగికి సర్వము ప్రియతమ మగు
మధువె కురియుచునుండు శ్రీమహిత మగుచు
గాలి, సింధువు లోషధీజాల మాది
గాఁగ నెల్లెడలను నెల్లకాలములను.

ప్రేమ మధువున నమృతమై ప్రేమదోఁచు
దివ్యకృపఁజేసి యా దేవదేవు డైన
విష్ణుపుత్రుఁడు మన్మథు విరులయందు
నమృతమధు పూర్ణ దివ్యసుమములు గలవు

ప్రేమ బంధింప సృష్టిలోఁ గామమూర్తి
ప్రేమ సాగించి స్థితినిల్పు విమలమూర్తి
స్మృతికిఁ దేరంగ స్మరమూర్తి - యెల్లబంధ
ములను ద్రుంపఁగాఁ దా మారమూర్తి యతఁడె.

విశ్వచైతన్య మెల్ల నా విష్ణుమూర్తి
దివ్యచైతన్య భర్తనే స్త్రీ విధముగ
నాశ్రయించిన దీవిశ్వ మఖిల మరయ
స్త్రీపురుషతత్త్వయుగ్మవిశిష్ట మౌర!

మదనమోహను మురళీ సుమధురరవము
దివ్యసుప్రేమ భావనాదీప్తిఁ బరపి
ప్రేమ పచ్చి గంధపుముద్ద శ్రీత్వమూర్తి
స్త్రీత్వమునె నించె నాత్మలఁ జెలువు మెఱయ.

గోపిక యయ్యె నాత్మ మఱి గోపిక లయ్యెను గోపి చుట్టునున్
గోపికలయ్యె నం దొకతె గోపిక యయ్యెను గోగణంబులున్
గోపకులయ్యె బృందము నికుంజములున్ యమునాస్రవంతియై
గోపకుమారశేఖరుని కోమలవేణురవంపుఁ బిల్పునన్.

పరవశమయ్యెఁ జిత్తము స్వభావసుఖంబు స్మరించె భావమున్
మురళిరవంపుమూర్ఛనల ముగ్ధహృదబ్జము సంచలించె నా
స్మరుఁ డమృతంబు కారు కుసుమంబుల నేసి విరాళిపెంచె జ
ర్జరితములయ్యెఁ దోఁపకయె సంసృతిబంధము లెల్ల లోననే.

మగలు బిడ్డలు నత్తమామలును దిండి
తీర్థములు నిండ్లువాకిండ్లు తెరువుహరువు
లాదిగా నేదియును గంటి కగపడకయె
యడ్డపడకయె పారెఁ బ్రేమైకశక్తి

వచ్చితి నో ప్రభూ! ప్రణయవాహినిఁ బ్రేమసుధాపయోధి నీ
యచ్చపుఁబ్రేమనే కురియ నారయుచున్నయనంత మంతరాల్
హెచ్చులుతగ్గు లేకమయి యేకగతిన్ బహుభంగులందునన్
జెచ్చెర పొంగిపార్లి నినుజేరఁగఁ ద్రెంచుచు సర్వబంధముల్.

## 5. ఓర్పు

మండలభూమిపాలు పలుమాయలమాటలయూఁప్రవాహమున్
మెండగు మోహమందు గమనింపక పాలనినమ్మి సార్వభౌ
ముం డుదరంబునిండఁ దృషఁ జూత్రిగఁ ద్రావెను గాని యందులో
నుండువిషంబుఁ దా నెఱుఁగకుండెనమాయకదుర్బలాత్ముఁడై.

తెల్లని వన్నియుఁ బాలన
నల్లని వన్నియును నీళ్ళు నా నమ్మెడి యా
చెల్లని దొర యె ట్లెఱుఁగును
దెల్లసివిషములును జగతిఁ దిరుగుచునుంటన్.

విభుని మనంబునందు విషబీజమునాటిదురాత్ముఁడున్ దమోఘ
శుభకమూహూర్తమందు మదిఁజొక్కుచు నిక్కుచుఁ
నేగినంతనే
విభునిహృదంతరాళమున వెఱ్ఱిగ రేగెను దిమ్మదిమ్మలై
రభసముతో వికారములె ప్రాకెను దుర్విషవల్లరుల్ వలెన్.

రమ్యఫలపుష్పదము లౌచురక్తిఁ గూర్చు
కోమలములౌ లతల్ నాటుకొనుచు కష్ట
మనలు వర్షమేలేని చోటైనఁ గప్పి
వేయు వేగ ముండ్లపొదలు విషలతలును.

రాత్రియెల్లను బలువికారముల యూహ
లలమికొని విభుహృదయమున్ గలఁతపెట్టఁ
గన్నుమూయక వాఁడు ప్రక్కలను మార్చు
కొనుచు నిట్టూర్పు చూరిక కొందలపడె.

"ఓరా! నా దురదృష్టమేమి? మదిలో నాశాలతల్ దిక్తటాలి
చేరన్ బ్రాకఁగ బెంచుకొంటి ఫలముల్ చేకూర్చునంచెంచి, కా
నీ రాణింపవు, పూలెపూయవు, ఫలాలేరీతిఁగాచున్ మహా
శ్రీరమ్యంబగు రాజరాజపదవీ సిద్ధాఁబువున్ వ్యర్థమా?!

వృద్ధుడు వాఁడు ప్రేమమునఁ బెంచి చనెన్ సురలోక సుందరీ
సిద్ధసమాగమం బభిలషించి, తథావిధ రాజ్యకన్యకై
యుద్ధములయ్యెనయ్యెడ మహోగ్రముగా హరిసత్కృపన్ మన
శ్శుద్ధిగఁ జిన్నవాని గుణశోభితు నన్నె వరించె నామెయున్.

నాపై యుండిన పెండ్లి పెద్దలవె యానాఁ డిప్డుఁ బై చేయికా
నీ వారే మఱి నాకరంబులను బంధింపంగనున్నారు నే
నావంతైనను స్వేచ్ఛచూపినను నాయాసల్ ఫలించే దెటుల్?
దైవం బీవిధిఁ జేసె భోగములు బంధం బందునేఁ బొందగన్

పోనీ వారలచిత్త మెట్టు లటులేపోవచ్చు నట్లుండియున్
ఈనిస్సీమ నిరస్తరాజ్యమును భోగింపంగవచ్చున్ ప్రభు
త్వానూనానమ వైభవంబెసఁగ రాజ్యాలన్ జయింపన్ యశః
శ్రీనల్దిక్కులు నింపవచ్చు నదియున్ సిద్ధింపలే దింతకున్

నావారే ననుజూచి యోర్వరు మదిన్ నావారె నాశత్రులై
నావేరే తేగఁగొట్టనుండి రెటులైనన్ వారి వారించుటే
చావవ్వారలు నూరుగొడ్డలుల యాసద్దే శిరోవేదనం
బేవేళన్ ఘటియించు భోగములయందే మగ్నుడై యుండినన్.

కృష్ణ రాజేంద్ర జితమై రహించునట్టి
దక్షిణాపథమెల్ల నా దయకు నాడు
ధర్మపాలనమునకుఁ బాత్రంబ యగుచు
విజయనగరసామ్రాజ్యాన వెలయుచుండ

సామంతనృపులు కొందరు
స్వామి ననున్ ధిక్కరించి స్వాతంత్ర్యముతో
భూముల నేలుచునుండిరి
యే మని యోర్వంగవచ్చు హృదినే తాల్చున్.

శత్రులకుఁ జుల్కనైపోనె? శత్రువులకె
గాదు నావారికే చుల్కనౌదు వారు
కూడ స్వాతంత్ర్యమును పెంచుకొనుచువచ్చి
తుదకు సామ్రాజ్యమే పోదె తునకలగుచు.

ఆవిరుపణ్ణ చూడు వినయాన్వితునట్టులెయుండె వృద్ధరాజావిధిఁ దా సమర్థుడయి యుండక్షైపైన సవారిచేయుచున్ దావె యొసంగకుండ తలఁదన్నుచునుండగ వాడు పోవుచే పోవుట తోకపిప్పి తనపోకలఁబోవఁగసాగె నద్దిరా.

వాఁడెక్కడ? నే నెక్కడ?
కీడును నాకే యొనర్పఁ గృషి చేసెనటే!
నేఁడును నా శత్రువుతోఁ
గూడెనటే ప్రజల రెచ్చగొట్టెడినట్టే.

బాలుఁడితం డనుకొనెనో? వి
శాలంబగు విజయనగరసామ్రాజ్యము కే
యేలిక నని యెఱుఁగఁడొకో!
తూలమునకు, శైలమునకుఁ దుల యున్నదియే.

పనిపట్టింతునుజూడు వానినిఁక నా బ్రహ్మదులే యడ్డమై
నను నాశత్రువు గిత్రువెంత? సుఖమున్న న్నన్న శక్తుండలం
చును వీరల్ చెనకంగఁజూచెదరు నా శూరత్వముంజూపి చ
క్కనిపాఠంబును నేర్పెదన్ వరుసఁదోకన్‌విప్పు నెవ్వానికిన్.

కుడిభుజమౌచు నాకు మదిఁగూర్చుసఖుండగు చిందు మండలే
శుడు కిరుస్వామిభక్తుడు విశుద్ధచరిత్రుడు నుండ నేను పైఁ
బడి యడఁగింతు శత్రులఁ బ్రభావముఁజూపెద నింకఁ గొఁక కే
పినుగువలెన్ జరించెదను, భీతులఁగూర్చెద భీకరుండనై.

శక్తిగడించి రాజ్య మను చక్రపుమేల్పిడి చేతఁబట్టి దు
శ్వక్తుల నడ్డగించి బలసారమెలర్ప స్వరాజ్యమేలుచున్
భోక్తగ రాజ్యసౌఖ్యములభోగరసంబునె పీల్చివైచు చా
సక్తి యథేచ్ఛఁ గామినులసంగతి లోకమె విస్మరించెదన్.

అబ్బ! యెన్నాళ్ళనుండి యీ యాశ దీనిఁ
దలఁచుకొన్ననె హృదయంబు కలఁతఁ జెందు
నెన్నిసార్లో ప్రయత్న మేదీఫలంబు?
నట్టి యాశలతోఁ దుది ముట్టునేమొ.

అనుచు యోచించు, నిట్టూర్చు నంగబలము
సోలినట్టులు, తనలోనె శోకమొందు
పూర్వపుణ్యము చాలదేమో యనుకొను
నెంతయున్నను నాశకు నంతులేద.

చీఁకటిరాత్రియెల్ల నిటు చింతఁగలంగుచు బాపమాతఁ డా
వేఁకువ యెప్పుడౌననుచు వేసరుచున్ దుదిలేని వేదనా
స్తోకసముద్రమున్ గడవఁజూచుచు నీదెడిభంగిఁ బాన్పుపై
నేకముగాఁ గనుల్ దెరచి యిట్టులటుల్ పొరలాడుచుండినన్.

కరదీపంబులు కరముల
ధరియించిరొ బొమ్మలట్లు తరుణీమణులా
పరిచారిక లుండిరి భూ
వరచాపలపరుషదండభయమున నటులే.

చీఁకటి నిండాఁకను కను
లేకముగాఁ దెరచియున్న యేలిక కొనకా
వేఁకువకు ముందు చందురు
రేకయుఁ గనిపించుసరికి రెప్పలు మూసెన్.

నాలుగవజాము వేళకు సోలిపోయె
మేలుకొనియుండు శక్తియే తూలవచ్చె
నెచటనుండియొ నిద్దుర యెఱుకపడక
యేలికకు దాసులకుఁగూడ నేకరీతి.

చీకునుజింతలేక సుఖసింధువు నిద్దురమున్గియుండి యా
చీఁకటిరాత్రి నాప్రకృతి చిన్నగవీచుచుఁ జల్లగాలులే
సోకెడివేళఁ దూర్పుదెసఁ జుక్కలరాయని రేక స్వప్నపున్
లోకములోని పెన్మసకలోఁ గనినట్టులు కాచె నప్పుడున్.

గగనమహాలునఁ గోటలోఁ గలుగు రాజ
భవనముల వేనవేలు దీపములఁ గారు-
చుండెఁ బట్టణవీథుల నున్న యల్ప
జీవితము లైన దీపాలస్నేహమెల్ల.

నిన్న మొన్నని యేవీథిఁగన్న నా ప్ర-
భాతసమయాన వీణాది వాద్య ఘోష
వినఁగవచ్చుచు నున్న పట్టణమునందు
నవయుగీతాలు మాత్రమే యుదితమయ్యె.

అరుణరేఖలు తూర్పున నలుముకొనెడి
వేళ గడియారముల మ్రోఁత వినఁబడఁగనె
సిద్ధముగ నున్న గాయకుల్ స్నిగ్ధవాద్య
కలితముగఁ బాడఁదొడ్గిరి కంఠమెత్తి.

రాజ, రారాజ, నింద్రచంద్రములఁజేసి
కోటలోపలి యా పెద్దగుడులయందుఁ
గడకు మేళమునకుఁగూడ కలవువచ్చె
నాయకాంద్రకు నాయకుల్లంతరింప.

కోటలోపల గల పెనుగోఁటలందు
విడిసిపట్టిన రకరకాల్ విరులు బుట్లు
బుట్లు వచ్చెను మొదట నా భూపునింటి
కన్నిటికి సందునుండియే యుంపకంబు.

మండలేశుండు, తూరుపుకొండ దాఁటి
తపనుఁ జేతేరుసరికి సిద్ధముగ వచ్చి
యున్న ద్రాక్షాగుళుచ్ఛాల నొక్కటొకటి
యక్కడక్కడ రుచిచూచి యరసి యరసి.

మేలుగువానిని చేయుచు
మేలై సవా కావా యనుచు మొక్కుచు మరితా
నేలికకుఁ బంపె వానిని
యేలిక యొటు లెఱుఁగు పీని యెంగిలిసేఁతల్

మంకశేకుని యాజ్ఞఁ గొండలో యసనొప్పు
వారణాశుల లొక్క ప్రక్కనుండి
పారసీకపు మంచివారువంబులు పెక్క
లొకవైపునుండి, మరొక్కవైపు
నుండి గండరగండ లుద్భటులగు పోటు
బంటులు నింకొక్క వైపునుండి,
రథములు నేతెంచి రణవాద్యములతోడ
గగనమహాలు ముందు గడగి నిలిచి

క్రమముగా సాగి వాద్యఘోషమును బట్టి
బారులుగ నిల్చె జయజయధ్వనులు రేగఁ
బ్రభునికడనుండి యింకను వార్తమాత్ర
మింత ప్రాప్తైన రాలే దదేమొ యనుచు

మండలేశుఁడు వేగి సంభ్రమముతోడ
నాథుఁ డాస్థానసింహాసనంబు నెక్క
వచ్చుత్రోవలో నుండెను బ.టుకీతిఁ
బ్రభువు నేతెంచె సింహశాబకమువోలె.

14)

ముక్కుపచ్చలారని ప్రాయమున ముఖాన
ముద్దులొలికెడి మురిపమున్ ముగ్ధతయును
దొనకుచుండెను వీరతత్త్వోడఁగూడి
రాజతేజికి నెట్టికొఅంత లేదు.

తనవెనుకటి సామ్రాట్టుల
ఘనకార్యము గఱువతనము గాంభీర్యంబున్
వినుతముల సంప్రదాయము
లను దానును ననుసరించె లక్ష్యమ్ములుగా.

విభుఁడు సాహోసనాదముల్ బిరుదపాఠ
ములు నెసంగ బరాబరుల్ ముందునడువ
ఠీవి నేతెంచి సింహపీఠిని నలంక
రించె సామంతుఁడును భృత్యురీతిఁ గొలువ.

మండలేశుని యండలో మలయుచుండు
వారి సభ్యులుగాఁ జేర్చఁబడిరి నాఁడు
అతులవైభవ మెందుఁ బొంగారుచుండెఁ
బ్రభుని వలవేసికొనుట కీ పాటులెల్ల.

చతురతన్ దీర్చినట్టి యాస్థానచిత్ర
చిత్రసమలంకృతులు వింత చెలువుచూప
దేశదేశాంతర జనులు తెచ్చి తెచ్చి
కనని వినని సువస్తువుల్ కాన్క లొసఁగ.

అతులవినయంబుతో మహాస్తుతులు సేయఁ
గపట మింతయు నెరుగని నృపుడు వాని
నెల్ల మనసార మెచ్చెను దృష్టి దెలియ
వాక్కులందును బొగడె నా వైభవంబు.

అంత సామంతుఁ డతివినయంబుదోఁప
విభునితోఁ బల్కె మెల్లఁగా 'విరుఫు' నణచు
కొక్క నిముసము తడవైన నొదుగు ము ప్ప
టంచుఁ దాళమువేయఁగా నంద ఆచట.

వలయుసైన్యము సిద్ధమై నిలిచియున్న
దనుచుఁ బలికె నొకం డింకఁ దడవుసేయ
మంచిగడియలు మీఱునటఁచు నొక్క
కృతకదైవజ్ఞు డనె ప్రేళ్ళ నెంచి చూచి

ప్రభుఁడు దేనికిన్ యోచించుపనియె లేదు
కాని యాతఁడు సంప్రదాయానుసారి
యాట వెనుకటి సమ్రాట్టులట్లె తాను
శత్రువులఁ గూల్పనేఁగెడి సమయమందు.

అర్హులను బేదలా శ్రోత్రియాళిఁ బిలిచి
విరివిగా దానముల నిచ్చి పరమతృప్తి
వారి కొనగూర్చి వారి దీవనలు పొంది
ముందు కడుగిడుచుండె నేప్రొద్దుగూడ.

శ్రీని సామంతునకుఁ దెల్ప లోని యతండు
నవ్వుకొనెఁ జైకెఁ జిత్తము నాథ! యనుచు
నప్పలం దిద్దొకఁ గనుసైగచేసె
వాఁ లాత్రముగా సభ వదలి యేగి

విలువగలట్టి శాలువలు పేటలుగా జలతారు లున్న దు
వ్వలువలు మార్చి సొమ్ములను భద్రముగా నొకచోటఁ బెట్టి మై
నలఁది విభూది పేదజేఁకమందున మున్గినవారువోలె లో
పల కరుడించి మంత్రములఁ బాడుచు దీవనచేసి రావిభున్.

విజయనగరసామ్రాట్టు సంప్రీతుఁ జేసి
యతులసంభావనలు పొందు నాశతోడఁ
గ్రమముఁ బదమును జటయును ఘనమునొప్ప
వనస నొకదాని వారు సుస్వరముగ నట-

చెప్పుచునుండఁగా వినుచుఁ జిత్తమునం గడుమెచ్చి రాజ రా
కొప్పెడి యాయుదాత్తతకు నూరక ఛాందసు లెంతసే పిటుల్
చెప్పినదానినే మరలఁ జెప్పుచునుందు రిదేటి వెఱ్ఱిరా!
యిప్పుడు వీరినేల కదలించితి నీ గ్రహచార మేమిరా!

అను చామండలభూవిభుండు విరుపవ్యాపాది ప్రొద్దామె నం
చును లోలోనన చేతులన్ బిసికికొంచున్ గీటుచున్ బండ్ల నిం
కను వారల్ విరమింపకున్నఁ బతి వెన్కన్ నిల్చియావిప్రులన్
గనుగ్రు డ్లెఱ్ఱఁగఁ జేసి త్రిప్పుచు నులూకంబట్లు తర్జించినన్.

ఒక్కని నాగపుర బ్రాహ్మణు
లొక్కటిగా పిలిచి మీఁద నున్నది యెల్లన్
చక్క నుటంకించి తుదిన్
జెక్కడి యాశీర్వచనముఁ జెప్పి ముగింపన్.

తుష్టిఁ దగుచు వప్రహాట్టు "విశిష్టులార!
శ్రోత్రియులు, సత్యశమదమశోభితులును
నిత్యతృప్తులు ననఘులై నెగడుచున్న
బ్రాహ్మణులు మీరు భూమిదేవతలు గారె!

మీయాశీర్వాదమ్ములె
మాయట్టిమహీపతులకు మంగళకరముల్
పాయక మీరును మాతో
నేయిప్పుడు పయన మగుచు నేతేఁవలెన్."

అనుచుఁ బరమభక్తి నాబ్రాహ్మణులకు సం
భావనల నొసంగ బహువిధముల
"రాజరాజ వీఁడు రామేశ్వరము పోవు
చీ "శనేశ్వరము"ల నేలవిలిచె!

కర్మమా!" యటంచుఁ గడునొచ్చి మనమున
ఖలుఁడు 'ముంది, కేమికలదొ వీరి
వలన నొప్పు లచటఁ దలనొప్పు' లని, కాని
బనులు మాట నెట్లు పలుకఁ గలఁడు?!

పటుశక్తిని నారవమ్ము బధిరత్వమ్మున్ పరిస్థితి నా
కృత పామీస్వముదూరిపస్తులతనం గల్పించె నారాళ్ళటకు
పటులాంఛో నిధిభంగభంగివిపలత్రైస్వరంబులతో జేసి రా
కటిలాత్మ్యంబును త్రోసిపుంబు విరుపత్రోసెప్పెను విర్వధిన్.

పరిమితసైన్యము గొనిచను
టరితో( బోరుట కటంచు నా ప్రభు(డెంచెన్.
విరుపవిభునశ్వ మెరుగక
మెరిగిన యూమండలపతి మొత్తే వేరా.

తుద్రమాం(త్రికు( డొకడొన్ని వింతల(జేసి
తనశక్తి కొల(దిని జనులకెల్ల
హెచ్చుగా( జూపుచు నిగ( పీనికంటె మ
హాత్ము(డే లేదు పీ డాదిదేవు
నపరావతారమే యనిపించుకొన(జూచు
చెల్లరిలో భయ మొట్టికలుగ(
జేయు( గుప్తైద్యుండు చిల్లిగవ్వకు( గాని
తనమందులను నమ్మి ధనముగూర్చు

పక్షిపంజరపటముల నందరికును
జూపు చామయూభేతుల కేవు నెట్టు
లట్లె వాడును భయదసైన్యముల( ద్రిప్పి
ప్రజలలో రాజభీతి నింపంగ నెంచె.

కొంపలనె గావ్యంబుఁ జూచెనీ కలికలుష్ట
పాపపు బ్రమ నొసఁగెను పలుల నెల్ల
నెవ్వఁడో నెవ్వొ లెవ్వొ నెవ్వొ లెప్పుడుం
గొసపని నెవ్వొకి ఏది గురి యదేమొ.

మాటిమాటి మహార్హ్యహ్నమునం
దటు పల్లెల పోఁకిరీనంచు నరుగుచునుండన్
బటుతరంతమునకే తనకు నె
దుట తాండవ మాడుచుండె దోర కద్దానన్.

అదె భూతమయము వెలుఁ దన
మది భీతిస్థానముగుట మనుకేసున గా
మృదువిరుపన్నిగ్గలకా
మధురసికుఁ డంటె భూతమా యనఁ దోఁచెన్.

మునుతమ ప్రేమపాత్రుఁడగు పూతవిరూపవిభుండు రాత్రియం
దును నరుదెంచిపన్ బ్రజలు త్రోవలప్రక్కల నిల్చికొల్చి పీ
ఠగజలజాతమాలికలఁ గప్పుచునుండిరి కాని కాన రా
దిపముగ నామహీపతులు దీర్ఘపథంబున నొక్కయబ్జమున్.

అటఁ గళామృతపూర్ణహారిమానననరో
వర వికచాబ్జ మా విరుపవిభుడు
దివ్యకళాకాశ దీపకపరమేశ
కమలా ప్రకమనీయకాంతియందు

నానందసామ్రాజ్య మంతరాయము లేక
యనుభవించుచునుండు ఘనుఁడు నాఁడు
తనహితుం డా కళాఘనుఁడు మహాశిల్పి
యెట్టితోఁడును లేక పట్టువిడక

యెంతో కాలమునుండి రచించుచున్న
యా యసంపూర్ణమైన కల్యాణమండ
పమున స్తంభానఁ దీర్చిన పర్వతసుత
* పాణిఁ బట్టిన కళ్యాణ పరమశివుని.

సురుచిర గంభీరమనో
హరమూర్తి సతృష్ణ వీక్షణాంభోరుహ సుం
దరమాలఁ జుట్టుచునిలిచి
స్ఫురద్వికచ భావపుష్పములఁ బూజించెన్.

అట్లు కొంతసేపు ధ్యానంబునన్ నిల్చి
యభవు దివ్యసత్కృపామృతంబు
గ్రోలుచుండి యా విరూపాక్షవిభుఁడంత
శిలలఁజెక్కుచున్న శిల్పిఁజేరి

సరససల్లాపముల వాని శ్రమముదీర్చి
యతని తోడుత శిల్పరహస్యములను
జర్చసేయుచు నవభావ సంస్ఫురణకుఁ
దోడుపడెఁ గొంత ప్రాణహితునకునంత.

---

* వెనుక కవరు పేజీ పైనున్న లేపాక్షి శిల్పము.

శిలలఁదొలువఁగ మలువఁగ శీర్ణములయి
రాలిపడినట్టి రాళ్ళను రాతిచెక్క
లన్నిటిని మోసికొనిపోయి యాలయంబు
బైటబార వేయుచు శుభ్రపరచె నట.

ప్రొద్దు మునిఁగెడివేళకుఁ బురనివాసు
లెల్లరును వత్తు రందుకై యేమియేమి
చేయవలయునో యేర్పాట్లుచేసి నూర్ల
కొలఁది ప్రమిదెల నూనెవత్తుల నతండె.

వేయుచునుండెఁ దత్పరత వెల్గఁగఁజేయఁగ దీపరాశి దీ
ప్తాయుతుఁడై ప్రియప్రజల సద్ధృదయంబులఁ బ్రేమదీప్తులన్
మాయకయుండ నిల్పు సుగుణస్థిరదీపము రాజుగాక భూ
నాయకుడై రహించెడి జనప్రియుఁడా మహనీయుఁ డచ్చటన్

అటు లేపాక్షిపురంబుప్రక్క నొకరమ్యంబౌ ప్రదేశంబునన్
గుటిలాత్ముండు స్వసైన్యమున్ నిలిపి, కాంతుల్ పర్వఁడేరా
లోకే
త్రుటిలో లేవఁగఁజేసెనెల్లెడల నందున్ రమ్యశుద్ధాంత సం
స్ఫుట సౌకర్యములెల్లఁదీర్పఁ బనిచెన్ ముందా విభున్
నిల్పఁగన్.

అరకొరగాఁ దయారయిన యంతిపురంబున నా మహీశ్వరుల్
బిరబిర నిల్పి యాతనికి విశ్రమమైననొసంగ కింతయున్
ద్వరగవిరూపుఁదెచ్చుటకుఁబంపె మనుష్యునిఁ బ్రొద్దుక్రుంకినన్
బరిణతు లేమికిల్గునో మనస్సెటుమారునొయంచు భీతిచే.

విరుపుఁడు వచ్చులోనఁ బృథివీపతిఁ జేరి ఖలుండు మెల్లఁగా
బరిపరిరీతులన్ మరల వాని మనస్సునఁ గ్రోధకీలలన్
బెరుగఁగఁ జేయుచున్ విరుపవీరుని కోట యదే యటంచు వి
స్ఫురదురుదృశ్యమా ప్రహారిఁ జూపుచు నిట్లు వచించె ధూర్తుఁడై.

"అదె దేవాలయమన్ నెపంబున నతండా త్మార్థమై కట్టుకొ
న్నది దుర్గం బట లోన నెల్ల ప్రజలన్ వంచించి యార్జించి, పె
న్నిధులన్ నింపెను, మందుగుండు మొదలే నింపెన్
రహస్యంబుగా
నదె యస్మద్రిపుడంపు సైన్యములకై యూనై పె వీక్షించెడిన్.

ఇదియెల్ల గూఢచారులు
విదితంబుగ నిపుడు చెప్ప వింటిని మన మీ
యదనునకు సరిగ వచ్చితి
మదె రిపుసైన్యంబు వచ్చు నంతకుముందే.

నే నొక యుపాయమున న
వ్వానిన్ దెప్పింతు నిటకుఁ బ్రభువులు మీరల్
వానిన్ శిక్షించి ప్రజన్
దే నగు నొకదారి కింక ధృష్టతయణఁగన్"

అని పలువిధముల కల్లలు
మొనసి వచించుచునెయుండ ముగ్ధుని విరుపున్
గొని తెచ్చితి నని చెవిలో
గొణిగె నొకం డేగుదెంచి క్రూరాత్మునకున్.

అపుడే సిద్ధముచేయఁగాఁబడిన రమ్యాస్థానపీఠంబునన్
సపరివారము సత్వరంబు కొలువై సమ్రాట్టు గూర్చుండె లో
విపరీతంబుగ రేగుచున్ విరువుపై భృత్యత్వమున్ జూప దు
ర్నృపుఁ డట్లేనిలుచుండెఁ బార్శ్వమునసే రేగెన్ విశేషధ్వనుల్.

ఎంతో కాలము లోనె జ్వలించుచున్న
యా యసంతృప్తి దానిపై నా విరూపు
పైని కోపము విశ్రాంతియైన లేమి
చేరి యన్నియు నాకొన్న సింగ మట్లు.

విభుఁడు గర్జించె "ద్రోహి నా విరువు వేగ
తెం" డటంచును లోనికేతెంచె నతఁడు.
నమ్రుడై పళ్ళెరమ్మున నవకమొసఁగు
విరులఫలములఁ గొని భక్తి విరియుచుండు.

ద్రోహి, ధృష్టుఁడు, దుష్టుడు, తుంటరి యని
కలవరించుచునున్న యా కనుల యెదుటఁ
బరమసుందరగంభీర సరసనమ్ర
మూర్తి కనుపింప రారాజు ముగ్ధుఁ డయ్యె.

శత్రు వని యింతదాక విషంబు గ్రక్కు
చున్న యా విభు క్రూరదృక్పన్నగంబు
కఱవఁబోయి, పయఃపూర్ణ ఘట మటంచుఁ
దోఁప నాకసాగను జిందు దుగ్ధములనె.

నమ్రముడై వచ్చి యభివాదనంబు చేసి
పూలుపండ్లును ముందిడి ప్రాణభక్తిఁ
బలుకుచు జయమ్ము నెదురుగా నిలిచియున్న
ధవళనేత్రుని సుదృఢసుందరసుగాత్రు.

ఉత్తమహారోచిత వే
షోత్తమభూషణుని గనుచు సూరిక విభుడున్
జిత్తమున మెచ్చి చీలో
నోత్తరుఁడా విరుపుఁ డెట్టులో యని తలఁచెన్.

రారా జూరికయుండిన
సైరింపక ఖలుడు "ప్రభు! విచారింపంగాఁ
దీఁడు, చేఁజిక్కిన యీ
వైరిని విద్రోహి వేగఁ బట్ట బనుపుడీ"

అని తత్తరముగఁ బలికిన
విని విరుపుడు చకితు డయ్యె విడువక స్థైర్యం
బును, లోఁ దెలిసి సర్వం
బును, ధీరత మెఱయ బలికె భూమీశునితోన్.

"ఓనాయేలిక! భ్రాంతిఁజిక్కి యిటు లోహో! యాతఁ
డేవైరమున్
గానీ పూనని సాధువర్తను ననున్ గష్టాలపా లీయగా
నానాకష్టము లొందుచుండెను వృథా నాపై ననూయన్ దద
జ్ఞానంబుంగని జాలియయ్యెడి మనుష్యత్వంబె లోపించెనో!

నను, నా తమ్ముని, మండలేశపదవిన్ దప్పించి, తా నా పదం
బున గూర్చుండెను, సంతసించితిమి, హృత్పూర్వంబుగాఁ, గాని తా
ననురాగంబున రాజ్యమేలక దురాశావిష్టుడై స్వప్రజన్
దినగాఁజూచిన నోర్తురే! నృపతులెం దేనిట్లు గావింతురే?!

ప్రజయు రాజును భార్యయు భర్త యటులు
ప్రేమతో నున్న నే గాని క్షేమ మెద్ది?
ప్రజకు రాజుకు నడుమనే ప్రగులుకొన్న
యీ పరిస్థితి నరిపోవు టెట్లొ తండ్రి!

చిన్ననాటినుండి చేర్చి నిన్నెంతగా
ప్రేమజూపుచున్న విషయమె కార్చు
నన్ను జూచి యుడేఁకు; నాకుతమ్ముం డయ్యు,
నీవుకూడ ప్రేమ నితని జూతు.

సంతసమున రాజ్యసంపదనే యిచ్చి
వచ్చినట్టి నన్నుఁ బట్టి నెంచె
నితని నుద్ధరింప నీవును సిద్ధము నేను
వలయునేని నిచ్చి ప్రాణ మైన.

పారిపోదు ననెడి భయ మేమిలేదు నన్
బట్టి కట్టు; నట్టి పనులు నేను
కలల నైన జేయఁ గనుపుచల్లగఁ దల్లి
చిన్ననాటినుండి యెన్న డేని.

మీయువ్వం దిని నే మీ
కే మె గ్గొనరింతునా యిదేలా యిటు న
న్నే యితఁడు వైరి యనుచున్
గూయుచు నున్నాఁడు వినుటకును నోర్వఁ బ్రభూ.

అనుచున్ బల్కుచునుండ ఱేఁడు మదిలో నట్లే విమూఢాత్ముఁడై
వినుచుండెన్, విన నోర్వ కాకుటిలు డుర్వీనాథ! యీలాటి ధూర్తుని నెందైనను గంటిమే? యిటులె యీదుష్టుండు సన్మార్గవర్తనునట్టుల్ నటియించు నెప్పుడును, నేరన్ లేరు ముందెవ్వరున్.

మన ప్రజలను నిక్లై మత్తుమందును జల్లి
వశము జేసికొన్న వాఁ డితండు.
రేపినాఁడు వారి నాపైననే; నేను
ముప్పుత్రిప్పలబడ మురిసినాఁడు.

ప్రేమయుంట ప్రేమ, వినువీథి ముట్టు న
ట్లాడుచుండె నిచట నౌర! యెంత
వింత!! రాజ్యమెల్ల విడె నట, తనకు దా
నటన యున్నను నిది నమ్మదగునె ?

మనశత్రు నాస్థానమున నున్న శిల్పిని
గొనివచ్చి వానినే గొప్పచేసి,
వానిమూలముగ సంధానంబు చేసినా
డితండు వైరిభూమీశుతోడఁ

ప్రజలలో రాజుపై రారాజుపై ద్వేష
మును రేంచి వారికి ముఖ్యుడగుచు
మనకు వచ్చెడి పన్నులను దానె గొనుచుండె
నిపుడు వారినె సమర్థించుచుండె.

వచ్చుచున్నది యరిసేన ప్రబల మగుచు
నింక నుపేక్ష చేసితిరేని నెట్లు స్వామి!
యనుచుఁ గల్లలు సత్యములట్లు తోఁప
జేయు చావిభుకో పాహిఁ జెనకె రేప-

చిరచిరలాడు చావిభుని చిత్తముఁ జీల్చుచు రేగి సాగి దు
ర్భర మగునట్టి రుడ్వేషధరంబు గుఱీన్ గఱవంగఁబోయి, యా
విరువనరేంద్రుకన్నుల పవిత్రమనోహరకాంతికట్టులో
సారిగ నగంబు చోదకుడు చూచుచుఁజూచుచె సోలి
పోవగన్.

ఔరా! యీతనికను లని
యారుష్టఖలుండు నాల్క నఱు కొఱికికొనం
గా రిపువాక్కుల విరుపుం
డారయుచుండెన్ విచిత్ర మగు శిల్పమునే.

ఈ నాతమ్ముని మాటల న్వినిన దో నెవ్వానికిన్ సత్యమే
లోనందాఁగి, యసత్యమన్ శమమె తళ్కుల్ చూపదే,
సత్యమే
తానై నట్టు నిదెంతకౌశలముతో తథ్యంబు పైఁగట్టె మి
థ్యా నిర్మాణము, ఏడి దే యసురమాయాశిల్పతత్త్వంబొకో!

స్థిరమా సత్యము, సత్యమే వెలుఁగ, గదే దివ్యత్వ మద్దానికిన్
బరమై యుండు నసత్యమద్దె తమమా విశ్వంబునన్ సత్యపున్
మెఱుఁగున్ దాల్చుచు సత్యమట్లు మెఱయున్ మిథ్యా
నృతత్వంబు, స
త్యరుచిస్థాయి కళాత్మకంబెకద! దివ్యంబైన శిల్పం బిలన్.

కనులేకావు ప్రమాణమెన్నఁడును, లోకాంత్యంశమే బాహ్యపున్
గనులన్ దృష్టినొసంగుఁ గాంతి తమముల్ గన్పింపగా జేయు నీ
ఘనమా వెల్గును జీఁకటుల్ బెరసియే కాదే విభిన్నత్వకా
రణమై యుండును వీనియందు సహకారంబో! విరుద్ధత్వమో.

పరమపురుషుఁడెఱుంగుఁ బౌండ్రకవాసుదే
వులను మాయతలలు మొలిచి పొలియ
కుండ భాగవతము కొనకు రామాయణ
మ్మైన నడువ దొక్కొ! యతనిలీల.

ఈరీతి విరుపు మనసునఁ
దీరులతీరుల తలంపుతీవలు ప్రాకెన్
రారా జవు డాతని నీ
నేరములకు నేమిచెప్పనేర్తు వని యనన్.

విని, స్థిరచిత్తుఁ డా విశుపవీరుఁడు ధీరమనోహరుండు క
న్గొనలకు నంటిపొంగు నవకోమలకాంతులు మూఁడుదిక్కులం
దనుపమశోభ నింప దరహాసము మీసముఁద్రిప్ప నిట్లనెన్
వినమునుకొన్నయెల్లరును విస్మయమందఁగ నిర్భయంబుగన్.

ఈ నాతమ్మునిమాటలన్ వినినచో నెవ్వానికిన్ సత్యమే
లోనందాఁగి యసత్యమన్ తమమె తళ్కుల్ సూపదే సత్యమే
తా నై నట్టు లిదెంత కౌశలముతోఁ దథ్యంబుపై గట్టె మి
థ్యానిర్మాణమువీఁడు నమ్మకుఁడు దేవా! నేరఁడీబాలుఁడున్.

కోట్లకొలఁది శిరస్సులు, కోట్లకొలఁది
కనులు కంఠముల్ బాహువుల్ గల విశాల
మైన సామ్రాజ్యమునకు నాయకులు మీరు
వేయికనుల మెలఁగవలె న్యాయ మొప్ప.

ఈసమ్రాట్పదవిం ధరించి నిరతం బీధర్మకర్తృత్వమున్
దోసం బింతయులేక తీర్చినఁగదా తోషించుఁ దా నుప్రజా
వాసుం డౌవారి దానికిన్ వలయు దేవా! నిస్పృహాత్వంబు దీ
క్షాసౌశీల్యములున్ వివేకమును దక్షత్వమ్ము ధర్మిత్వమున్.

ఏదికొఱంతయైన నొకయింతయు నేమఱి నట్టులుండినన్
మీఁదఁ బ్రమాదమౌ నెపుడు మేకొని స్వార్థపుదుష్టశక్తు లే
దేదొ విధాన రంధ్రములనే కనిపెట్టుచునుండు వాని వి
చ్ఛేదము చేయకున్న మరి శేషమునిల్చిన ముంచివేయవే?

స్వార్థపరుఁడగునీతఁడో స్వామి! మీకు
నిచటి ప్రజల స్వరూపమే యెఱుకపడని
యట్లు కనులకుఁ బొరకప్పి ననృతభాష
ణముల నిపుడైన మీరు సత్యమును గనుఁడు.

ఈ పెనుగొండమండలపు జిల్లలలో నివసించు నెల్లరం
దేవపురుషుం డెటుల్ హృదయమెట్టిదో బాగుగ నేనెఱుంగుదున్
మీాసయి వారి కెల్లరికి మెండగు భక్తి యకృత్రిమంబు హృ
ద్దీపకమై వెలింగెడిని దేవ! యెఱుంగరు మాయమర్మముల్.

అపుడే చెప్పితిఁగాదె యీాతడు దురాశావిష్టుడై సుప్రజా
ళిపంబున్ బన్నులయెండలన్ బరపి పీల్చెన్ బిప్పిచేసెన్ ప్రజల్
కుపితుల్ గాకెటులుందు రెత్తిచనినన్ గోవైనఁ గ్రుమ్మంగరా
దె పులిన్ సైపక, సాదు రేగినను నెందేనోర్వఁగా శక్యమే.

ప్రజల కిప్పుడు నీతనిపైన వ్యక్తి
గతముగా లేదు ద్వేషంబు, గతమునెల్ల
మరచి యిప్పుడైన నీతడు మంచిమార్గ
మునకు వచ్చినఁ బూజింత్రు పూలతోనె.

ప్రేమ వెదజల్లి వెదజల్లు ప్రేమతాత్త్వి
కుని గనున్ వీరు ప్రేమించి మనసులార
పత్రమో పుష్పమో యన్న పగిది నేను
కట్టు దేవాలయమునకుఁ గానుక లొసఁగ.

అదియును దప్పగునె ప్రభూ!
యది కసి యోగ్యంగ రానిదా? యద్దానన్
గొదవగునా? యీామాత్ర
మ్ముదారతకు స్వేచ్ఛలేదె యుష్మత్ప్రజకున్.

నా, నా దేశపు పూర్వపుణ్యఫలమై నాస్నేహితుం డీ ప్రదే
శానన్ గా లిడె శిల్పి, శత్రునృపురాజ్యానన్ మహాపూజ్యుడై
నానాభోగము లొందియుండియు ధరానాథుండు ప్రోత్సాహ
మిం
తేనిన్ శిల్పకళావికాసమున కీనేరం డటంచున్ బ్రభూ!

భోగములనెల్ల వీడి యీపుణ్యభూమి
కతఁడు శిల్పబీజములతో నరుగుదెంచి
నిరతకృషిసల్పి యిచ్చట నిత్యనవ్య
శిల్పములతోఁటనే పెంచె శ్రీలు విరియ.

అతని కేటికిఁబట్టు రాజ్యాంగచింత?
లాకళారమ్యలోకవిహారమతికిఁ,
గళకు దేశంబు జాతియుఁ గాలభేద
ములయెడన్ బక్షపాత మెప్పుడును లేదు.

అమ్మహాశిల్పి నే నరిరాజు నాస్థాన
మునునుండి తేలేదు ము న్నెఱుంగ
నతనికి నాతఁడే యరుదెంచె దైవిక
మ్మునఁ జేరితిమి పుణ్యభూమి నిచట
గొప్పవాఁ డతనిని గొప్పచేయుట తప్పె?
నైరికి మాకు సంబంధ మేమి?
సంధానమును లేదు గింధానమును లే ది
వన్నియు నీతని యల్లకములె

ప్రజలహృత్క్షేత్రముల ద్వేషభావరూప
విషకుజంబుల నెల్లను బెళ్ళగించి
సమత నెలయించి, ప్రేమబీజములు చల్లు
నేను, ద్వేషంబు పెంతునే యెచటనైన.

ప్రభువు ప్రజనుండి పన్నులఁ బాడియావు
పాలు గొనునట్లు గొనవలె భయముచూపఁ
బొదుగు కోయఁగబోయిన బొట్టుపాలు
చిక్కునే దోస మెవరిది చేపకున్న?

పన్నులను నేను గొనుచుంటి నన్నమాట
వట్టి యనృతము దోస మేవైపు గలదొ
పలుకుచుంటిని నిష్పక్షపాతబుద్ధి
నింక సరిసేన యేదియో యేనె యెఱుఁగ.

అరిసేన యేదియైనను
పరుదెంచుచునుండెనేని సరికట్టంగన్
సరి మేముగూడ నిచ్చట
స్థిరధర్మప్రభుత ప్రజలక్షేమమున కగున్.

మమ్ము నేలు తండ్రి! మావానిమాయలఁ
జిక్కకుండు, లోనఁ జెదరకుండు
వీనిఁ జక్కదిద్ది వెనుకటి సమ్రాట్టు
లట్లు ప్రజలఁ బ్రీతి నరయుఁ డిచట."

అనుచున్ బల్కుచు నుండఁగా వినుచు నందం దా ధరా
నాథుడున్
దనకే బుద్ధులుచెప్పునట్టి నుడు లాత్మ ప్రజ్ఞకున్ లోపమై
వినఁగా జేదయియుండినన్ విరుపపావిత్ర్యప్రభావంబునన్
వినెఁ గష్టంబుగ నూరకే, విని ఖలోక్తీనాథు వీక్షించుచున్.

"ఏమయ్యా! కడుమంచివాఁడవని నిన్నే" యంచు నుండంగనే
"స్వామీ! మోసము మోస మీఖలుని వాక్చాతుర్యపున్
మాయలో
నేమైపోతిరి ? నన్నె నమ్మరె? యితం డీలాంటిధూర్తుం డటం
చే ము న్నెన్నడు నేర నల్లయిన ముందే చూపనే సాక్ష్య
మున్!"

అని ఖలుఁ డామండలపతి
తనకే వచ్చిన విపత్తు తప్పించుకొనన్
దనసాహసమ్ము నెల్లన్
మునుకొని నటనములె నలిపె భూవిభు నెదుటన్.

కలఁగనుచు నుండువానికిఁ
గలలోనిది కలయటంచుఁ గా దను చిరువుర్
పలికినఁ దెలియునె నత్యము
కలవర మగుఁగాక యట్లె కన్పడెఁ బతికిన్.

కొనకు దుస్మతి యూహించుకొనియె నొక్క
మార్గ మాతఁడు పల్కె నమ్రమాట్లతోడ
"నీ విరూపుడు నిజముగా దేవ! రాజ
భక్తి గలవాడయేని యీప్రజయయేని.

నట్టి మాటలలోఁ గాక పనులఁజూపె
నేనిఁ దన రాజభక్తిని వీని నమ్ముఁ
డట్లు కాకున్న నావల్కు లన్ని నమ్మి
వీని విద్రోహి బంధించి వేయుఁ డింక.

అని సమ్రాట్టుకుఁ చెవిలో
గొణిఁగె రహస్యముగ నేమొ క్రోధము రేపన్
జననాథుఁడు విరుపునితో
ననె నిట్లు ప్రయత్నపడుచు నార్భాటముగన్."

"ఓవిరుప! నీవు కట్టెడి
కోవెలపనినెల్ల నిలిపి గొబ్బున శిల్పిన్
మావశము చేయునటు లేఁ
గావించిన నాజ్ఞ నట్లె గావించెదవో!"

అని విభుఁ డన్న నావిరుపునందుఁ గలంతయొకింత కల్గకుం
టనుగని విస్మయంపడిరి నాథుకు మున్నుగ నెల్లవారలున్
అనితరశాంతచిత్తమున నావిరుపుం డిపు డేది ధర్మమం
చును మదిఁగొంత యెంచి దృఢసూక్తుల నిట్లనె రాజ
రాజుతోన్.

"ఓ ప్రభూ! ధర్మజిజ్ఞాస నా యోపినంత
నా మనస్సుననెంచి నిర్ణయముచేసి
కొంటి, మీయాజ్ఞఁ బాలింపకుంటె ధర్మ
మనుచుఁ, గారణములనెల్ల వినుఁడు మీరు.

రాజాజ్ఞాపరిపాలనం బెప్పుడుధర్మం, బైన, దేవాలయం
బోజన్ గట్టెడిశిల్పి కార్యమున కేయుత్పాతమున్ రాని య
ట్లేఁ జూడన్వలె వానిఁగావవలె నాకీరెండునున్ ధర్మముల్
రాజాజ్ఞల్ సలుపంగ ధర్మమున మేరల్ లేవె ధర్మప్రభూ!!

స్వధనముతోడఁ బిమ్మటఁ బ్రజాధనదానముతోడ, దేవతా
సదనము గట్టఁగాఁబడియెస్వామి! యొకింతయుఁగాని యుందు రా
జ్యధనములేదు రాజ్యపుసురాలయమేని ధరేశునాజ్ఞకున్
బదులును జెప్పనేర నటువంటిది కాదిది కాన నోప్రభూ!!

ఇట్టిపుణ్యకార్యము విరమింప నాజ్ఞ
చేయుటకు ధర్మరీతిగ క్షితిపతులకు
నర్హతయెలేదు నాకు నాయనఘశిల్పి
పైన నేమున్న దధికార మైననెంచ,

రవి యస్తాద్రినిఁజేరవచ్చెఁ బ్రజలెల్లన్వత్తు రీవేళ కా
శివునర్చింపగ దేవళంబునకు రాజీవాక్షునాజ్ఞన్ భువిన్
దివి వర్తించెడి కాలచక్రమున దానిన్బట్టి పోకున్నచో
నవునే? నాకు ననుజ్ఞయిండరుగ దేవా!" యంచునాతండనన్.

ధర్మవాక్యములం దొక్కతప్పఁబట్టఁ
జాల కలసిన యాధరాపాలకుండు
నేగు మీవింక నని లేచె నెల్లపరిజ
నాళి లేవఁగ లోననేకూల ఖలుఁడు.

# 6. చేర్పు

కనువిచిత్రంపు కాలచక్రంబుపై ని
ద్రాక్ష రమ్యమా చిత్ర మాద్యమణి పశ్చి
మాశ నస్తంగతుం డయ్యె నంధకార
చిత్ర ముదయింపఁ జుక్కల చెలువుతోడ.

కలిసిన చీఁకటుల్ గలిసి కార్కొని బాహ్యజగత్తు క్రమ్మఁగ, లో
నవనవకాంతులన్ వెలుగు నాథుని దేవళమం దుమాసతీ
ధవుని భజించి, పౌరులు ముదంబున నిండ్లకువచ్చి రా విరూ
పవిభుని వాసిధీరతకు వాక్సుధలన్ గొనియాడు చెంతయున్.

వచ్చి కుటుంబినుల్ దమకు వడ్డన సేయఁగఁ బ్రీతితోడ గో
ర్వెచ్చని యన్నముల్ గుడిచి బిడ్డలతోడుత నెన్నో రీతులన్
ముచ్చటలాడుచున్, విడియముల్ గొని గోష్ఠములాదిగన్
గడున్
హెచ్చరికన్ ముగించి పను లెల్లెడ సెజ్జలఁ జేరి యంతటన్."

పాలుద్రావి బిడ్డ లటు నిర్భయముగా శ
యించియుండిరి యేపాప మెఱుగకుండ
నిండు లేపాక్షి పురమున రెండు జాము
లయ్యె రేయియు నాసమయంబునందు

కెవ్వన కేకవేయఁ జను క్రేవశయించిన చంటిబిడ్డ ము
ద్దివ్వఁగఁబోయి భీతహరిణేక్షణ కన్నులుమూసి నాథునిన్
రివ్వనఁ గౌఁగిలింపఁగ నులిక్కని లేచి పురంబు సర్వమున్
నివ్వెరవోవఁ బ్రేలె నశనిధ్వనులన్ బురిలో తుపాకులే.

డండండమ్మని ప్రేలు శబ్దములవెంటన్ వచ్చె హాహాకృతుల్
గుండెల్ జారెను స్తబ్ధులైరి మరి గగ్గోలయ్యె శౌర్యంబుతో
'కొండాగుండ' యటంచుఁ బిల్చుచునె బాకుల్ బల్లెముల్
పూని యు
ద్దండుల్ పర్విడిగొక్కుయొత్తునఁ బ్రమాదంబున్ నివారింపగన్

అనుకొన్నంతకుమించెఁ గార్యమిఁక నిం దాలస్యముం జేసినన్
మనలం బంచిన మండలాధిపతి పన్నాగంబుకే మోసమౌ
నని లోనెంచి తుపాకిసైనికులు చౌర్యం బేర్పడంగన్ బలా
యనమంత్రంబుఁ బఠించి రాక్షణమ వెన్నాడంగఁబౌరుల్
దమున్.

ఓరినీచులార! పారిపోదురె యంచుఁ
బౌరవరులు వెంటఁబడఁగ వారు
పారిపారిపారి పట్టణంబును దాఁటి
పారి శిబిరమందు వచ్చిపడిరి.

లీలన్ వ్యాప్తమహాంధకారకృతకక్రీడేంద్రనీలస్ఫుర
చ్ఛైలేంద్రంబుపయిన్ మహారుచిరనక్షత్రాలతో శిల్పముల్
చాలన్ దీర్చుచునున్న యావిభుని కన్ చాలైన చోటా? తమ
శ్శైలాథోగుహవోలు నాశిబిర మెంచన్ వానితంత్రాలకున్.

బూటకమెల్ల వ్యర్థమయిపోయిన యాఖలమండలేశుఁడున్
వ్రేటునుదిన్న వ్యాళమటు వెఱ్ఱిగ లోననె త్రొక్కులాడి తుం
టాటల నడ్డుకట్టి జయమందిన యాకను లెంచి యెంచి హృ
త్కోటరమందు ద్వేషశిఖ ఘోరముగాఁ జెలరేగి రేపఁగన్.

మరలన్‌వచ్చి ప్రథరేశుమానసముపై మాయల్ విరూపక్షితీ
శ్వరవీరాగ్రణిపైనఁ దుట్టతుది యస్త్రంబున్
ప్రయోగించుచున్
వెఱఁగున్‌జేయుచు నున్నవాఁడు పలికెన్ "దేవా! సమస్తక్షితీ
శ్వర! మీరే కనుగొంటిరే ప్రజలధార్ష్ట్యం బిప్పుడైనన్ ప్రభూ.

మరలన్ జెప్పుచునుంటి నీప్రజలకున్ మానీడయున్ గిట్ట దా
విరుపుం డింతకుఁగారణంబు ప్రజ'తర్బీ'తయ్యె నవ్వానిచే
నెఱుగన్‌జేయఁగ ద్వేషభావమును మాకే యాతుపాకీలతో
నరరే! వీనికి భీతిచెంది ప్రభుసైన్యంబే యిఁకన్ బారునో!

అని వికృతంబుగానగి దురాత్ముకుఁ డిట్లువచించె నంతచు
ల్కనయని యెంచరాదు ప్రజ లావునెదుర్చుట యంతలేని దే
తృణముగనెంచి మిమ్ముఁ దమ రిచ్చినయాజ్ఞఁ దిరస్కరింప నో
క్కని కగునే? విరూపునకుఁ గావర మెంతగ మించియుండినన్.

తమరు చేసినయాజ్ఞకు ధర్మపన్న-
ములను బోధించుటా? మీకు, భూవిభునకుఁ
దగినమర్యాద వానిబోధలకు మీరె
యూరకుండఁగ నాపేదనోరఁ కేమి-

చేయఁగానోపు స్వామి! కార్చిచ్చుపోలె
లోన రేగెడి రోషమున్ లోనె మ్రింగు
కొంటిఁ దుంటరి కావిధి కోమలాంగ
మొసఁగు టని లోనె దూరుచునుంటి నొంటి.

ఆకను లున్న వేయవి మహాప్రభు! కన్నులె మోహనా స్త్రీముల్ గాక విధాతసృష్టి కపకార మొనర్చెను వాని నొక్క స్త్రీ కీక, దురాత్ముఁడొక్కనికినిచ్చి, ప్రమాద మదట్లుగాదు మీ కీక క్షమింపుఁ డీతని ననేకవధూనయనైకమోహనా!"

అనియెడు వేళకు సరిగాఁ
గనుసైగ నెఱింగియొక్క కాంత విభునకున్
వినయయుతో నందించెను
వనరుహదళనేత్ర పానపాత్రఁ బెదవికిన్.

బెరయఁగ గోషముం దమియు వేగరవేగర త్రావుచున్ ధరా
వరుఁ డరుణేక్షణంబులను బైవడ కెత్తి క్షణంబు మాధురీ
భరితములైన యావనిత వాలగు కాటుకకన్నులందుఁ దా
బెరయఁగఁ జేసెఁ జిన్నగవువీచి బయల్పరుపంగ నామెయున్.

వనిత పానపాత్రను ధరించిన కరమ్ముఁ
దనమృదుకరమ్మున న్నివర్తన మొనర్చి
వరుస ముఖముద్రిప్పుచు నొక్కవైపునుండి
పతి సతృష్ణవీక్షణములఁ బరపిచూడ.

కాంత యొకతె సిగ్గు దొంతరలన్ దన
పూర్ణచంద్రుఁబోలు మోమువంచి
వితతతాళవృంతవిపులమేఘము నడ్డు
దెచ్చుకొనియెఁ బెదవి తీపిదాఁక.

చేతిపై ననున్న చిలుకను బలుకరిం-
చుచును మురియుచున్న సుదతియొక తె
యొక్కసారి విభుని నోరచూపులఁ జూచె
శుకమునకును నతనిఁ జూపునట్లు

విభుని చూచుచున్న బిత్తరియొక్క తె
ప్రభుని చూపుల తనపై నఁ బడినఁ
ఝూలబంతి తన కపోలంబుపై వచ్చి
పడునో యన్న బ్రాఁతిఁ బ్రక్కకొదిగె.

ముద్దువీణ కేవో మోహనమంత్రముల్
నేర్పుచున్న యొక్కనెలఁత చెలఁగి
మనుజనాథుకనులఁ దనచూపులను జేర్చి
వివిధమధురగతుల వీణ నుడిపె.

విభునిచూపు లాటవెలఁది చూపులతోడ
నేకమైన నవియు నెట్టులాడె
నట్టు లాడె నివియు నాననంబులతోడఁ
గామబంధ మెంతగట్టిదో కద!

"ఈసుఖసమాధి రసికలోకైకచక్ర
వర్తి! యతులము లీభోగభాగ్యములును
విజయనగరేశులకుఁ గాక వేరొకరికిఁ
గలలనైనను లభియింపఁగలవె తండ్రి!"

అని మరలించి యవ్విభుని నాఖలుఁ డిట్లువచించె "దేవ! యీ యనితరలభ్యసౌఖ్యముల కన్నిటికిం దమయాశ్వరత్వమున్ ఘనతయుమూలముల్ గద! జగత్తునకెల్లను విష్ణుమూర్తి యీ మనుజవిభుండటంచుఁ బలుమారు వచింపవె వేదశాస్త్రముల్

మీయాజ్ఞ నెట్టివానికి
న్యాయాన్యాయంబు లెంచ నర్హతకలదే?
మీయాజ్ఞ యేది కల దది
న్యాయంబు నలంఘనీయమై యేపారున్"

ఆజ్ఞ నుల్లంఘన మొనర్చు టన్నఁ దాను
తమ్ము మించినవాఁ డని తలఁచుటె గద!
దానికంటెను ద్రోహ మెంతైనఁ గలదె?
ప్రభున కంతకంటెను దలవంపు లేదు.

తమయాజ్ఞ నుల్లంఘనము చేయు టనుదోష
మొక్కటే చాలదే యుర్వినాథ!
యీ దురాత్మునిఁబట్టి యతిఘోరమౌ దండ
మును విధించుట కంతె యని తలంప-
కుండు వాఁ డొనరింపకుండు ద్రోహమె లేదు
ప్రత్యక్షముగ నున్నవాని వినుఁడు,
మీకె బుద్ధులుసెప్పు మేటి దా నను నహం
భావంబు చూపఁడే ప్రభులయెదుట

నిపుడు ప్రత్యక్షముగఁ బ్రజ నెత్తుకటి
కేయిప్రొద్దు తుపాకులంబేల్చి మిమ్ముఁ
బ్రతిఘటింపఁడె ప్రత్యక్షగతమునకును
సాక్ష్య మడుగుట వై పరీత్యంబుగాదె.

మీయుప్పుదిననె నే నని
మీయెదుట నటించినట్టి మెత్తనిపులి తా
మీయింటిలోని వాసము
లే యెట్టులు లెక్కయిడెనో యిపు డెఱిగింతున్.

స్వధనముతోనే దేవుని
సదనము గట్టించినాడ స్వల్పంబును రా
జ్యధనము గా దని చదివిన
యధముని స్వధనస్వరూపమైనఁ గనఁ దగున్.

అని పలుకుచు నా దుష్టుఁడు
జనపతిసముఖంబునందుఁ జరచర దస్త్రం
బును విప్పి యొక్కదానిని
గనులయెదుటఁబెట్టెఁగొన్ని కాగితములనే.

సృష్టన చేసెడివారలు
సృష్టన యని తోఁచునట్లు సృజియింపరు ని
శ్చేష్టుండై యాజనపతి
స్పష్టంబుగఁ జూచె నచటి పత్రము లెల్లన్.

జనపతిభావమ్మును ముఖ
మునఁ జూచుచు నూరకున్న ముష్కరుఁడు దనున్
జనపతి చూచినతోడనె
తనవాదము దీసె గొప్పధర్మజ్ఞు నటుల్.

మీధనమెల్ల లక్షలకు మ్రింగినతీ రిది చూడుఁ డింతయే
కా దది యంతయున్ తనదిగాఁ బ్రకటించిన దోషియంచు నే
భూధవుఁ డెంతవాఁడయిన మోవఁగఁజాలని 'ఖర్చు' మండలే
శాధముఁ డొక్కఁడెట్లు తనయర్థముతో భరియించు
నంచునున్.

కానికి నేడ్చు నీప్రజలఁ గట్టిన గొట్టినఁగాని రాని ప
న్నైన నదెంతయంచు మరియందును నీశ్వరుపాలుపోవఁగా
వానికిఁ జెందఁగావలయు భాగమదెంతయటంచు నంద న
వ్వానివిలాసభోగముల పాలయిపోయిన దెల్లఁ బోవఁగన్.
మిగులున దెంతయంచుఁ గన మిక్కిలిప్రేగయి మీరెఁ
గన్నటుల్

గగనమునంటుచున్న గుడిగాఁ బొడిగించిన దుర్గమందు మే
లగునొకవైపు వజ్రమునకై నను జాలునె వాని సర్వమున్
దెగఁబడియొడ్డినన్ దుదకుఁ దేపలువేసిన బిచ్చమెత్తినన్.

అనుచున్ నాకును మీకుసైతమగునే యీ దుర్గముంగట్టఁగా
ననుచున్ మీధనమెల్లఁ గొల్లగొనకే యాదుర్గమున్ గట్టినాఁ
డనినన్ బచ్చియబద్ధమంచు నగరే హాస్యంబుగా బాలురున్
జననాథా!" యను చింతయైన నవకాశంబీక యోచింపఁగన్.

ఱటులను చిటులను చదియిది
యిటులెందుకటంచు సత్యమిదియే యనుచున్
బటుతరవాఙ్నటనంబులఁ
గుటిలాత్ముఁడు ధర్మవిభుసిఁ గుంఠితుఁ జేసెన్.

పైపయి నిట్లు పల్కెఁ బలుపాపి దగాలకు ద్రోహిడీల కు
న్నే పరిహార మేస్మృతులనేని ప్రభూ! తలతీసివేసినన్
బాపముదీర దట్టిఁడులఁబట్టి స్మృతుల్ విధియించు దండమున్
మోహనిచో ధరాధిపుఁడె పొందఁడె నారకఘోరబాధలన్.

ధర్మదండనమునె తప్పించుకొనియున్న
చెడుగునొకనిఁబట్టి శిక్షసేయఁ
బ్రజలయందుఁ బెరుగు భయమును భక్తియు
నట్లుగాక ద్రోహ మణఁపఁగలమె?

అన్నదాతలౌ మీయింటఁగన్నమిడిన
వానికన్నులు మీ లక్ష్మిపైనఁబడియె
వానిఁ బెరికించివేసినఁగాని తండ్రి!
ధర్మముకుటము రాలిపో దా ధరిత్రి?"

అని కనులందుఁ దా విషమునట్టులె గ్రక్కుచు దుష్టుఁడున్ దటా
లున నొకయాజ్ఞపత్రమునె లోచనయుగ్మము ముందు పెట్టె నా
జనపతికిన్ విరూపవిభుచక్షువులం బెరికింప నాజ్ఞనే
తనదిగ వ్రాయఁగాఁబడినదానిని మానిత రాజముద్రకై.

జనపతి కనులద్దానిన్
గనె మనమున సక్రమంబుగాదే యిది యం
చనుమానము రేకెత్తుచు
నణఁగారెను జూపుపార సన్యవశంబై.

జనపతికను లా దుష్టుని
కనుచూపులఁజిక్కఁ జిక్కఁ గాంతల కనులన్
గనుచున్నకనులె చిక్కన్
గనఁబడు జడవైభవంబు కమనీయతలో.

అవశుఁడైన విభునిహస్తంబు ముద్రిక
నొత్తె నాఖలుండుఁ జిత్తమెల్ల
హర్షసాగరమున నల్లకల్లోలమై
పోవఁ జిత్త మనుచు భూవిభునకు.

వినతుండై యా పత్రముఁ
దనచేతికిఁ దీసికొని పదంపడి విభునిన్
ఘనముగ స్తుతియించి మనం
బున, మీసముఁద్రిప్పుకొనుచు బోయెఁ దమమునన్.

కాలమహాప్రవాహమునఁ గాలతమస్విని తాను తారకా
జాలములోనఁ జిక్కివరుసం గొనదాఁకను నీడ్వఁగాబడె
న్వేలకు, మాయమై చనియె వీడ్వడివీడ్వడి తారకాళి,పై
పై లలితారుణప్రభలువార్ని ధిదృశ్యముఁ దీర్చెఁదూర్పునన్.

ప్రియురాక్కై నెఱవిచ్చి నిరీక్షించు
　　తమ్మి నెమ్మది కమ్మతావులు గొని
మెల్లమెల్లగ జల్లచల్లగా వీచు స
　　మీరుని సోకున మెదలికదలి
పక్షంబు విదలించి పైకెగసిన విహం
　　గపు స్వాగతపుగీతిఁ గలసిమెలసి
దేవాలయంబున దివికెక్కు ప్రాభాత
　　సతతసంగీతంబు గతుల గొనుచు
వెలయు ఋష్యాత్మ దీపించు వేదమంత్ర
తంత్రముల యర్చనలగొంచుఁ దరణి ద్యుమణి
లోకబాంధవుఁ డేకైక లోకచక్షు
వుదయమయ్యెను జగమెల్ల ముదమునొంద.

అపుడు దేవళమున విరుపణ్ణ కడకు
పౌరముఖ్యులు రాత్రి తుపాకిగుండ్ల
గాయపడినట్టి వారిని గట్లతోడఁ
బిలిచికొనిపోయి చూపించి పలికిరిట్లు.

"ఓ ప్రభూ! కన్నతండ్రి! నీవుండఁగానె
రాత్రిచీకటి నే యపరాధమేని
నెరుగకున్నట్టి ప్రజలపై నెక్కువెట్టి
సైనికులు తుపాకుల్ప్రేల్చి చనిరిగాదె.

గాయపడినట్టి యీ ప్రజఁగాంచు మయ్య!
యింత యన్యాయ మార మెందేని గలదె?
రాజయిన నేమి? రాజుల రాజయినను
నేమి? దౌర్వ్యంగ నగునటే యిట్టిచర్య?

నిరపరాధుల హింసించు నీచునకును
శిరము వంచంగ దగునొకో సిగ్గుమాలి
మానమే పోవుచో దల మాత్రమేల?
ప్రతిభటించిన మాలావు బయలుపడదె?"

అనుచు నింకను నేమేమొ యనఁగఁ బోవు
పౌరముఖ్యుల ముందుకు పలుకనీక
నిలిపి, చిరునవ్వు మోమున దొలకరింప
విరుపవిభుఁ డిట్లు వచియించె బ్రియము మీర.

"అన్నలార! యింత యారట పడనేల
యింత దుడుకు పలుకు లేల మీకు?
మిడిసిపడిన బనులు సెడుఁగాక యొదుగునే
తాల్మి యొక్క-యింత తాల్పరయ్య.

మండలేశ్వరుండు మాయలోబడి చెడు
దారిబట్టియుంట తథ్య మరయ
విజయనగరవిభుడు వీని మాయలబడి-
నాడు కాని న్యాయము నయము విడడు.

మండలాధిపుండు మాపైన మీపైన
గసిని దీర్చుకొనగ గడగి పతికి
మనసు నెల్ల జెరచి మనల ద్రోహులవలె
జూపుచున్నవాడు దాపు చేరి.

మిమ్మొక్కవైపున రేపుచు
మ మ్మపరాధులుగ జూపి మనపై విభునిన్
గమ్మించి తగులబెట్టి స్వ
యమ్ము వినోదమ్ము జూడ నల్లెఁ బథకమున్.

విజయనగరేశు మదిలోన విసముపిండఁ
జడిన దియ్యెడ నాతనిపైన భక్తి
యింతయైనను దప్పిన నుంతయైన
నెదురుపడినట్లు దోచిన నొదుగు ముప్పు.

మీ మనోనిగ్రహము, ధృతి, మీ విశాల
దృష్టి ప్రేమయు భక్తి పరీక్షనొందు
సమయ మేతెంచె నిప్పుడు స్వల్పమేని
పోలినన్ దేశమున మహాక్షోభ రేగు.

క్రమమెరుంగక, చల్లగ గాచునట్టి
తల్లి గాయత్రి వర్ణముల్ తాంత్రికుండు
తారుమారుగఁ జేసి తా మారణప్ర-
యోగ మొనరింప మంత్రించు చున్నవాడు.

దాని మీారలు తిరుగు మంత్రముననఁ గాక
ప్రేమశక్తిని సరిదిద్దు విధము గనుడు
విజయనగరేశు కన్నులవిప్పి సత్య
సుందరత్వము సతనికి జూపుడయ్య.

నిజమెరుంగక ద్వేషాగ్ని నింపుకొన్న
యతని జెనకిన నగ్నిపర్వతము ప్రేలుఁ
బిదప సవరించుకొనరాదు వెలికిబాఱు
నగ్నిద్రవమున కెందైన నడ్డుగలదె?

అది ముంచివేయు సర్వము
మొదలంట నశించు గ్రామములు బట్టణముల్
మృదుశిల్పంబులు గుళ్ళును
మొదలాౘన్నులయు ద్వేషపుం జిచ్చెపుడున్."

మీా రాలస్యములేక యింకఁ గడుగూర్మిం బేర్మి నీ శిల్పిని
న్వీరణ్ణన్ గొని ముందు మంగళములౌ నృత్తంబు గీతంబు నిం
పారం బుష్పఫలాదులంగొనుచు సద్రమాట్టుం గడున్భక్తి నీ
శ్రీరమ్యస్థలి కేగుదెంచునటు ప్రార్థింపంగ నేగుం డనన్.

అదియుక్త మదియె కార్యం
బది మంచిది పూనుఁ డనుచు నందరుఁ ద్రుటిలో
నొదిగించుకొని సమస్తముఁ
గదలిరి శిబిరంబుకడకుఁ గడువిభవముతోన్,

విరుపక్షాదోళ్ళ నెల్లరు
నరనాథునిఁ బిలువఁజనిరి సవ్యశాలా వి
స్ఫురదాలయమున శౌర్యాది
మొరిగి కడున్ సంతసించె హృది నాథులుఁడున్.

ఇదియే తగుసమయం బని
విదితపరున కిన్నరికిని విభునాజ్ఞను దా
మది త త్తీరమున నటునిటు
వెదకఁదొడఁగెఁ గ్రూరపాప విగ్రహులకునై.

అలోనఁ గొల్వుదీరి నృ
పాలుఁడు దూరంబునుండి వచ్చెడి వాద్య
శ్రీలలితజయజయధ్వను
లాలించి మొరుంగరాని యూరకలఁతఁ గనెన్.

ఆకులతలోన హృదయం
బాక్లిష్టంబయ్యె, ధ్వనులు నా శిబిరంబున్
సోకెడిదాఁకన్ బెరుగుచు
నేకముగా వచ్చి యట నాకేవరి యూగెన్.

అంతఁ బ్రతీహారి శుభో
దంతము గొనివచ్చి "దేవ తమదర్శనమున్
స్వాంతమునఁ గోరి యనుమతి
కెంతయు భక్తిం బ్రజలు నిరీక్షించి" రనన్.

విస్మితుం డగుచు నృపతి "నేనేగఁ దెమ్ము
వారి నిటు"లనె, నా పత్రీహారి వెడలెఁ
బ్రజలచే వెనుకనే తాము వచ్చి నిలిచి
యెదుట శిల్పియు వీరభూమీశ్వరుండు.

వీరభూపకవులు వీక్షించి నరపతి
యులికిపడియె విరూపకలికకనుల
టంచుఁ బ్రమసి యంతరాత్మ గ్రుచ్చుచు వచ్చె
మూర్ఛనొంది పడియె భూవిభుండు.

దొంగలు ద్రోహులంచు గుండుష్టులంచును దాను ద్వేషదృష్టింగని నిర్వారించె నెవ్వనేతఁకు న్యాయని నట్టివారె క న్నంగనముందు ప్రేమనుమనోహరశం బదులియు, జీవితేన్ సా్వంగములో వలం జెరుగుచున్నను గల్పినయట్టు లయ్యెఁజో.

"అర్థధర్మస్థాని పరికట్టులకు నేమ
హీశ్వరు లవతార మెత్తినారో,
విమలవిద్యారణ్య విజ్ఞానదీప్తిలో
దేశంబు వడిపించు ధీరు లెవరో,
ప్రేమనెప్పుడు ప్రజాక్షేమంబు గూర్చుచుఁ
బ్రజల ప్రీతిని గన్న ప్రభువు లెవరో
యెవ్వరిపోషణ నెదిగి కళాలతల్
పుష్పించి పరమాత్మఁ బూజనేయు,

నెవరికీర్తి దిగంతాల కేగి సర్వ
లోకసన్నుతి గన్నదో, యేకదీక్ష
ధర్మపరిపాలనము సల్పు ధన్యులెవరో,
యావిజయనగరేశుల కగుత జయము!"

అని జయముపలికి విద్యా
వినయాన్వితులైన శిల్పి వీరణ్ణయు నా
జననాథున కీరీతిగ
వినిపింపందొడగి రాత్మవృత్తాంతంబున్.

"నుతశీలుండు విరూపభూమిపతికిం దోఁబుట్టు వీవీరభూ
పతి, వీరల్ పెనుగొండమండలము నొప్పారంగఁ బాలించి స
త్కృతులన్సల్పియనేక, మిప్డు కడుభక్తిన్ మీప్రజాశ్రేణియం
దతిసమ్మాన్యులుగా వెలింగెదరు దేవా! వీరికిన్మిత్రుఁడన్.

అని యాశిల్పివచింప వీరన "ప్రభూ! అందాలయంతఃపురం
బనవద్యంబు వయస్యభావభవనంబం దింతచో టిచ్చె మా
కని హర్షించెద మీ కళావిదుఁడు కన్నారంగ వీక్షించినం
దనివే తీరని శిల్పకల్పకవనిం గల్పించెఁ జేయారఁగన్.

మనసారవచ్చి మీరలు
గనవలెనని ప్రార్థనంబు గావింతుము మా
యనవరతశ్రమ మంతయుఁ
గనుసార్థకతన్ భవదభిగమనముతోడన్.

అనుచుఁ బలుకుచుండ నాపల్కు లవనీశు
మదిని గ్రుచ్చెఁ గలచె మరియుఁ గాని
యాత్మకృత్యమును సమర్థింపఁగా గ్రుమ్మ
నహము చెడుతలపుల కండయయ్యె.

విభుఁ డేమియు ననకుండెన్
సభ మౌనముదాల్చియుండె సదమలము కళా
విభవమ్ముగూర్చి మరలన్
ప్రభునుద్దేశించి శిల్పి పలుకం దొడఁగెన్.

“నాపని యేమిలేదు ప్రభు! నాయకుఁ డాభగవంతుడే జగ
ద్వ్యాపకుఁ డాత్మలీలల నతండె ప్రకాశముసేయు సత్కళా
రూపమునం దదద్భుతసురూపములందలి సుందరత్వమేఁ
బైపయిఁ జూచి కాంచెదను బట్టగరానిముదంబు నాత్మలో.

పురుటింటివెల్గు నెత్తురుకందు కనువిచ్చి
దీపంబునం గాంచు తేజ మెద్ది
తల్లిమోమున దేనిదర్శించి పసిపాప
కిలకిలనవ్వి కాల్ కేలు గొట్టు
నాచందమామనే యమృతంబుగొని తల్లి
తినిపించు బువ్వతోఁ దినును శిశువు.
చిటిచిట్టి బొమ్మల శ్రీతోరణమ్ములఁ
బాపల గుమిగూర్చు ప్రణయ మెద్ది

యదియె యాబాలగోపాలమధురమైన
దదియె యజ్ఞులు విజ్ఞులు నందఁగోరు
నదియు, సౌందర్య, మఖిలకళార్థ మదియ
యదియ యానందకంద మీయఖిలమందు.

దేనిం గాంచుచుఁగాంచుచున్ రససమాధిన్మగ్నియచ్ఛిన్నమా
నానందంబునుబొందు నద్వయతనవ్యక్తానుభూతిం గనున్
లోనం దీప్తినిఁ బూర్ణతంగను సదాలోకంబు, సౌందర్య మ
ద్దానం బూర్ణతనొందు సత్కళ జగత్కల్యాణసంధాయియై.

రసమయభావనిర్మలసరస్సున నాట్యములాడు వీచికా
విసరము లౌచు నొప్పెడి విభిన్నవిభిన్నవిలాసశిల్పముల్
మిసమిస లాడుచుం బ్రతిఫలింపఁగఁజేసెడి సుందరత్వపున్
లసదమృతాంశులంగొని యనంతసుధానిధిఁ గాంచగావలెన్.

వస్తువు రేఖలు శిల్పము
విస్తృతభావములు మరి విభిన్నరసంబుల్
శిస్తుమృదుత్వము దీప్తియు
నిస్తులసుందరతఁ బెంచు నిఖిలకళలలో.

ఇవి సత్యములై సత్యము
లవలీలగఁ జూపు కళ మహాద్భుతశక్తిన్
సవరించుచుఁ జేతంబును
శివమై సౌందర్యపూర్ణసిద్ధామృతమా.

ఆయమృతంబు గ్రోలుటకు స్వాగతమోధరణీశ! మీకు" నం
చాయనఘుండు శిల్పివచనామృతమున్ బ్రసరింపఁజేయ భూ
నాయకుఁ డొక్కనిట్టుసురునన్ బదులిచ్చె మనోవికారముల్
తీయని పానకంబునకుఁ దీరని పుల్లలువోలె నడ్డుగాన్.

"శిల్పిపల్కులు రమ్యముల్, చెప్పినట్టి
తత్త్వములు సత్యములె. యడ్డు తవిలితవిలి
యేదొ నామది గలఁచెడి మోదనిధిని
జూడఁగొననీక యీ బాధ తీరుటెట్లొ.

వరసౌందర్యవు రమ్యత
నెఱిఁగిన వాడయ్యు నకట! యేలా యిటు నే
నరనిముసమైన నందున్
స్థిరముగ మదినిల్పలేక దీనుఁడనయితిన్.

అని విభుని యంతరాత్మన్
వినఁబడి వినఁబడక యొక్క వేదన పలికెన్
మునుకొని పీరన శిల్పము
లను వర్ణింపందొడంగె లలితఫణితులన్.

మధురకళాసంగీతము
న ధరేశుఁ డయుక్తుఁ డగుచు నవయగ నిచటన్
మృదువిశ్వకళాగానపు
తుదిస్థాయిన్ నిలిచి సాగఁదొడఁగె విరుపుఁడున్.

అచటఁ గంపించుచుండె సత్యమ్ములట్లు
దోఁచు లోకములెల్ల నేత్రోపగూఢఁ
గానరాకుండె ముందు వెన్కటి స్వరమ్ము
లెల్ల లయమందుచుండె సద్దంతలేక.

ఆత్మ కేమితోడయియుండు నఖిలమును ల
యంబునొందిన లోకమే యంతరింప
నెచట నిల్చెడి సమ్యాత్మ యెందుఁబోవు
నే స్వరూపముతో శబ్దమే లయింప?


ధీరవిరూపాక్షునకున్
ధీరత దిగజారలేదు దివ్యానందో
దారమహాత్మ్మన కట మన
సార విరూపాక్షవిభుని ధ్యానింపంగన్.

విరుపు హృదయాన మార్మ్రోగె విభుని స్తవము
విరుపు హృదయాన మమతలు వీడిపోయె
విరుపు హృదయాన ధైర్యంబు వింటికెక్కె
విరుపు హృదయాన నానందపరిధి పగిలె.

విరుపుడు బహిర్ముఖుండై
తెరచికనుల్ చూచె నెదుట స్థిరలింగము వి
స్ఫురితమ్ము జ్ఞాననేత్రముఁ
దెరపించిన దాని భక్తిదీప్తులు వెలుఁగన్.

"కిం బ్రూమ స్తవ సాహసం పశుపతే కస్యాస్తి శంభో భవ
ద్ధైర్యం చేదృశమాత్మనస్స్థితి రియం చాన్యైః కథం లభ్యతే
భ్రశ్యద్దేవగణం త్రసన్మునిగణం నశ్యత్ప్రపంచం లయమ్
పశ్యన్నిర్భయ ఏక ఏవ విహరత్యానంద సాంద్రో భవాన్."

(శివానందలహరి)



కనుమూసి యుదే దీప్తిన్
గనుగొనె విభులింగమును జగద్వ్యాప్తమ్మున్
గను దెరచినఁ గనుమూసినఁ
గనుపించెడి దొక్క విభుని కాంతియె యయ్యెన్.

అది తక్క నన్యమెల్లను
మదిఁ ద్యాగము సేసె విభుఁడు మహనీయుం డా
మృదుహృదయుని బరశివునిన్
మది నమ్మినవారి కున్నె మాయాభయముల్?.

స్రష్టయె దానె సరస్వతిశక్తితో
శిల్పసృష్టికి మూలకల్పకమయి
నిల్చి శబ్దబ్రహ్మ నిర్మలానందస్వ
రూపుఁడై యొప్పుచు లోకమెల్ల
వ్యాపించు విష్ణువై బాలకృష్ణుండునై
ప్రేమ చైతన్యంబు వెలయఁజేసి,
విమలవిశ్వానంద విభవమ్మునన్ బంధ
ములనెల్లఁ ద్రెంచి సంపూర్ణుఁ జేసి,
పరమశివుఁ డయి తా విరూపాక్షుఁ డగుచు
లయమహానందమున మాయభయము మాన్పి
యరయఁ ద్యాగైకగమ్యమా నమృతపదముఁ
జూపు పరమాత్మ నెంచె విరూపవిభుఁడు.

తద్భవమోహుఁడై యతఁ డతద్విభవంబులఁ జూసి సంగమున్
దద్భవమోదలాలసతఁ దద్విభుతన్ బ్రభుఁడా త్రిలోకబడెన్.
దద్భవకామకామసగతస్వగతప్రభుఁ డా మురాత్ముఁడున్
దద్భవపాశబద్ధుఁ డయి తైతకలాడె విహారపుపై పగన్.

తచ్ఛోదితుఁలై యిరువు ర
సచ్చరితుల్ ముష్కరులయి చనిరి పడిపడిన్
జెచ్చెర విహారపు కన్నులు
గ్రుచ్చి కనులఁగులుకులిచ్చి కొల్లగొనుటకై.

కొల్లధనంబులుండియును గోర్కెలుతీర్చుజనమ్ము లుండియున్
తెల్లముగా మనమ్ము ఋణమున్ నిలుపందగు శక్తిలేక వి
ద్యుల్లతలట్లు మాయమగుచుండెడి మోదపుఁగాంతిఁ బట్టగాఁ
దల్లడమందుచున్ వినుచుఁ దత్ప్రభుఁడుండెను వీరవాక్కులన్.

వీరవిభుఁడు శిల్పవిభవంబుఁ గొనియాడి
పలికెనిట్లు తుదకుఁ బ్రభునితోడ
స్వామి, శిల్పమునకె సర్వస్వమును సర్ప
ణంబొనర్చి పెంచినా మలంచు.

అగుపగుపని వికృతముగా
నగఁ బ్రక్కనసిలిచి ఫలుఁడు నరపతి చూడన్
బిగువగు స్వీకృతాహంకృతి
నగునగుపని పడ్డుకొటికె నా రారాజన్.

వెలుగొందెడి వీరభూపతి
క్ష్వాపతి శిల్పియును "సత్యవాక్యము దేవా!
గోటను నెలకొంతయు కోరవ
విరూపుని కార్యగంబుఁ బొగడె విపులఘనతలన్.

వీరాగ్రణీరా విరూపుని
ధీరత కార్యగంబు శ్రీ విమానముఁ దెలుపన్
గోప తదీయ చరిత్రము
ప్రారంభమునుండి శిల్పి పలుకన్ దొడగన్.

"విముఁడిది పూర్తిగఁ దపము
వినవలసిన" దనుచుఁ బలికె విశ్వసనముగా నా
జనపతితో భులజనపతి
తన కార్యము తీరు దాఁకఁ దపప్రారంభించెన్.

తనవాక్యంతయు వేయక
గుడిఁ జొచ్చి విరూపయు పలుకఁ గూర్చాత్రఁకులై
కనుపాలికింపఁబడిరి
యుదిగట్టి విరూపుకాల నూడఁ బెరుకఁగన్.

మనిమాంసకేవల నెదిగిన యొడలిపై
మైనపుమున్నుల మలినతయును,
రాజభటత్వంబుఁ బ్రకటించుచుండెడి
యుమపయి త్రిషి ముద్రలును ధరించి,

బెదిరించుటకు నల్లె విదళించుటకుఁదగు
నాయుధంబులుపూని యాజ్ఞపత్రి-
మునునొక్క రొక్కరి ముఖములఁ జూచుచు
ముసిముసినవ్వుచు మోసమునకు

మెచ్చు చప్పుడప్పుడా కోరమీసములను
దువ్వుచును, గోరచూపులు దొంగచూపు
లును సిగుడ్చుచు నేతెంచి లోహవర్ణ
లడుగువెట్టిరి దేవాలయాంగణమున.

నిర్జనంబైన యచ్చోట నిలిచి కొంత
నలుగడలఁజూచి సద్దింతసలుపకుండ
పొంచుకొని పొంచుకొని పోయిపోయి వెదకి
వెదకి చూచిరి విరుపణ్ణ వెనుకనుండి

ఇదియె సరియని మదినెంచి యిరుగడలను
నొక్కరొక్కరు చని వాని నొడిసిపట్ట
వలెనటంచొక్క రొక్కరి వదనములను
జూచి సైగలుచేయుచు వేచివేచి.

వచ్చుచుండిరి యా విరూపాక్షుకడకు
నా మహావీరమూర్తి పద్మాసనమున
ధ్యానమగ్నుడును నిమీలితాక్షుఁడు నయి
యుండె నిశ్చలుఁడై మహాయోగమందు.

ఇరువురును దగ్గరికి వచ్చి విరుపబాహు
వులను బట్టిరి కఱకుఁజేతుల బిగించి
విశ్వపుఁడానందమగ్నుఁడు విభుని స్పర్శ
యొదవినటులైనఁ దా నిలుచుండె లేచి.

కనులు తెఱచి దివ్యకాంతులు గురియంగ
నిరుగడలనుఁజూచెఁ జిరునగవులు
చిందవారి, వారిచేతులు జారగా
ముగ్ధు లగుచు దవ్వుపోయి నిలువ.

"అన్నలార! యేల యరిగెద రిటురండు
చూరఁగొనుడు శిల్పసుందరతను
ఎంత పంచుకొన్న నితరులతో నంత
హెచ్చుఁగాని తగ్గదిది" యటంచు.

భ్రాతృప్రేమను జూపుచుఁ
బాతకులను జేయిపట్టి పండితుఁడు లన
న్నూతన బహువిధశిల్ప
వ్రాతాంచిత సరణులందు వరుసఁగొని చనన్.

రోఁకళులే చిగిర్చినటు లోహపు ముద్దలె మారి స్వర్ణపున్
రేకలు దీరినట్లు నడురేయిని దూర్పున లేఁత వెన్నెలల్
రేకులు విప్పినట్లు ప్రసరించిన రొంపిని నవ్యపంకజ
శ్రీ కులుకాడినట్లు ప్రసరించె నవానుభవంబు లాత్మలన్.

ఆ మహనీయుఁ డాత్మకిరణాళిఁ బవిత్రత బంచి పెట్టుచున్
బ్రేమరసానుభూతిని ద్రవింపఁగ జేయు చెడంద నద్భుత
శ్రీ మృదుదివ్యశిల్పములఁ జిత్రములన్ నవకాంతిఁ జూపుచున్
గోమలముల్గఁ జేసెఁ గడుక్రూరుల చిత్తములన్ క్షణంబునన్.

తలపెట్టంబడినట్టి ఘోరతరకృత్యంబెంచి నిర్వేదమున్
దలవంపుం భరియింపలేక తనపాదాల న్వెసన్ వ్రాలి య
శ్రుల దోఁగించుచుఁ "గావుకావు కరుణన్ ద్రోహాత్ములన్ మమ్ముఁ బా
పుల మన్నింపుము తండ్రి!" యంచు ధరపైఁ బోర్లాడు నవ్వారలన్.

చేతులారనెత్తి చేర్చి కౌఁగిట విరూ
పాక్షవిభుఁడు వారి భయము మాన్పి
పలికి ప్రియము, వారివాక్కులవలన నె
ఱింగె జరిగినట్టిరీతి నెల్ల.

"కడు పాపపుటాజ్ఞ ప్రభూ!
చెడిపోదురుగాక వారు చింపుఁడు దీనిన్
వడిగా" నని విరుపనితో
వడివడిగా ననిరి రాజభటు లట్లగునే ?.

ఎదుట నొకసారి యాజ్ఞకు బదులు సెప్ప
ననుట యూతగఁ గుటిలాత్ముఁ డాడెనింత
యాట, విభుమదిఁ జెఱచె, నీ యాజ్ఞకిపుడు
కడకుఁ ద్రోసిన సమ్రాట్టు మిడిసిపడడె?!

అపుడు ధర్మ మధర్మము నతనికంటి
కగపడునె? విరుపున్ ప్రజ నతఁడు శత్రు
వులని నమ్మఁడె! సంశయంబులకె తావా-
సంగ కా దుష్టుఁ డెగురఁడె చంకగొట్టి.

ఇంతకంటెఁ బ్రమాద మింకేమి గలదు ?
అట్టులని య య్యధర్మంపు టాజ్ఞఁ దీర్చి
ప్రభుని దన్నును నరకంపుఁ బథముఁజేర్చు
టొప్పునే వీరుఁ డటు సేయఁ డెప్పటికిని.

ఆజ్ఞఁ దీర్చిన నొక్కతప్పాజ్ఞఁ దీర్ప
కున్నచో నొక్కయాపద యొదవనుంట
ఇది పరిస్థితి దీనికి నెదురు నిలిచి
పేరవరుఁ డెట్లు నడచునే వెరవుతోడ ?

విష్ణుపదనిర్మలాత్ముఁడై వెలుగునతనిఁ
జెనకలే దింతయైన నా పెనుతుపాను
వీరమూర్తిత్వమునఁ దానె వెల్గునతఁడు
నావ రక్షించి దరిఁజేర్ప నడుముకట్టె.

సంకటములందు ఘోరసంశయములందు
సుజనులకు నొక్క దారిని జూపునట్టి
దైవ మట్ల వికారమా భావమందు
ధీరుఁడొక కొంతయోచించి దెలివితోడ.

త్యాగంబే కర్తవ్యము
గాఁగన్గొని నిర్ణయించి గాంభీర్యశ్రీ
యోగమహాతేజుండై
వ్రేగయి కనుపించె నపుడు వీక్షణములకున్.

తనకార్యంబును నిర్ణయించి యతఁడా స్థైర్యంబునన్ రాజరాజునకున్ లేఖను వ్రాసి యొక్కటిని, సంశుద్ధాత్ముఁడా రాజు నాజ్ఞను నా లేఖనుగూడ నా భటులతో సమ్రాట్టుకుంబంపె, వారును భక్తింగొని వేగవేగ చని రాలో శిల్పి, సమ్రాట్టుకున్.

పరమ పవిత్రుఁడౌ విరుపు భవ్య చరిత్రముఁజెప్పెఁబూర్తిగా
నరపతికిన్ వినన్వినఁగ నక్తమునందన మానసంబునన్
విరుపునిఁగూర్చి కల్గిన యనేకములౌ చెడుసంశయాలకున్
దొరక సదుత్తరంబు లవి తోడనె యాత్మ మథింపసాగఁగన్.

తుద కిటులనె శిల్పి "ప్రభూ!
విదితత్యాగైక ఘనుఁడు విరుపు" డటంచున్
బదపీఠి వ్రాలి లేఖను
వదనున కందించె విభున కట భృత్యుండున్.

ప్రక్క నిలుచున్న ఖలుఁడు తటుక్కుమంచు
నాల్కఁగొఱికికొనన్ ధరానాథుఁడపుడు
వివిధ భావంబు లాత్మలోఁ బెనఁగులాడ
విప్పె నా లేఖ నెల్లరు విస్మయపడ.

చదువుకొనందొడంగగనె సమ్ముఖమందున సుందరాత్ముడున్
మృదులవచస్కుఁడా విరుపమేదినినాథుడె పల్కుచుండెఁ దా
హృదయము నంటుచున్ "ప్రభు! యిదేటికి నీప్రజఁగూర్చి యింతగా
నెదొ యెదొ యెంచినారు దయయేలకొ చూపరు రాజభక్తుపై.

నిరపరాధిని నాపైన నిందమోపి
చెప్పియుండును దమ్ముండు చెప్పరాని
వెన్నొ యవియెల్ల నమ్ముటకన్న మొదట
నన్ను నొకసారి పిలిపించియున్నఁ గాదె?

కన్నులు పీఁకివేయుటకుగా వెడలించిన యాజ్ఞ ధర్మపుం
దెన్నకు దూరమైనదని తెల్ప ననుజ్ఞను గోరువాఁడ, ము
న్నెన్నఁడు లేదు, మీరలుమహీశ్వర! ధర్మపుమూర్తిపూర్తిగా
గన్నది యొప్పినట్టిదియుఁ గా దిదియంచుఁ దలంతు నామదిన్.

అయినను రాజముద్ర కలదైనను దీనిని దీర్పనెంచినం
బయిబయి ధర్మసంశయము బాధయొనర్చెడి నెంతయెంచినన్
రయమున దీని దీర్చునెడ నాకును మీకును బాపమంటు ని
శ్చయముగ నంచు దోఁచెడిని జాలను జేయఁగ నట్టికార్యమున్

ధనమునకు నాసపడి యా
జ్ఞను దీర్పగ వేగవేగ చనుదెంచిన త
మ్ముని భటుల చేతులాడక
వెనుదీసె నఘంబు నలుప వెసనయ్యెడినే?

ఆజ్ఞ నుల్లంఘనము చేసెనంచు నెంచ
కుండు మీరట్టు లెంచిన నొక్కపెట్ట
మీ మనస్సున నాయెడ మీ ప్రజయెడ
భ్రాత పొగరేపు ద్వేషాగ్ని భగ్గుమనదె?

అని తలపోసి దేవరకు నచ్చపుసత్యముఁ జూపి సుప్రజన్ ఘనమగు శిల్పకల్పకముఁ గల్పితవైరదవాగ్నినుండి కా వను మనయందరన్ నిరయబాధలఁబొందకయుండఁ జేయఁగా మనమున నెంచి కంటి నొకమార్గము నీశ్వరసత్కృపన్ ప్రభూ!

మమతయు నాశ సంగమును మాయకుఁబాయని పట్టుకొమ్మల త్యమలిన సత్యముం గనుల కన్యవిధంబుల జూపు, లోకపున్ శ్రమలను ద్వేషరోషపరుషత్వములన్నియు బుట్టుచోట్లు త్యా గమొకటె మాయ పాయువిధి కార్యము నయ్యదె నాకు నియ్యెడన్.

తమ్ముఁడుగోరె కన్నులనుద్యాగముసేసెదస్వామి! సుంతయున్ నెమ్మది బాధలేదు, తమ నేత్రయుగంబిఁకనైన సత్యపున్ తమ్మసిరూపసంపదను గాంచునటంచుఁ దలంతుఁ ద్యాగమే నమ్మితి నె[illegible]పున్ సుజననాయక! స్వార్థము గోరనెన్నడున్.

"సత్యముఁజూప, నీప్రజల సాధుత జూపఁగ గావ నెల్లరిన్ సత్యము ప్రాణముల్ విడువజాలుదుహాయిగ గన్నులెంత? యీ కృత్యముఁ జూపినాఁడ భవుఁ డియ్యెడ నా, కిదితీర్చి కన్నులా నిత్యుని కప్పగింతు ప్రభు! నేత్రము లిచ్చినవాని జేసుతన్.

అంతయుజూచి కన్నులు శమంతసవిస్ఫాకొనందొడంగె న
త్యంతము త్యాగతేజ మది స్వాంతమునే వెలిగించుచుండె వి
భ్రాంతుఁడు రాజరాజు పయిపై బలికెన్ దనయంతదా "సహో
యింతటిత్యాగమున్ సలుపునే విరుపణ్ణ" యటంచు వెంటనే.

"ఔను ప్రభూ" యని శిల్పియు
మానితవీరప్రభుండు మరిమరి పలుకన్
మానసమున లేఖార్థముఁ
దా నెరుఁగక కుటిలుడెంతొ తహతహలాడెన్.

తనకనులఁ దానె త్యాగము
నొనరింపఁగ నౌనె? యేమొ? ఓహో యిది యె
ల్లనువింతె యఘము నొనరిచి
తినొ యేమొ? యిఁకేది నాకు దెరువనుచు మదిన్.

పలురీతులఁ దహతహ పడి
పలికెను సమ్రాట్టు "రాత్రి ప్రజశిబిరముపైఁ
జలమున గుండ్లను ప్రేల్చుట
తెలుపవయా వీరి భక్తి దెలుపునొ లేదో!

అని యెకసక్కెముగా నన
విని వీరన చకితుఁడై వివేకముతో వెం
టనె తెలిసి గతము నెల్లను
జనపతితో నిట్లు వలికె సవినయరీతిన్.

మండలపతి తంత్రం బయి
యుంచుఁ బ్రభూ! ప్రజలెరుంగ రొకపాపంబున్
దండగులగు సైనికులే
గుండేటుల నిద్రితులను గొట్టిరి రేయిన్.

కడుగాయపడియు నొచ్చియు
నుడుగక స్థైర్యంబు తమకు నొప్పింపఁగ వె
న్నడుగిడిరి ప్రజలు వారలె
చెడ్డైరి యిదెల్లనేమొ చిత్రము స్వామీ!"

అని పలుక వెంటనే ఖల
జనపతి "యిది యెల్ల టక్కు జనులెక్కడ? ప్రే
టును దినుట యెక్కడదియే
జననాథా! సత్యమేని స్వామికి నెదుటన్.

మొఱయిడరె యింత కంతటి
స్థిరతన్ గొనవలయు వీరు చిక్కిడిచో నా
విరుపుని యంగడిలో నని
తెఁపియొసఁగ కాడె గుట్టు తెలిసినకతనన్.

అపుడు వీరవిభుండు సత్యమ్ముఁ దామె
చూడుఁడని పిల్చి ప్రజలను జోద్యముగను
విప్పి కట్లను జూపెను విభుఁడు భ్రాంతి
నొంద గాయంబు లన్నియు నొక్కసారి.

ఖలుఁ డాడె మోస మియ్యది
తెలియఁగ రాకున్న దనుచు దిక్కు తెలియకే
తలకోయఁ బోయి తాఁ దన
తలకే తెచ్చుకొనియుంట, దైవము లేదే!

విభుఁ డెగిరి పైకి లేచెను
సభయెల్లను లేచె నెల్ల జనులహృదయముల్
గుభిలు మన నొక్కపరి జన
విభుసింహము గర్జచేసె విదలుపుతోడన్.

క్రక్కుఁడు నిజమును లేదా
వ్రక్కలు సేయింతుఁ దలలఁ బ్రభు నాడింపన్
డక్కలుఁ డొక్కలునా?" యనఁ
జిక్కి ఖలునిబంటులెల్లఁ జెదరి భయమునన్.

గడగడవడకఁగ సాగిరి
కడుభయమున విప్రయుగము కాయములు ధరన్
బడ విభునకు సాష్టాంగము-
పడి గుట్టంతయును బయలుపఱచిరి వేగన్.

"మన్నింపుఁ డాశలంబడి
తెన్నువిడిచి దుష్టుఁజేరితిమి చెడుపను లె
న్నెన్నియొ చేసితి మా విరు
పణ్ణమహాత్మునకు ద్రోహు లైతిమి స్వామీ!

22)

తప్పుడు లెక్కలు వ్రాసిన
తప్పులు మన్నించి మమ్ము దయఁజూడు" డటంచు
చొప్పికొని రాత్మపాపము
"లెప్పటికిని దప్పుచేయ మింక"నని రటన్.

భగ్గుమని మండి ఖలునిన్
బ్రగ్గములం గట్టఁ డనియెఁ బ్రభుఁ డతఁ డేడీ,
కుగ్గి తనపాపకర్మం
బగ్గయి దహియింప స్రుగ్గి యల్లాడెఁ గడున్.

తలతలఁ గొట్టుకొనుచు మరి
పలుకఁగ వాయాడ కొక్కపరుగిడె విభుఁడున్,
దెలియక దిగ్భ్రమఁ జెంది, జ
నులెల్లరును నతనివెంట నుగ్గిరి వెలికిన్.

దేవళంబువైపు దేశాధిపతి పారె
నతనివెంటఁ బారి రన్యులెల్ల
బయలునేలఁ దిరిగెఁ బైమింటఁ బొద్దును
దైవ మెట్లు త్రిప్పఁ దాన మెరుఁగు.

చెప్పినయంతసేసిన వశీకృతచిత్తు నలోచనాస్యమం
దొప్పెడి త్యాగశాంతముల కోడి తటాలునవాని యంఘ్రులం
దప్పసిరాజు మస్తకము నానిచి వేడె క్షమాపణంబు బల్
చిప్పిలి రాలుబాష్పములు చిత్తపు వేడిమితీరఁ దెల్పఁగన్.

విరుపమహాత్ముఁడున్ దనపవిత్రకరంబుల రాజరాజు మే
నరయుచు శీతరక్త మొకయున్ గడుఁబ్రేమను లేవనెత్తి పే
రురమునఁజేర్చి నెల్లరు సహో యని దిగ్భ్రమఁజెంది
చూచుచున్
బరవశతన్ గనన్ మరియుఁబల్కఁగ నేమియులేకయుండఁగన్.

# 7. తీర్పు

కనులకు ముందు వెన్కలను గానఁగరాక ఖలుండు పారిపా
రినిలిచె నెట్టకేలకొక లింగముపైఁబడి మూర్ఛఁజెంది ని
ర్జనము ప్రదేశమయ్యది ప్రశాంతము, కొంచెమునేపు కెల్లఁ జ
ల్లని చిరుగాలి వీచె స్మృతిలాగె విహంగమకూజితమ్ములున్.
మేను చలింపఁగాఁ బొరలి మేదినినాథుఁడు గాంచె స్నిగ్ధమై
పైనను నాల్గువైపులను పందిరి కప్పిన కుంజమందుఁ దాఁ
గానఁగరాక యేరికి నొకండ ధరాస్థలి వ్రాలియుంట నిం
తేనిఁ జలింప కేదియును నెంచక యుండెడి జ్యోతిలింగమున్.

బిస్సున నివచ్చి యొకగాలి ఫెళఫెళమని,
ఫట్టుమని వచ్చి చెంపకుఁగొట్టె విరుప
విభుఁడు పఁపిన పత్రము భీతుఁ డగుచు
లేచి నలువైపులకుఁబోయి చూచె నతఁడు.

ఎవ్వరును గన్నులకుఁ గనిపింప లేదు
వెనుదిరిగి వచ్చి లింగపుఁ బీఠమందు
హత్తుకొనియున్న పత్రము నంది విప్పి
చదువసాగెను వికసితచక్షు వగుచు.

తమ్ముఁడు గోరెఁ గన్నులను ద్యాగ మొనర్చెద నన్న పల్కులన్
నెమ్మది నీరునీరగుచు నేత్రయుగంబునఁ బొంగిపొర్లి లిం
గమ్మవయింబడెన్ బ్రణయగాంగ జలంబున మున్గిపోయె నా
తమ్ముఁడు, త్యాగ తేజమునఁదాండవమాడెను వానిచేతమున్.

తెలివియొకింతపొంది తనతీరని పాపములెంచి భీతుఁడై
కలవరమంది వాడు వెనుకన్ దను మ్రింగఁగ వచ్చు భూతమున్
దెలిసి యిఁ కేమిసేయుటకు దిక్కెఱుంగక దీనరక్షకున్
దలఁచి తటాలునన్ దనయెదన్ గదియించెఁ దదీయలింగమున్.

స్థాణులింగమ్మునన్ వెల్గుశాంతి యతని
కొసఁగె శాంతిని, ద్యజియించి యూహలెల్ల
మనసు స్థిరముగఁజేసి భీతిని జయించి
వెనుదిరిగె దేవళమువైపు విభునిఁ జూడ.

స్వామికనులు మూసిన పాపిచిక్కెఁ
గట్టుఁ డీతని గొట్టుఁడు కరుణచూప
కనుచు రెక్కలు విఱిచి యాతనిని గట్టి
తిట్టుచును గొట్టుచును జనుల్ తెచ్చి త్రోయ.

"అన్నా!" యని పదములఁ బడి
కన్నీళ్ళన్ గడుగునతనిఁ గడువత్సలుఁడై
యన్నా! వచ్చితె యని విరు
పణ్ణ మహాత్ముండు లేపి యక్కునఁ జేర్చెన్.

కరుణామయుఁ డీతం డని
శరణాగతరక్షకుఁ డని సంసారమహా
దురితాంధలోకమునకే
యరుదగు నేత్ర ప్రదాత యని పొగడిరటన్.

అన్నయిచ్చిన క్రొత్తకన్నుల దేవాల
    యం బెల్లఁ జూచుచు నబ్బురపడి
శిలలఁ జెక్కిన బహుశిల్పంబులం గని
    హర్షసాగర మగ్నుఁ డయ్యె నతఁడు
పావిత్ర్య సౌందర్య బహురూప భంగుల
    దీప్తుల రారాజు తేలియాడె
దైవ మాడించిన యీవిచిత్రపునాట
    కమ్మన నట్టులే కనుచునుండె
వీరవిభుడు శిల్పవిభవంబు నాశిల్పి
శిల్పపూర్ణతకయి చేయుచున్న
యత్న మెట్లు దైవయత్న మాయతమున
నెటకువచ్చెఁ జిత్ర మిది యటంచు.

విరువునికంటిగుర్తులు స్రవించిన రక్తపుధార లొప్పఁగా
స్థిరముగ నిల్చిపోయిన విచిత్రపుశిల్పముఁ జూచు చట్టులే
యరయుచునుండెనాత్మఁ బరమార్థము శిల్పమునందునెల్లదా
నరసి కనుంగొనెన్ దుదకుఁ దాౣగమెయంచు ననంతవీథులన్.

అద్వయ మనంత మవికార మమలమునగు
నానెలుంగున నా విరూపాక్షు నాత్మ
యచల మయి నిల్చి యానంద మల్లె గ్రోల
నతని కబ్బె జీవన్ముక్తి యమృత పదము.

అమృతపదమును సాధింపఁ ద్యాగమొకటె
త్యాగ మొక్కటె యొక్కటే త్యాగ మనుచు
సమరసందేశమును జాటు సత్తు లనుచు
సక్షి శిల్పంబు దీపించె సమరశిల్పి.

అజ్ఞతను మాన్ప జ్ఞానంపు టక్షిఁ దెరువఁ
ద్యాగ మొక్కటె యొక్కటే త్యాగమనుచు
సమరసందేశమును జాటు సత్తు లనుచు
సక్షిశిల్పంబు దీపించె సమరశిల్పి.

ఆర్ప ద్వేషాగ్ని శ్రీలను సందతికిని
సందఁజేయంగ నొక్కటే త్యాగ మనుచు
సమరసందేశమును జాటు సత్తు లనుచు
సక్షిశిల్పంబు దీపించె సమరశిల్పి.


శిల్పసందేశముల కెల్లఁ జిట్టచివర
సమరు సందేశ మొక్కటె త్యాగ మనుచు
సమరసందేశమును జాటుసత్తు లనుచు
సక్షిశిల్పంబు దీపించె సమరశిల్పి.

పరమశాంతికి సోపానపంక్తులవలె
నున్న యర్చకులైన విప్రోత్తము లిడు
స్వాదుహరిహరదేవప్రసాదములను
బడసి సంప్రీతు లై రెల్లవారు నపుడు.


మరలఁ బ్రజలసేవన్ మాన్యవీరక్షితీశున్
దొరయుఁ బ్రజలుఁదమ్ముండున్ నియోగింపఁ బ్రేమన్
వరదభరతవాణిన్ బల్కె నాత్యాగరాజున్
ధరసురతరు వాతన్ ద్యాగసంవర్ధితశ్రీ.

శ్రీమహాలక్ష్మి చరణారవిందార్పణ మస్తు.

ఓమ్ స్వస్తి.



జగతః పితరౌ వందే



పార్వతీ పరమేశ్వరౌ. లేపాక్షి శిల్పము

# మహాత్యాగి విరుపణ్ణ

(గద్యము)

రచన :

అష్టావధాని, విద్వాన్
పమిడికాల్వ చెంచుసుబ్బయ్య, బి. ఓ. ఎల్.
ఆంధ్రోపన్యాసకులు, ప్రాచ్యకళాశాల, లేపాక్షి.

—o—

మూలము :

## త్యాగశిల్పము

(శ్రీ లంకా కృష్ణమూర్తిగారు)

బెంగుళూరు

22).



శ్రీ వీరణ్ణ విరుపణ్ణలు
లేపాక్షి వర్ణచిత్రము

# మహాత్యాగి విరుపణ్ణ

## 1. తూర్పు

శ్రీలకు నిలయమై, ఈశ్వరభక్తి, సౌభ్రాతృత్వము మొదలగు సుగుణములకు ఆలవాలమై, కళలకు పుట్టినిల్లయి, లేపాక్షి పట్టణము మిగుల ప్రసిద్ధమైనది. ఈ పురమునకు ప్రక్కన 'కచ్ఛపాద్రి' అను పర్వతమున్నది. అందు శివుడు "పాపనాశేశ్వరుడు" అను పేరుతో వెలసి యున్నాడు. స్కాందపురాణమున "లేపాక్ష్యాం పాపనాశనః" అని దీని ప్రశస్తి కలదు. ఈ శివలింగమును అగస్త్యమహర్షి ప్రతిష్ఠించె నని ప్రతీతి. ఈ కొండపైననే శ్రీరాముడు, హనుమంతుడు ప్రతిష్ఠించిన శివలింగములు, "రామ లింగ", "హనుమ లింగ"ము లను పేరుతో నున్నవి.

పూర్వము సీతను గొనిపోవుచున్న రావణునితో పోరాడి ఇచ్చట పడియున్న జటాయువును గాంచి, శ్రీరాముడు, "లే పక్షి!" అనెనట! దానికి అనుగుణముగ ఈ ప్రదేశమును ప్రజలు "లే పక్షి", "లేపాక్షి" అని పిలువసాగిరని పెద్దలందురు. మధురలో మీనాక్షి, కంచిలో కామాక్షి, కాశిలో విశాలాక్షి ప్రసిద్ధమైనట్లే, లేపాక్షిలో "లేపాక్షి" అను దేవి కలదని ప్రతీతి. నూట యెనిమిది దివ్యతిరుపతులలో

లేపాక్షి గూడ చేరుననుటకు గుర్తుగా— ఇప్పటికిని ఇచ్చట "శ్రీ తిరుమల దేవర" ఆలయమున్నది.

విజయనగర సామ్రాజ్యము తన విజయ కీర్తులను అన్ని దిశల వ్యాపింపజేసిన రోజులలో, ఈ లేపాక్షి పాడి పంటలతో, ధనధాన్యములతో, గుళ్ళు గోపురాలతో, కోట పేటలతో విరాజిల్లు చుండెను. అచ్చటి ప్రజలు ధర్మనిర తులు, సత్యవచనులు. వారి జీవనము సాత్త్వికమైనది. రాళ్ళ నెత్తుట, చెక్కుట, గుళ్ళు గోపురములు నిర్మించుట, కోటలు కట్టుట, చెరువులు త్రవ్వుట- ఇవి వారి మామూలు పనులు. వారు కళాహృదయులు. ఇంతయేల? అచ్చటి గొల్లవాడు గూడ శిల్పకళకు వెల కట్టగల దిట్ట. కులవృత్తులకు ఆనాటి గ్రామములు పుట్టినిండ్లు. వారి వారి కులధర్మములను చక్కగ నిర్వర్తించుట చేతనే వారికి భుక్తిముక్తులు సులువుగా లభించుచుండినవి. వారు మనవలె గాలిమేడలను కట్టక, దివ్య దేవాలయములను నిర్మించిరి.

ఆనాడు విజయనగర సామ్రాజ్యమున పెనుగొండ మండలము. (నేడు తాలూకా) ఆ పెనుగొండ జిల్లాలోనిది ఈ లేపాక్షి. పెనుగొండలో విజయనగర రాజుకు ప్రీతిపాత్రు డయిన "నంది లక్కి-సెట్టి" అను నతడు కోశాధికారిగా నుండెను. అతని భార్య "ముద్దమాంబ". ఈ పుణ్యదంపతు లకు దివ్య సంతానముగా "విరుపణ్ణ"- "వీరణ్ణ" అను ఇద్దరు

కుమారులు జనించిరి. వీరిలో పెద్దవాడగు విరుపణ్ణ పువ్వు పుట్టగనే పరిమళించునట్లు బాల్యము నుండియు అందరి అభిమానమునకు పాత్రుడయ్యెను. శ్రీరామునికి లక్ష్మణుని వలె అన్ని విధముల తమ్ముడగు వీరణ్ణ- అన్నయగు విరుపణ్ణను పోలియుండెను. వీరి సోదరత్వము ఆదర్శప్రాయమైనది. విరుపణ్ణ కన్నులలో దివ్యతేజస్సు మూర్తీభవించి యుండెను. ఇక తమ్ముని మాట చెప్పనేల? వారు వీరశైవులు. వారి ఇలువేల్పు శ్రీ వీరభద్రుడు. ఈ సోదరులు నూనూగు మీసాల నూత్న యౌవనమందే ప్రజారక్షణకై విశేషముగ సంపదలు సంపాదించిరి. ఈ సోదరులు తమ తండ్రివలెనే సత్ప్రవర్తనముచే రాజానుగ్రహమునకు పాత్రులయిరి. వీరిరువురు వీరభద్ర కుమారస్వాముల వలె యుద్ధవీరులై, శత్రువులను జయించి, రాజు మెప్పునొందిరి. వీరి వీరవిజయములకు గుర్తుగా రాజు వీరికి పెనుగొండ మండలాధిపత్యము నిచ్చి గౌరవించెను.

ఈ సోదరుల పరిపాలనము ధర్మవంతమగుటచే ప్రజలెల్లరు మిగుల ఆనందించిరి. వీరు వీరశైవు లగుటచే తాము సంపాదించిన సంపదసంతయు ఆ శివునికే సమర్పింప దాచియుంచిరి. ఇందుకై వారు పరుల ధనము నేమాత్రము గోరరైరి. వారు బావులు త్రవ్వించి, చెరువులు కట్టించి, వ్యవసాయాభివృద్ధి గావించిరి. సంతల నేర్పాటు చేసి వర్తక సంఘముల నెలకొల్పిరి. తాము చేయుటేగాక, రాజు చేతను, ప్రజల చేతను విరివిగా సత్కార్యములను చేయించిరి. వారు

"గోరవనహళ్ళి" వద్ద మహాలక్ష్మి గుడిని నిర్మించి, లేపాక్షి లోని ఆదివారపు సంతకుతోడు శుక్రవారపు సంతను జరిపించిరి. ఆ దేవీ సేవకై ఎన్నో మడిమాన్యములు సంపాదించి యిచ్చిరి. అచ్చట "నవ తుంగభద్ర" అను కాలువను త్రవ్వించి ప్రజాసేవ గావించిరి.

విరుపణ్ణకు బాల్యమునుండియు శిల్పమన్నచో మక్కువ మెక్కువ. రమ్యమైన శిల్పమును చూచినచో అతడు తన్మయుడగును. వీరణ్ణకు చిత్రము లన్నచో మరింత మక్కువ. ఇరువురును కళాహృదయులే! కనుకనే పెక్కుచోట్ల నున్న బహువిధ శిల్పములను చూడ దలచి ఆ సోదరులు ప్రయాణమయిరి. వారు విద్యానగర, చాళుక్య, ఆంధ్ర, పల్లవ, హొయసల శిల్పకళలను గాంచి, తన్మయులగుచు, ఆయా శిల్ప భేదములను గుర్తించుచు, పెక్కండ్ర శిల్పుల గాథలను తెలిసికొనిరి. అందు 'జకణాచారి'- అతని కుమారుడు 'డకణాచారి'యను శిల్పుల విశేషములను విని మిగుల ఆశ్చర్యపడిరి. జకణాచారికి "దాసోజు" డనియు, డకణాచారికి "చావణు" డనియు పేర్లు. ఈ శిల్పులచే బేలూరున కేశవదేవాలయమును నిర్మింపజేసిన విష్ణువర్ధనుని ప్రయత్నములను గాంచి, మెచ్చిన వారై, తాము పట్టి పనులను సాధింప నెంచిరి.

నాటినుండి విరుపణ్ణ హృదయము శిల్పకళా భావనా పూరిత మైనది. రాగా ఆ సోదరులు తమ దాచిన ధనము సంతయు వెచ్చించి, దేవాలయములను నిర్మించి, శివవిష్ణు

వీరభద్రులను సేవింప నిర్ణయించిరి. ఇందుకై వారు తమ దేశములో నున్న శిల్పుల నందరిని రప్పించి, వారికి తగిన సౌకర్యములతో ప్రోత్సాహము నిచ్చి, వారి ప్రతిభను వ్యాపింపజేసిరి. అప్పుడప్పుడు శిల్పులతో సభలు చేయించి, కళాప్రదర్శనలు గావించి, వారికి బహుమతుల నిచ్చుచుండిరి. ఆ సభలలో ప్రతిభావంతులయిన శిల్పులను పరీక్షించి, ఎన్నుకొనిరి. వారికి నాయకుడుగ నుండదగిన మహాశిల్పి లభించుటకై వేచియుండిరి.

## 2. కూర్పు

ఇట్లుండ నొకనాడు విరుపణ్ణ ఒకడే ఏదో రాజకార్యముపై లేపాక్షికి వచ్చి, అందే ప్రజాభిమానమును చూరగొని, కొన్ని రోజులు ఉండెను. ఆనాడు పూర్ణిమ. సోమవారము. విరుపణ్ణ తన రాజకార్యము లన్నియు త్వరగా ముగించి, సాయం సంధ్యావేళ చెంతనున్న 'కచ్ఛపాద్రి'కి పోయి, అచ్చట నున్న శ్రీ పాపనాశేశ్వరుని, రామలింగ హనుమలింగములను భక్తిశ్రద్ధలతో పూజించెను. పిమ్మట అతడు ఒక పెద్ద రాతితిన్నెపై కూర్చుండి, పున్నమ చందమామకై చూచుచుండెను. ఇంతలో చంద్రోదయమయ్యెను. ఆ సంధ్యాకాంతుల ఎఱ్ఱదనమున దిక్కులు కెంపెక్కియున్నవి. అట్టి సమయమున అతనికి అల్లంత దూరమున ఎవ్వరో ఒక క్రొత్తవ్యక్తి కన్పించెను. విరుపణ్ణ విప్పారిన కన్నులతో ఆ వ్యక్తినే చూచుచు, అతడెవ్వడా అని యోచించుచుండెను.

ఆ వచ్చుచున్న వ్యక్తి దేవతాసమానమూర్తి. అచట నున్న శిలల నన్నింటిని చక్కగా పరికించుచు, వచ్చు చుండెను. అతని తీరును జూచినంతనె విరుపణ్ణ హృదయమున ఆశాలత చిగురించెను. ఆ యువకుడు అల్లే వచ్చి, విరుపణ్ణ కూర్చొనియున్న శిలను జేరి, విరుపణ్ణను తదేక దృష్టితో చూడసాగెను. విరుపణ్ణయు నతని నట్లే చూచెను. ఇట్లు నిమిషమాత్రము వారు అనిమిషులై ఒకరి నొకరు చూచు చుండ, వారి హృదయములలో ప్రేమామృతము తొణికిస లాడెను. అంతట వా రిరువురిలో నేమి తోచినదో! ముం దె వరు చేయి సాచిరోగాని, పరస్పరము కౌగిటలో జేరిరి. పూర్వపరిచయము లేకున్నను, జన్మాంతర స్నేహానుబంధ ముచే, తొలిచూపులోనే వా రిరువురు ప్రియమిత్రు లయిరి. చంద్రకాంతులతోబాటు వీరి స్నేహకాంతియు క్రమ క్రమ ముగ వృద్ధియై పండువెన్నెల కాయజొచ్చినది.

ఆ నిండు వెన్నెలలో ఆ వచ్చిన వ్యక్తి విరుపణ్ణతో "మహాశయా! నేను శ్రీ విశ్వేశ్వరుని దయచే ప్రతిభాశాలి నైతిని. కళారాధనమే నా జీవితలక్ష్యము. శిల్పమే నా తపస్సు. కళాసాధనలే నాకు రక్షణ. రమ్యమైన భావాలకు రూపమునిచ్చి, జీవకళనుగూర్చి, శిల్పమును నిర్మింతును. ఒక్కొక్కప్పుడు ఉత్సాహముతో ఆడుదును, పాడుదును. ఎన్నియో మహనీయ సుందర శిల్పములను చెక్కితిని. ప్రకృతిలో నా ఉలికి లొంగని వస్తువులేదు. కనుక నన్ను

రాజు, ప్రజలు మెచ్చిరి. రాజు నాకు మాన్యములిచ్చి, రాష్ట్రమున నన్ను ప్రధానశిల్పిని గావించెను. కాని ఆ రాజు నా శిల్పవిద్యా కౌశలమును చూడడు. నాచే శిల్పములు మలిపింపడు. మంత్రితోఁగూడి యెల్లప్పుడు కుతంత్రాలతో ప్రొద్దుపుచ్చుచు, ధనమునంతయు వానికే వెచ్చించును.

అచ్చట నెందరినో శిల్పులను తీర్చిదిద్దితిని. వారెల్లరు దివ్యశిల్ప నిర్మాణ దక్షులైరి. మహాశిల్పముగల నిర్మాణము నొకటి గావింపవలయునని నా తలంపు. ఇందుకై ఆ రాజునొద్ద యెన్ని దినములు వేచియున్నను ఒకింతయైనను చేయూత లభింపదాయెను. కనుక చింతాక్రాంతుడనై సుఖాలకు స్వస్తిచెప్పి, మరెచ్చటనైనను నా కోర్కెను తీర్చుకోదలచి, యిచ్చటికి వచ్చితిని. పుణ్యాత్మా! తేజోవంతములగు నీ కందోయిలో నా మనోరథము తప్పక సిద్ధించునను ఆశారేఖ కన్పించుచున్నది. మరి విధి ఎట్లున్నదో!

ఇది శుభసమయ మని నా తలంపు. చంద్రకాంతికి ఇచ్చటి శిలలెల్ల ద్రవించుచున్నట్లున్నవి. శిల్పమునకు తగిన రాయి ఇట నెంతైన కలదు. ఒకే స్థలమున నెన్నియో దేవాలయములు నిర్మింపవచ్చును. కోరిక, శ్రద్ధ, కళాసక్తి, శిల్పుల సహకారము, ధనము, రాజుచేయూత, ప్రజాదరణ కల్గినచో కళ లెంతైనా ప్రకాశించును. నేను "డకణాచారి" వంశమున పుట్టినవాడను. నీవైనను నా ఉలికి పని కల్పించి, కీర్తి గాంచుము" అనెను.

ఈ వాక్యామృతమును గ్రోలిన విరుపణ్ణ హృదయము ఆనందమున పొంగులువారెను. ఆనందాశ్రువులు స్రవింపగా విరుపణ్ణ ఆ శిల్పితో "ఓ శిల్పివర్యా! అమృతమయమైన కళ నీకు అబ్బినది. నీ జన్మధన్యము. నీ ఆశయము పవిత్రము. నిన్నుగాంచి నేను ధన్యుడనైతిని. నా రాజ్యమును ధన్యమయ్యెను. ఆహా! నేటికి నా కలలు నిజమైనవి. నేను పెనుగొండ మండలాధీశుడను. నా హృదయము కళార్ద్రము. నీవు ఆశించిన దివ్యశిల్ప నిర్మాణమునకు, నే నింతకుముందే అంకురార్పణ గావించియున్నాను. సమస్తము నీ హస్తంగతము. ఇక నీవు చింతింపకుము.

నేను, నా తమ్ముడగు వీరణ్ణయు ఇన్నాళ్ళుగా గడించిన ధనమునంతయు శివారాధనకై భద్రపరచియున్నాము. దానిని ఈ పవిత్రకళకై వెల్వరింతును. ఆ ధనమును నీవు సార్థకము చేయుము. ఈ మన సత్ సంకల్పమునకు ప్రజా సహకారమును తప్పక లభించును. శిల్పులెల్లరు నీకు తోడ్పడగలరు. ఇదిగో! ఇదియే పావనమైన "కూర్మాద్రి." ఇందు మూడు శివలింగములు గలవు. ఇవి చాల ప్రశస్తమైనవి. ఇచటనే సకలసంపదలతో విలసిల్లు "లేపాక్షి" పురమున్నది. మన ఆశయ సిద్ధికి ఏ కొదవయు లేదు. ఓ శిల్పకళాసార్వభౌమా! ఈ చంద్రకిరణములలోని అమృతధారలతో నిన్నిప్పుడే ఇచ్చటనే శ్రీకళారాజ్యపట్టాభిషిక్తుని చేయుచున్నాను. దిక్కులే ఇందులకు సాక్షి. నా హృదయమును,

ధనమును, ప్రజలను, సమస్తమును నీ శిల్పకళకై శివప్రీతిగా కానుక ఇచ్చితిని. ఇక ఆ కళాప్రపూర్ణుడైనశివునిసేవకులమగు మమ్ము ఏలుకొనుము." అనెను. ఇరువురును ఆ పరాత్పరుని యందే మనస్సును నిల్పి, కొంతసేపు సమాధినిష్ఠులైరి.

కొంతిసేపటికి కనులు దెరచిరి. వారికే లోకమంతయు కనుదెరచి నట్లాయెను. పిదప ఇరువురు పురము చేరిరి. శిల్పి 'కూర్మగిరి'పై నున్న శిలల నన్నిటిని చక్కగ పరిశీలించెను. నిర్మాణక్రమమునంతయు మనస్సున ఏర్పరచుకొనెను. ఎందరో శిల్పులు అతనికి తోడ్పడ నేతెంచిరి. దాచియుంచిన ధనమంతయు శిల్పకళకై కదలసాగినది. అంతట విరుపణ్ణ రాజ్యకార్యము లన్నిటిని తమ్మునికి అప్పగించి, తాను శిల్ప కళారాధనకై ఆ కూర్మశైలమందే నివసింపసాగెను. ఈ శుభవార్త దేశము నల్గడల వ్యాపించెను.ఎల్లరు సంతసించిరి. ప్రజలనుండి విశేషముగ సహాయము చేకూరెను. అంతట ఒక శుభముహూర్తమున శంకుస్థాపన గావింపబడెను.

లేపాక్షి సమీపమందలి ఆ కూర్మగిరిపై ఒకవైపు పాపనాశేశ్వర లింగము, మరోవైపు రామలింగ హనుమ లింగము లున్న మధ్యభాగమున, విరుపణ్ణ ఇలువేల్పగు శ్రీ వీరభద్రస్వామి దేవాలయమును, దానికి ఈశాన్య ముగ పాపనాశేశ్వరుని ఆలయమును, ఆయన ప్రక్కన శ్రీ గౌరి ఆలయమును, పాపనాశునికి ఎదురుగా శ్రీ మహా విష్ణువు ఆలయమును, మరోవైపు వీరభద్రుని భార్యయగు

భద్రకాళి దేవళమును నిర్మింప నిర్ణయించిరి. ఈ దేవళము లన్నియు చేరి, ఒకచోట నుండునట్లు ఒక పెద్ద భవనమును గట్టి, అందలి స్తంభములలో దుర్గ మొదలగు దేవతా మూర్తులను స్థాపింపదలచిరి. ఆ భవనమందే పంచలోహ ముల ఉత్సవ విగ్రహము లుంచుటకై ఒక పాతరయును, శివుని శయనమందిరమును రహస్యముగ నిర్మింపనెంచిరి.

ఉత్తర ద్వారముగల ఆ భవనమునకు ముందు భాగ మున పెద్ద రంగమంటపమును గట్టదలచిరి. ఆ రంగ మంటప మునకు ఒక మహాద్వారమును, అచ్చటనుండి ఒక పెద్ద ప్రాకారమును, ఆ ప్రాకారమధ్యమున ఒక కల్యాణమంటప మును నిర్మింపదలచిరి. వీనినన్నిటిని చుట్టివచ్చునట్లు ఒక భద్రమైన ప్రాకారమును గట్టి, దానికి మూడు ద్వారముల నుంచదలచిరి. దర్శనార్థమై వచ్చెడి భక్తుల వసతికి తగినట్లు మంటపములు, సోమవారమంటపమును ప్రహరిలోపల నిర్మింపదలచిరి. కూర్మగిరి దిగువనున్న లేపాక్షిపురముదాక ఇట్లే వరుసగా ప్రాకారములు, వాని లోపలి భాగమున మంటపములుగట్టి, తగిన సౌకర్యములు కూర్పదలచిరి. ఈ నిర్మాణక్రమమున ఆ మహాశిల్పి, అందరి అనుమతినొంది, తగిన శిల్పులను ఆయా నిర్మాణములందుంచి, సలహాల నిచ్చెను.

ఔరా! ఎందరు శిల్పులు!? ఎందరు కూలీలు ?! ఎంత ధాన్యము ?! ఎంత ధనము ?! ఆ భక్తి విశేషమును ఏమన

వచ్చును!? శిలలు శిల్పములైనవి. శిల్పము దేవాలయమై నది. వారు సంకల్పించిన రీతిగా పనులు నెరవేరసాగినవి. మహాశిల్పియు స్వయముగా నెన్నియో శిల్పములను నిర్మించెను. ఆలయ నిర్మాణ మంతయు దివ్యశిల్పములతో శోభిల్లినది. శిలలే శిల్పులకు అపరంజి బంగార మయ్యెను. అంతేగాదు— అనేక దివ్యభావాలకు రూపమై, సత్యశకు శక్తి అయ్యెను. దేవాలయము మొదలుకొని లేపాక్షి వరకు గల అన్ని ప్రాకారములలో, మంటపములలో చక్కగ మలచి, శిల్పములేని మొండిరాయి ఒక్కటియు లేదు. గోడలలో గార మచ్చునకైనను లేదు. అన్నియు పెద్దరాతి దిమ్మలతోనే నిర్మితములు. ప్రతి స్తంభము శిల్పకళాశోభితమే. ఇట్లు ఉన్నత పీఠములు, గోడలు, పైకప్పులు గోపురములు గల పెక్కు శాలలను, మంటపములను, గుళ్ళను నిర్మించిరి.

మంటపములలో నెచ్చట చూచినను శిల్పమే గోచరించును. చుంచులు కనుచూపు మేరవరకు కప్పినారు. చుంచుల అంచులలో రంధ్రములు తొలిచిన తీరు ఆశ్చర్యకరము. మెట్ల అంచులలో నెన్నియో ముగ్గులు, తీగలు వివిధ రేఖలలో నిర్మించిరి. నూర్లకొలది స్తంభములను తీర్చి దిద్దినను తృప్తికానక, ఒక్కొక్క స్తంభముననే ఎన్నో ముఖములు, ఒక్కొక్క ముఖమునను ఎన్నో శిల్పములు కూర్చిరి. ఒకశిల్పమునకు మరో శిల్పమునను పోలికలు లేవు. స్తంభాలపై

సూర్యచంద్రులు మొదలు సమస్తజీవకోటియు రూపొందినది. సృష్టికి ప్రతిబింబమా అనునొప్పు ఆ స్తంభాలు శిల్పుల ప్రతిభకు మూలస్తంభాలు. విజయనగర రాజుల గజపతిత్వము నకు నిదర్శనము కాబోలు! మహాద్వారముల ప్రక్కలను, ధ్వజపీఠము చుట్టును ఏనుగుల వరుసల తీర్చినారు. మహాద్వారపు చౌకట్లపై లతామండల మధ్యమున నాట్యము చేయు నటీబృందముల భంగిమ లెన్నియో కనుల పండుగగా చిత్రించిరి. ఈ దృశ్యములు అత్యంత హృద్యములు.

సకల జన మనోహరములగు శిల్పములతో నొప్పు రంగ మంటపమును నిర్మించి, ఆ శిల్పులు పొందిన ఆనందము నకు మేరలేదు. రంగ మంటప పీఠము చుట్టును పలురకము లైన శిల్పములను తీర్చిరి. రంగ మంటప మధ్యభాగమున వలయాకారముగ స్తంభములను నిల్పి, వానిపై మనుష్య ప్రమాణములుగల దేవతామూర్తులను నెన్నిటినో మలచిరి. మంటపమున తూర్పున రెండవ వరుసలో ఈశాన్య దిక్కున ఆకాశ స్తంభము నొక దానిని నిల్పిరి. అది నేల తాకదు. క్రింద వస్త్రమును వేసి, తీయవచ్చును. పైన బిగింపు కానరాదు. ఏమి ఆశ్చర్యము! మధ్యభాగ మందలి స్తంభాలలో అప్సరసలు, యక్షులు, దేవతలు నాట్యమాడుచు, పాడుచు, తాళయుక్తముగ వాద్యములను వాయించు చున్నారు. ఆ మూర్తుల ముఖములలోని హావభావములు, వారు దాల్చిన శృంగార భూషణములు, వారున్న నాట్య భంగిమలు కడు రమ్యములు. భిక్షాటనేశ్వరుని శిల్పమున

శిల్పి మోహావశుడై కొంత వచ్చి శృంగారమును ప్రదర్శించి నాడు. మధ్యభాగమున పైన బోర్లించిన పెద్ద తామరపువ్వును నిర్మించిన తీరు మహాశ్చర్యము !

గర్భాలయమునగల స్తంభాలలో నెన్నియో శిల్పము లను తీర్చిరి. అందు వాయువ్య దిశలో ఒకే స్తంభమున జగన్మాతా పితలైన శ్రీ దుర్గా చంద్రమౌళీశ్వరులను తీర్చిరి. (ఈ దుర్గకే నేను విశేషముగ పూజలు జరుగు చున్నవి) ఈశాన్యమున ఒకే స్తంభమున సౌందర్య నిధులన దగు పద్మినిజాతి స్త్రీని, పాంచాలజాతి పురుషుని తీర్చిన తీరు మనోహరము. (ఈ పురుషునే వాస్తు పురుషుడందురు) (వాకిలి కెదురుగా) విరుపణ్ణ ఇలువేల్పయిన శ్రీ వీరభద్రుని ప్రక్కన భద్రకాళిని, రఘునాథస్వామిని, గౌరిని స్థాపించి, దేవాలయాలు నిర్మించిరి. ఆలయమునకు వెలుపల తూర్పున సిరియాళు చరిత్రను, పడమట కిరాతార్జునీయ వృత్తాంత మును అతి మనోహరముగా చిత్రించినారు. చవితి గణపతిని సీతమ్మ తూగుటుయ్యాల మంటపమును, నీటిదొనను, (లేపాక్షి బసవన్నకు ఎదురుగా నుండునట్లు) ఏడు తలల నాగుపామును, (సప్త ఫణి), శివలింగమును, శ్రీకాళహస్తి కన్నప్పల చరిత్రను, సప్తమాతృకలను- ఎన్నింటినో నిర్మిం చిరి. ఇట్లు ఆ శిల్పుల శిల్పకళాసృష్టి సకల జనాహ్లాదకరమై ఒప్పారెను.

ఎంతో కాలము ఈ శిల్ప నిర్మాణము జరుగు

చున్నను, విరుపణ్ణ తదేక దృష్టితో చూచుచుండెనేగాని తృప్తి నొంద దయ్యెను. మరి యీ నిర్మాణము ఎప్పుడు పూర్తి యగునో! ఎవ్వరికిని తెలియదు. అచ్చట పెనుగొండలో వీరణ్ణ ధర్మయుక్తముగ రాజ్యమును పాలించుచు, విరుపణ్ణలేని కొరతను తీర్చుచుండెను. తాము మునుపు దాచిన ధనమును, తాను చేర్చుచుండిన ధనమును అన్నగారి ఆజ్ఞ మేరకు దేవతాభక్తి గలవాడై వీరణ్ణ లేపాక్షికి చేర్చుచుండెను. పైగా కళాభిరుచితో, ఎందరో చిత్రకళాకారులను ఎంతో ధనమిచ్చి పిలిపించి, శిల్పముల మధ్య చిత్ర రచన చేయుటకై విరుపణ్ణ కడకు పంపుచుండెను.

ఎచ్చెచ్చట నేయే దేవతను స్థాపింపవలెనో అట్లట్లు శాస్త్రోక్తముగా ప్రతిష్ఠలు గావించి, వారికి నిత్య పూజాదికములకై తగిన ఏర్పాట్లు గావించిరి. ఈ దేవతల సేవకై విరుపణ్ణ స్వయముగ ఎన్నో భూములను కొని, ఆలయమున కర్పించెను. ఇతనిని చూచి, ఇతరులును పెక్కు భూముల నిచ్చిరి. ఇతని త్యాగకీర్తి ఆ చంద్రార్కమైనది. ఇంత జరిగినను ఆలయ నిర్మాణ మింకను పూర్తి కాలేదు. ఉన్న ధనమంతయు 'ఖర్చు' అయినది. మరి ఈ కళాదృష్ట మెట్లున్నదో !!

అచ్చట విజయనగరమున వృద్ధరాజు మరణించెను. అతని వారసుడుగా ఒక బాలుడు రాజయ్యెను. దీని నాధారముగా గొని శత్రురాజులు చెలరేగిరి. కుట్రలు, మోసములు

తలలెత్తసాగినవి. శిల్పులు మాత్రము తమ పనిని పట్టుదలతో చేయుచునేయుండిరి. విరుపణ్ణయు సాహసియై, ధనవంతుల ఆదరణ నొంది, ధనము గడించి, ఏదో విధముగ ఆలయ నిర్మాణము గావించుచునేయుండెను. విరుపణ్ణ, అతని ప్రాణమిత్రము మహాశిల్పియు- ఇరువురును తమ కార్యదీక్షను విడువరైరి. ఇక కల్యాణ మంటపము మాత్రము మిగిలి యున్నది. పని కొంత మెల్లగా సాగుచున్నది. కాలము తార్మారైనది. ధనమునకు చాల ఇక్కట్లు ఏర్పడినది. జీవనము గడచుట కష్టముకాగా, చాలమంది శిల్పులు లేపాక్షి విడిచిపోయిరి. కాని మిగిలిన శిల్పులు, విరుపణ్ణయు ఎట్లో కాలము గడపుచు, దైవకార్యమును యథాశక్తిగ కొనసాగించుచునే యుండిరి.

## 3. మార్పు

ఇది యిట్లుండ అచ్చట విజయనగరమున విరుపణ్ణకు దాయాదియైన దుర్మార్గు డొకడు ఆ రాజు నొద్ద చేరి, విరుపణ్ణపై వైరము పెంచుటకై గట్టిగా ప్రయత్నింపసాగెను. సార్వభౌముడు బాలుడైనందున వంచకులను కనిపెట్టు శక్తి అతనికి అప్పటికి లేదు. పైగా ఎటు చూచినను యుద్ధములే చుట్టుకొన్నవి. ఈ స్థితిలో రాజు పరాయత్త బుద్ధికాక తప్ప

లేదు. కనుక వానినే మంచివాడని నమ్మి, వాని మాయ మాటలకు లోనయ్యెను. ఇకేమి! వాని రొట్టె విరిగి నేతిలో బడినది. ఆ దుర్మార్గుని మాటలను నమ్మి, ఆ బాలరాజు వీరణ్ణ, విరుపణ్ణలను పదభ్రష్టులను గావించెను. ఆ వీర సోదరులు అధికారము పోయినదని వగవక, విధిని నిందింపక, పెనుగొండను వదలి, ఆధ్యాత్మికసుఖాభిలాషులై వచ్చి, లేపాక్షియందే నివసింపసాగిరి.

పిదప ఆ దుర్మార్గుడు పెనుగొండ సింహాసనమెక్కెను. ఇన్నినాళ్ళు హీనముగా బ్రదికిన ఆ నీచునికి, రాజ్యము నంతయు నొక్కనూరు మ్రింగివేయవలయు నను దురాశ కల్గినది. ఇతనికి తగినట్లు పరివారమును వెంటనే కొలువులో సిద్ధమైరి. ఇకేమున్నది? అగ్నికితోడు గాలి!!

చల్లని ఆ వీర సోదరులు తమకు దూరమైనందుకు ప్రజలు మిగుల తల్లడిల్లిరి. ఆ దుర్మార్గుని రాక్షస పాలనలో రాజ్యము తపించెను. ధర్మాత్ములైన వారెల్ల నొక్కటై "వీర సోదరులను రాజ్యమునుండి తొలగించుట అధర్మము. నేటికిని వారే మన ప్రభువులు" అని నలుమూలల ధైర్య ముగ ప్రకటింప జొచ్చిరి. ఇందులకు పెద్దలెల్ల సమ్మతించిరి. పన్నుల నీయ మని ఆ నీచరాజుపై తిరుగబడిరి. వాడును కోపించి, తగిన ప్రతీకారము చేయసాగెను. నిర్దయుడై ప్రజల నెల్ల బలాత్కరించి, వారి సంపద నంతయు దోచుకపోయెను.

రాజ్యము బీడ దయ్యెను. అయినను ప్రజలు విరుపణ్ణపై గల వాత్సల్యముతో మరల నెట్లో అతనిని పోషింపసాగిరి.

దీనిని చూచి ఆ నీచరాజు మరింత కోపించి, ప్రజలను హింసించ సాగెను. కాని ప్రజలు తమ పట్టుదలను వీడకైరి. ఇక లాభము లేదని తలచి, వాడు ఈ నాయకులందరిని లంచములతో తనవైపు త్రిప్పుకొదలచెను. అయినను ప్రజలు విరుపణ్ణ చేతిలో పెరిగిన వారగుటచే ఇట్టి దురాశలకు లొంగకైరి. చివరకు తానే వంచితుడై "దీని కంతయు ఆ విరుపణ్ణయే కారణము. వానిని హింసించుట ఎట్లు! ప్రజలెల్లరు అతనినే ప్రేమించుచు, నన్ను దూషించుచున్నారే! అయ్యో! ఇక నా గతి యేమి?" అని పరితపించెను. చివరకు విరుపణ్ణను నిందలపాలు చేసి, నశింపజేయ నిశ్చయించి, ఇందుకై ప్రజల మనస్సులను మార్చుటకై పాచికలు త్రిప్ప సాగెను.

కాలచక్రము తిరిగినది. వసంతము పోయి, తీవ్ర తాపమును పెంచు గ్రీష్మము వచ్చినది. విజయనగరమున మరింత యెండ లగుటచేతను, అచ్చటి అంతఃకలహములకు విసుగుటచేతను, సార్వభౌముడు విశ్రాంతికై "పెనుగొండ" (ఘనగిరి) కు వచ్చి, గగన మహాలున విశ్రాంతి గొనెను. అది కృష్ణ పక్షపు చివరి రోజులలో నొకటి. ఆనాడు ఈ నీచుడు ఏదియో ఆలోచించుకొనుచు, మెల్లగా మహాలు మెట్ల నెక్కి వచ్చుచున్నాడు. అప్పటి కింకను ఎండ వేడిమి చల్లారలేదు.

కనుక ఆ బాల సార్వభౌముడు భవనము లోపల వేడిగా నుండుటచే వెలుపల రత్నాల మంచముపై విశ్రమించి యుండెను. రాజు ఏదియో ఆలోచించుచు నక్షత్రములవంక చూచుచుండెను. ఇంతలో ఆ దుర్మార్గు డచ్చటికి హాజరయ్యెను.

అంతట సార్వభౌముడు నిట్టూర్చుచు లేచి కూర్చుండెను. వాడు దూరము నుండియే నమస్కరించుచు, అతి వినయముతో వచ్చి, రాజు పాదములపైబడి, వెంట దెచ్చిన బంగారమును, రత్నములను కానుకలుగా సమర్పించెను. ఆ రాజు ఈ కానుకలను, ఇతని భక్తిని చూచి, సంతసించి "ఇక లెమ్ము. రాజ!"- అనినంతనే వాడు భక్తిచూపుచు లేచి, రాజపాదముల చెంతనే క్రింద కూర్చుండెను. సేవకుల చేతి దీపకాంతులలో ఈ ధూర్తుని ముఖము కన్పించినదేగాని రాజుకు గాఢాంధకారమున మునిగియున్న పెనుగొండ కన్పింపదయ్యెను. ఆ దుర్మార్గుడు అతిభక్తి విధేయతలతో, మాటలతో రాజును సంతోష పరచి, అతని మనస్సును ఆకర్షించెను. వాని మాటలకు రాజు ముగ్ధుడయ్యెను.

అంత నా వంచకుడు రాజు మనస్సును గుర్తించిన వాడై, మెల్లగా "రాజా! మీకు అంతగా ద్రోహము తలపెట్టి, అంత చేసినట్టి ఆ వీర సోదరులను గూర్చియు, వారి పన్నాగములను గూర్చియు తెలిసికొని, చాల బాధతో వచ్చి, సమస్తము మీకు విన్నవించుకొంటిని గదా! ఇక

ఏలినవారి ఇష్టము. దైవవశమున ఆ దుర్మార్గుల ప్రయత్న
ములు ముందే తెలిసినవి గాన, వారిని పారద్రోలి, ప్రజా
సంరక్షణము చేయ గల్గితిని. హృదయమున గ్రుచ్చుకొన్న
ముల్లును తీసివైచిననే గదా సుఖముండును?! ఒక్క క్షణము
మనము కన్ను మూసిననో మోసమగును. నేను కుక్కవలె
మిమ్ము కనిపెట్టుకొని యున్నాను. ఇక ఈ బంటును ఏమం
దురో!! మీకై ప్రాణములైన ఇచ్చు నమ్మినబంటని కదా
నాకు పెద్దరికము నిచ్చి అనుగ్రహించితిరి!! మీ కరుణా
మృతము నాపై ప్రసరించు నంతవరకు, ఈ పెనుగొండ
మండలము గ్రీష్మమునందును వసంతమై శోభిల్లుచుండును.
మీరే స్వయముగా చూచుచున్నారు గదా!

విజయనగర రాజ్యలక్ష్మికి ఈ పెనుగొండ ఉద్యాన
వనము. మీకు వేసవి విడిది. ఇట్టి దీని నెవ్వరైనా విడు
తురా ప్రభూ! నేను ఈ మండలము నేలుచు, మీ కీర్తిని
వ్యాపింప జేయుచుండగా, విరుపణ్ణ ఓర్వలేక ప్రజలను నాపై
రెచ్చగొట్టుచున్నాడు. ప్రజలు పన్నుల నెగగొట్టి, నన్నును
మిమ్మును చాల చులకన చేయుచున్నారు. ఆ విరుపణ్ణనే
గొప్పగా తలంచి, అతనికే ధనము నిచ్చుచున్నారు. అతడు
దేవాలయ నిర్మాణమను పేర ఆ ధనము నంతయు 'స్వాహా'
చేయుచున్నాడు. మీ శత్రురాజు వద్ద నుండిన ఆ శిల్పి,
మన సీమలోని శిల్పులకు శిక్షణ మిచ్చుటయా? మన మండల
మున నట్టి శిల్పులకు కఱవా! ఆహా! ఇది మనకు, మన

రాజ్యమునకు సిగ్గుచేటుగదా! అంతేగాను. ఆ శిల్పి దురాత్ముడు. విరుపణ్ణను మీ శత్రురాజుతో చేయి కలుపునట్లు చేసినాడట! ఇదంతయు మన గూఢచారులచే విన్నాను. చూచితిరా! ఏమైనదో!! ఇక ఆలసించినచో కొంప మునుగును. పాప పుణ్యములు, దయా దాక్షిణ్యములు తలంపక, శత్రువులను సమూలముగ నాశనము చేయవలెను. ఊరక శాస్త్రిములు వల్లించినచో లాభము సున్న. శత్రురాజులనెడి గాలి వీచుచుండ, విరుపణ్ణ అనెడి అగ్ని మండుచున్నది. ఇక దానిని వెంటనే చల్లార్పుడు" అని విన్నవించెను.

ఇట్లు ఆ దురాత్ముడు పాప మా విరుపణ్ణపై లేనిపోని చాడీలెల్ల రాజు చెవిలో పూసగ్రుచ్చినట్లు చెప్పి, మృదువయిన రాజు మనస్సును కలుషితము చేసెను. ఇక ఆ యువక సింహాము రోషముతో ఎచ్చటదూకునో! ఏ గోహత్య గావించునో! ఆ సార్వభౌముని కోపమనెడి విషసర్పము గురిగా కాటు వేయునో! లేక విరుపణ్ణ కన్నుల పవిత్రకాంతి యనెడి కట్టులో సొరగిపోవునో! లేక వెనుదిరిగి, పంపిన వానినే కాటు వేయునో! ఇచ్చట చీకటిలో జరిగిన ఈ కుతంత్రమునంతయు అచ్చట శిల్పకాంతిలో తన్మయుడగుచున్న విరుపణ్ణ యెట్లు తెలియగలడు?! మరి చివరకు నేది గెల్చునో! ఈ విధి నాటకములో ఎచ్చట చీకటో? ఎచ్చట వెల్తురో! ఎవ రెరుంగుదురు?

## 4. నేర్పు

విరుపణ్ణ మహాధీరుడు. ధన సంపాదన, శత్రు నిర్మూలన, రాజ్యపాలన, పుణ్య సముపార్జన, కీర్తివ్యాప్తి-అన్నియు సాధించిన పురుషోత్తము డతడు. రాజుగా సకల సౌఖ్యముల నొందిన మహాపురుషుడయ్యును, సమస్త భోగములను విడిచి కళాసక్తుడై ఇచ్చటి కేతెంచెను. ఈ కళ యే భోగము లిచ్చునో! కళానందముతో మించిన ఆనందము లోకమున నెందును లేదు. క్షణికములైన రాజ్యసుఖము లెక్కడ? శాశ్వతమైన కళానందమెక్కడ? ఈ రెంటి భేదమును గుర్తించిన జ్ఞాని విరుపణ్ణ. కనుకనే అతడు కళనే ఆశ్రయించెను. అతడు ఆ కూర్మగిరిపై శిల్పకళారాధన గావింప దొడగిన నాటినుండియు అతనిలో ధ్యాననిష్ఠ యేర్పడినది. దానితో ఆత్మానుసంధానము సిద్ధించినది. ఇక అతని ఆనందమునకు మేరలేదు. ప్రకృతి అంతయు నతనికి కళామయముగనే తోచెను. అతడొక కళాయోగి. ఈ యోగముతో నతడు సత్యశివసుందర స్వరూపమైన పరమాత్మ సాక్షాత్కారము నొందెను. అతనికి ఎటు చూచినను సౌందర్యమె, ఎటు గాంచినను దివ్యకాంతియే, ఎటు సాగినను ఆనందమే, ఎటు లాడినను దివ్యనాట్యమే అయినది. అతని రససమాధికి హద్దులేదు.

## 5. ఓర్పు

ఆ దుర్మార్గుని మాయ మాటలను నమ్మి సార్వభౌముడు విరుపణ్ణపై ప్రతీకారము తీర్పదలచెను. తల్లని

వన్నియు పాలు, నల్లని వన్నియు నీరు అని నమ్మినాడేగాని, లోకమున తెల్లని విషముండుటను అతడు గుర్తింపడయ్యెను. ఆ దుర్మార్గుడు నాటిన విషబీజము మొలకెత్తి, ఆకులు వేసి, తీగెలు ప్రాకజొచ్చెను. ఆ రాత్రి అంతయు సార్వభౌముని హృదయము పలు వికారములకు లోనయ్యెను. "ఔరా! నా ఆశాలతలు ఫలించు చున్నవు! శ్రీహరి కృపవలన ఈ మహా రాజ్యపదవి బాలుడనైన నాకు దక్కినది. నా వారే నను జూచి యోర్వకున్నారు. నా వారే నాకు శత్రువులై యుండుట నెట్లోర్వవచ్చును? విజయనగర సామ్రాజ్య సార్వభౌముడనై నేను ధర్మయుతముగా రాజ్యము నేలుచుండ, సామంతులు కొందరు తామే స్వతంత్రులయి నన్ను ధిక్కరించుటయా? ఇట్లయినచో నేను శత్రువులకు చులకనై పోనా? నా సామ్రాజ్యమే చివరకు తునకలు కాదా!

ఆ విరుపణ్ణ చూచుటకు వినయవంతుడుగనే యుండి, వృద్ధరాజు గతించిన వెంటనే స్వేచ్ఛగా ప్రవర్తించు చున్నాడు. వాడెక్కడ? నేనెక్కడ? నాకే కీడు తలంచెనౌరా! నా శత్రువులతో మైత్రిచేసి, ప్రజలను నాపైకి రెచ్చ గొట్టునా? నన్ను బాలునిగా నెంచెనేమో! నన్ను విజయ నగర సార్వభౌమునిగా నెరుంగడేమో! ప్రత్తికి పర్వతమునకు పోలికయా! ఇకవాని పని పట్టింతును. సుఖాలలో నున్నంత మాత్రమున నన్ను వీరిట్లు చూతురా, వీనినేగాదు ఇకపై ఇట్టివారి కందరికిని చక్కని గుణపాఠము నేర్పెదను. ఈ మండలాధిపతి నాకు తోడునీడ కాగా ఇక విజృంభింతును. ఆహా! ఎన్నినాళ్ళకు నాకీ అవకాశము లభించినది!" అని తీవ్రముగ ఆలోచించసాగెను.

ఇట్టి ఆలోచనలతో ఆ రాత్రియంతయు సార్వభౌము నికి నిద్రలేదు. నాల్గవజాము అగుసరికి అడెటనుండి వచ్చెనో ఎల్లరకును నిద్ర ముంచుకువచ్చెను. నిన్న మొన్నటిదాక ఏ వీథిలో చూచినను ప్రభాతవేళయందు వీణాదివాద్యములు మ్రోగెడివి. అట్టిది నేడు ప్రభాతగీతములు మాత్రము విని పించినవి. అంతట ఈ దుర్మార్గుడును నిద్రలేచి, మేలైన ద్రాక్షపండ్లు, పూలు రాజుకు కానుకలుగా పంపెను. జయ జయ ధ్వనులు మిన్నుముట్టినవి. కాని ప్రభువునుండి వార్త రాలేదేమా? అని తలంచి, ఆ దుర్మార్గుడే స్వయముగ నేగి, సింహాసన మార్గమున నిల్చుండ, నింతలో సింహకిశోరము వలె ప్రభువు అచ్చటికి వచ్చెను. బాలుడయ్యును అతని ముఖమున వీరత్వమునకెట్టి కొరతలేదు. ఇట్లు వచ్చి ప్రభువు సింహాసన మధిష్ఠించెను. ఈ దుర్మార్గుని అనుసరించువారు మాత్రమే ఆనాటి కొలువున నున్నారు.

నానావిధములైన కానుకలకు, స్తుతులకు ప్రభువు మిగుల సంతోషించి, వానిని ప్రస్తుతించెను. అంతట ఈ ధూర్తుడు అతివినయములో మెల్లగా "ప్రభూ! విరుపణ్ణను శిక్షించుటలో ఒక్కనిముసము జాగు చేసినను ముప్పు తప్పదు" అనెను. సభలోనివారును ఇతనికి తగినట్లు తాళము వేసిరి. "సైన్యమును సిద్ధముగనున్న"దని యొకడును, "ఇప్పుడే మంచి సమయ"మని మరొకడును పలికిరి. ప్రభువు దేనికిని

యోచించుటలేదు. కాని అతడు సంప్రదాయానుసారియగుట చేతను, పూర్వప్రభువులవలె శత్రువుల గూల్పబోవుటకు ముందుగా, పేదలు, యోగ్యులగు బ్రాహ్మణులను పిలిచి, వారికి విరివిగా దానములిచ్చి, వారిదీవనలుగొని, ముందుకు నడచుట పరిపాటి. కనుక ఈ సంగతి ఈ దుర్మార్గునికి తెల్పెను. వాని కనుసైగచే నిరువురు తొందరగా సభవదలి పోయి, బ్రాహ్మణవేషములుదాల్చి, మంత్రములు వల్లించుచు వచ్చి, ప్రభువును దీవించుచుండ ప్రభువు చాల సంతసించెను. కాని సామంతుడగు నీతనికది బాధగానుండెను. విరుపణ్ణను శిక్షించుటకు వేళ అతిక్రమించుచున్నదని వాని బాధ. వారిపై కన్నులెఱ్ఱజేసెను. అంతట నా బ్రాహ్మణులు మంత్రమునాపిరి. ప్రభువు వారిని ప్రశంసించి, మిక్కలి గౌరవించి మీరును మాతో ప్రయాణము కావలెనని చెప్పెను. ఇది ధూర్తున కసహ్యమైనను విధిలేకపోయినది. వెంటనే అందరు కలిసి, విరుపణ్ణపై కి బయలుదేరిరి.

పరిమిత సైన్యముతో పోవుట విరుపణ్ణ నెదిరించుటకే అని ప్రభువు తలంచెను. అతని గుణము దెలియదు ప్రభువుకు. కాని తెలిసిన ఆ దుర్మార్గుని పన్నాగము వేరై యున్నది. ప్రజలలో రాజభీతిని నింపుటకే ఇట్లు బయలుదేరినాడు. మునుపు విరుపణ్ణ రాత్రులందు వచ్చినను ప్రజలు వీధులలో నిలిచి చూపులపూలమాలలు వేయుచుండిరి. నేడు స్వయముగ సార్వభౌముడే, పట్టపగలే వచ్చినను పల్కరించువారొక్కరును లేరు.

అచ్చట లేపాక్షిలో తాను, మహాశిల్పియు పట్టుదలతో నిర్మించుచున్న కళ్యాణమంటపమున పార్వతిని చేయిపట్టిన కల్యాణశివునిగాంచుచు విరుపణ్ణ ధ్యానసమాధి నొందెను. పిదప విరుపణ్ణ శిల్పినిచేరి, సరససల్లాపములలో నతని శ్రమను దీర్చి, శిల్పరహస్యములనుగూర్చి అతనితో ముచ్చటింప సాగెను. అచ్చట పడిన రాతిముక్కలన్నిటిని తానె స్వయముగ మోసికొనిపోయి, పారవైచి, ఆస్థలమునంతయు శుభ్ర పరచెను. ప్రొద్దుగ్రుంకెడివేళకు పురజనులెల్లరు అచ్చటికి వత్తురు. అందుకై అతను నూర్లకొలది ప్రమిదెలలో నూనె వత్తులను వేయుచుండెను.

ఆ దుర్మార్గుడు లేపాక్షి పురమునకు ప్రక్కన ఒక రమ్యస్థలమున ప్రభువునకు తగిన సౌకర్యములతో విడిది నేర్పాటు చేసెను. సైన్యము నచ్చటనే నిల్పెను. వెంటనే ప్రభువునందు చేర్చి, ఆలస్యమైన నే మార్పు జరుగునో యని సంశయించి, విరుపణ్ణను పిల్చుకు వచ్చుటకై త్వరగా నొకనిని పంపెను. అతడు వచ్చులోగా నూరకుండక ఈ ధూర్తుడు ప్రభువును, "ప్రభూ! అదిగో ఆ కన్పించునదే విరుపణ్ణ కోట" అని దేవాలయ ప్రహరిని చూపించి, "అది దేవాలయమను పేరుతో తన కొరకై కట్టుకొన్న దుర్గము. అందు ప్రజలను వంచించి సాధించిన ధనమునంతయు నింపి నాడు. మందుగుండు సామాగ్రి నంతకు ముందే నింపి యున్నాడు. మన శత్రువు పంపు సైన్యమునకై ఆ వైపే

చూచుచున్నాడట! ఈ విషయమును మన గూఢచారులు అప్పుడే విన్నవించినారు. తగిన వేళకు వచ్చితిమి. నేనొక ఉపాయముతో నతని నిటకు రప్పింతును. మీరు వానిని శిక్షించి, ప్రజలను ఒక మార్గమునకు త్రిప్పుడు" అని చెప్పి రోష మెక్కించెను. ఇట్లు విన్నవించునంతలోనే విరుపణ్ణను తెచ్చితినని యొకడు వచ్చి, ఆ ధూర్తుని చెవిలో రహస్యముగ చెప్పెను.

అట సిద్ధముగా నున్న ఆస్థాన పీఠమున సామ్రాట్టు కూర్చుండెను. అతని ప్రక్కననే ఆ ధూర్తుడు నిలుచుండెను. ప్రక్కననే ఆ ధూర్తుడు నిలుచుండెను. ఎంతో కాలముగ లోపల జ్వలించుచున్న అసంతృప్తియు, దానిపై విరుపణ్ణపై కోపమును, విశ్రాంతి లేకుండుటయు ఇవన్నియు కలసిన ఆవేశముతో సామ్రాట్టు "ద్రోహియగు ఆ విరుపణ్ణను వేగమె తెండు" అని గర్జించెను. అంతట విరుపణ్ణ విధేయతతో పళ్ళెరమున పూలు, పండ్లు గొని ఎదుట సాక్షాత్కరించెను. ద్రోహి, దుష్టుడు అని ఇంతవరకు కలవరించుచున్న సామ్రాట్టు, సౌమ్యమైన విరుపణ్ణ ఆకారమును చూచినంతనే ముగ్ధుడయ్యెను. అంతట విరుపణ్ణ తాను తెచ్చిన పూలను పండ్లను రారాజునకు సమర్పించి, జయజయవాక్యములు పలికి, విధేయుడై ముందు నిలబడెను. రారాజు అతనిని చూచుచు, "ఆహా! ఇతడా విరుపణ్ణ!" అని లోలోన మెచ్చుకొనుచు ఊరకుండెను. అంతట ఆ ధూర్తుడు "ప్రభూ! ఇంక

విచారింపబనిలేదు. చేజిక్కిన వైరిని విడువక, త్వరగా బంధింపుడు" అనెను. ఈ మాటలువిని విరుపణ్ణ ఆశ్చర్యము నొంది, ప్రభువుతో "ఓ రాజా! ఈతడు భ్రాంతినొంది, వృథాగా నాపై వైరమును పూని, నన్ను కష్టపెట్టుటకై తాను కష్టాల పాలగుచున్నాడు. ఈతని అవివేకతకు జాలి యగుచున్నది. ఇతనిలో మానవత్వము లోపించెనేమో!

నన్ను, నా తమ్ముని పదభ్రష్టులను జేసి, తాను ఆ పదవిని గైకొనెను. మేమందులకు సంతసించితిమి. కాని ఇతడు ప్రజలను అనురాగముతో పాలింపక, దురాశా పరుడై ప్రజలనే తిన జూచినచో సహింతురా; రాజులెందైన ఇట్లు గావింతురా ? ప్రజలకు రాజుకు అన్యోన్య ప్రేమ యున్ననే క్షేమము కలుగును. ఇతడు నా తమ్ముడే. చిన్న నాటి నుండియు నేనెంత ప్రేమ చూపినను, ఇతడు నాపై విష మునే క్రక్కుచున్నాడు. ఇప్పటికిని నా కితడు ప్రేమపాత్రుడే. రాజ్యమునే ఇతనికి ఇచ్చి వచ్చిన నన్ను బంధింప జూచు చున్నా డితడు. ఇతని నుద్ధరించుటకై అవసరమగుచో ప్రాణము లిచ్చుటకైనను నేను సిద్ధమే. నేను పారిపోవుదునను భయము మీకు వలదు. నన్ను బంధించునట్టి దుష్కార్య ములు పుట్టిననాటినుండి నే నెన్నడును చేయలేదు. మీ యుప్పు దినిన నేను మీకే కీడొనరింతునా? ఇతడేల మరి నన్ను వైరి యని కూయుచున్నాడు? ఇట్టి మాట వినలేను ప్రభూ !" అనెను. రారాజు అంతయు సావధానముగ వినెను.

కాని ఆ ధూర్తుడు "ప్రభూ! ఇట్టి ధూర్తుని ఎందై

నను చూచితివా ! తాను సన్మార్గుడైనట్లే యెప్పుడును ఈతడు నటించును. ఇట్టి నటన మరెవ్వరికిని సాధ్యపడదు సుమా! ఇట్టి మత్సరుండును చల్లియే మన ప్రజలను తనవైపు త్రిప్పుకొన్నాడు. వారిని నాపైకి లేపినాడు. నేను బాధపడు చుండ తాను సంతోషించినాడు. ఔరా ! నాపై ఇతనికి ప్రేమయా! నాకుగా రాజ్యము నిచ్చెనా? ఆహా! ఇంతకంటె నటన యున్నదా? మన శత్రుని ఆస్థాన శిల్పిని రప్పించి, వానిని గొప్పగా చేసి, వాని ద్వారా శత్రురాజుతో చేయి కలిపినాడితడు. ప్రజలలో రాజుపైన, రారాజుపైన ద్వేష మును పెంచినాడు. మనకు వచ్చెడి పన్నులను తానె గైకొన్నాడు. శత్రుసైన్యము వచ్చుచున్నది. ఇంక ఉపేక్షించి నచో నెట్లు?" అని అసత్యమును సత్యముగా తోచునట్లు పల్కి, రారాజును రెచ్చగొట్టెను. వెంటనే రారాజు విరుప ణ్ణను శిక్షింపబోయెను. కాని అతని కనుల కాంతికి ముగ్ధుడై అట్లే సోలిపోయెను. "ఔరా! యీతని కనుల శక్తి! ఏమి ఆశ్చర్యము!" అనుచు ఆ ధూర్తుడు చింతించెను.

ఇంత జరిగినను విరుపణ్ణ చలింపక, ఆ ధూర్తుని అసత్య ప్రకటనా శిల్పమును గాంచి, ముగ్ధుడై "ఆహా! ఈ నా తమ్ముని మాటలు విన్నచో ఎవనికైనను సత్యము దాగి, అసత్యమే ప్రకట మగును. ఎంత కల్పన చేసినాడు? అసత్య కల్పన యున్నచో వీనిదే పెట్టినపేరు. లోకమున సత్యము స్థిరమైనది. దివ్యమైనది. కాని అసత్యము సత్యమను మెరుగుతో జనుల నాకర్షించును. కన్నులే గాదు ప్రమాణము. అంతరదృష్టియు ముఖ్యము. సత్యాసత్యములను భగవం

తుకు గుర్తించును" అని తనలో తలపోయసాగెను. ఇంతలో రాజా విరుపణ్ణను జూచి, "మరి యీ నేరములకు ఏమి బదులిత్తువు?" అనెను.

అంత విరుపణ్ణ చిరునవ్వుతో, "ప్రభూ! ఈ నా తమ్ముని మాటలు విన్నచో ఎవనికైనను అసత్యమే సత్యమని తోచును. వీనిని నమ్మకుడు. కోట్లకొలది ప్రజలుగల సామ్రాజ్యమునకు మీరు నాయకులు. కనుక పరిపాలనమున వేయి కనులతో జాగ్రత్తగ మెలగవలెను. ఈ సార్వభౌమ పదవిని స్వీకరించి, ధర్మయుక్తముగా ప్రజలను పాలించిననే భగవంతుడు సంతోషించును. ఇందులకు నిస్వార్థత, సౌశీల్యము, త్యాగము, విజ్ఞత, దక్షత, ధార్మికగుణము మున్నగునవి కావలెను. ఇందేది లోపించినను చివరకు ప్రమాదము తప్పదు. స్వార్థపరుడగు నితడు ఇచటి ప్రజల స్వరూపమునే మీరు చూడలేనట్లుగా- అసత్యమను గంత మీ కనులకు కట్టినాడు. ఇప్పుడైన ఆ గంతను విప్పి, సత్యమును దర్శింపుడు.

ఈ పెనుగొండ పరిసరములలో నున్నవారి హృదయములు సైతము నే నెరుంగుదును. మీపై అందరికి నిండు ప్రేమ, భక్తిగలదు. వారెట్టి మాయమర్మము నెరుగరు. ముందే చెప్పితిని గదా! ఇతడు దురాశాపరుడై ప్రజలపై పన్నులవాడి సల్పి, వారిని పీల్చి పిప్పిచేసెను. మరి ప్రజలు కోపింపక యూరకుందురా! ప్రజలకితనిపై ఇప్పటికిని వ్యక్తిగత ద్వేషము లేదు. ఇతడు మంచి మార్గమునకు వచ్చునేని, గత

మును ముంచి, ఇతనినే పూలతో పూజింతురు. ప్రేమతా త్రిశుడనైన నన్ను ప్రజలు అభిమానించి, నేను కట్టు దేవాలయమునకు యథాశక్తిగ కానుక లిచ్చుచున్నారు. ఇదిదోసమా? సహింపరానిదా? దీనిచే మీకు కొరత ఏర్పడునా! ఆ మాత్రపు ఔదార్యమునకును మీ ప్రజలకు స్వేచ్ఛలేదా? ఈ మహాశిల్పి నా దేశపు పూర్వపుణ్యఫలమా? యనునట్లు ఇచ్చటికి వచ్చెను. ఇతడు శత్రురాజ్యమున మహాపూజ్యుడై యుండియు, రాజు తన కట్టి పనియు కల్పింపని కారణమున, అన్ని సుఖములను వదలి, శిల్పైకజీవియై, ఇచ్చటికి వచ్చినాడు. అతనికి ఈ రాజ్యాంగచింత యేల పట్టును? అతనికి కళయే ముఖ్యము. కళకు దేశ కాల జాతి భేదములందు ఎన్నడును పక్షపాతముండదు.

నే నతనిని శత్రురాజునుండి పిలుచుకరాలేదు. నా కతనితో పూర్వ పరిచయములేదు. దైవికముగ అతడే ఇచ్చటికేతెంచెను. గొప్పవానిని గొప్ప చేయుట తప్పా? శత్రువుకు మాకు సంబంధ మేమున్నది? సంధానము లేదు, గింధానము లేదు. అన్నియు ఈతని కల్పనలే. ప్రజలలో సమతా బీజములు నాటిన నేను ద్వేషమును పెంతునా? పాడియావు నుండి పాలు గొన్నట్లుగా ప్రజలనుండి ప్రభువు పన్నులు గైకొనవలెను. అట్లుగాక కడుపు కోసిన పాలు వచ్చునా? నేను పన్నులు గైకొన్న మాట అసత్యము. దోప మెవరిదో గమనింపుడు. శత్రుసైన్యము మాటయే నే నెరుగను. అట్లదేని

శత్రుసైన్యము వచ్చుచున్నచో- ప్రజాక్షేమమునెంచి, దానీ నెదుర్కొనుటకు మేమును సిద్ధమే. మా పాలిటి తండ్రివైన రారాజా! మావాని మాయలలోబడి ఆత్మశక్తిని కోల్పోవ వద్దు. వీనిని చక్కదిద్ది, పూర్వపు సార్వభౌములవలె ప్రజాభిమానమునుగొని, పాలింపుము" అని పల్కెను. ఇందుతనకే నీతులు చెప్పు మాటలు అచ్చటచ్చట వినుటకు బాధగా నున్నను, రారాజు అతని పవిత్ర ప్రభావమునకు విస్మితుడై చక్కగవిని, ఆ ధూర్తునిచూచి, "ఏమయ్యా! మంచివాడవని నిన్నే" అను చుండగనే- వెంటనే "స్వామీ! మోసము! మోసము! ఈ దుర్మార్గుని మాటలమాయలోబడి, నన్నే నమ్మరా? ఇత డింతటి ధూర్తుడని నాకు మునుపు తెలియదు. అట్లయినచో ముందే సాక్ష్యము చూపనా!" అని, తనకు గల్గిన ఆపదను తాను తప్పించు కొనినాడు ఆ ధూర్తుడు. కలగను చుండువానికి కలలో నిది కల అనుచు ఇరువురు చెప్పినను దెలియలేదు గదా. అట్లే రారాజుకు సత్యము కలవరమై కన్పించెను.

చివరకు ఆ దురాత్ము డొక్కటి యూహించిన వాడై, నమ్రమాట్లతో "దేవ! ఈ విరుపణ్ణ నిజముగా రాజభక్తి కల వాడేని, మీ పాలితుడేని, పట్టి మాటలలోగాక, పనులలో తన రాజభక్తిని చూపునేని వీనిని నమ్ముడు. అట్లుగాకున్న నా పలుకులన్నియు నమ్మి ఈ ద్రోహిని బంధింపుడు" అని

చెవిలో నేదియో రహస్యముగ చెప్పెను. అంతట రారాజు "ఓ విరుప! నీవుకట్టెడి దేవాలయము పని నంతయు ఆపి, ఆ శిల్పిని మా వశము చేయుదువా?" అనెను. అందులకు విరుపుని యందు ఆవంతయు వంత కన్పింపదయ్యెను. అందరును మిగుల నాశ్చర్యపడిరి. విరుపుడు 'ధర్మమేదియా?' యని కొంత ఆలోచించి, గంభీరముగా "ప్రభూ! ధర్మమును గూర్చి నా యోపినంత ఆలోచించితిని. మీ ఆజ్ఞను పాలింపకుండుటే యుక్తమనిపించినది. కారణములను వినుడు. రాజాజ్ఞను పాలించుట ధర్మమే. కాని దేవాలయమును నిర్మించెడి శిల్పి కార్యమునకు ఏ ఆపద రాకుండ జూచుటయుగూడ నాకు ధర్మములే. రాజులు ఆజ్ఞాపించుటకును ధర్మములు లేవా? స్వధనముతోడను, పిమ్మట ప్రజ లిచ్చిన దానధర్మముల తోడను ఈ దేవాలయ నిర్మాణము జరుగుచున్నది. ఇందు ఒకింతయు రాజ్యధనములేదు. ఇది రాజ్యధనమే అయినచో నే నడ్డు చెప్పను. ఇది అట్టిది కాదు. ఇట్టి పుణ్యకార్యమును చాలింపజేయుటకు ధర్మయుక్తముగ జూచినచో రాజులకు అర్హతలేదు. నాకా శిల్పిపై నే యధికారమున్నది గనుక అతనిని మీ వశము చేయగలను? సూర్యాస్తమయము కావచ్చినది. ఇక ప్రజలెల్లరు సాయంసంధ్యా శివారాధనకై దేవాలయమునకు వత్తురు. ఆ పరమేశ్వరుని ఆజ్ఞానుసారమేగదా ఈ కాలచక్రము తిరుగుచున్నది. దానిని ధిక్కరింప నగునా? నేను పోవుటకు అనుమతింపుడు" అని పల్కెను. విరుపుని ధర్మ వాక్యములలో ఒక్క తప్పునైనను చూపజాలక అలసిన

రారాజు "ఇక నీవు పోవచ్చు" ననెను. ఎల్లరును లేచిరి. ఆ ఘూర్తుడు మాత్రము లోలోననే కూలిపోవుచుండెను.

## 6. చేరుప్

సాయంకాల మయ్యెను. ప్రజలెల్లరు దేవాలయమందు చేరి, పరమేశ్వరు నారాధించి, విరుపణ్ణ ధీరతను, సుగుణమును ప్రశంసించుచు, తమ తమ నెలవులు చేరిరి. చేరి యెల్లరు రాత్రి భోజనములు గావించి, ప్రశాంతముగా నిద్రించిరి. అప్పటికి రెండు జాములైనది. అంతలో పురమున నెచ్చట జూచినను తుపాకుల మ్రోతలే. ప్రజలెల్లరు గగ్గోలు పడిరి. వెంటనే కొందరు బలవంతులు బాకులు, బల్లెములు గొని, ఈ ప్రమాదమును నివారింపఁ బారిరి. అంతలో "అనుకొన్నంత మించినది కార్యము. ఇక ఆలస్యము చేసినచో మనలను పంపిన మండలాధిపతి పన్నాగమునకే మోసము వచ్చును" అని తలంచి, తుపాకి సైనికులు వెనుదిరిగి పరువెత్తిరి. పౌరులు వారిని వెన్నంటి, "ఓరి నీచులార! పారిపోదురా?" యని తరుమగా, వారు పరుగులపై వచ్చి, ఆ శిబిరమందు పడిరి. అది అతిరహస్య స్థలము. మునుపటి తన యత్నము లెల్ల వ్యర్థములు కాగా, దెబ్బతిన్న త్రాచువలె, ఆ సుండ తేను కోపించి, పన్నిన పన్నాగ మిది. వెంటనే రారాజును చేరి, "ప్రభూ! మీరే స్వయముగ చూచితిరి గదా! ఈ ప్రజల దుష్టత్వము. ఇప్పుడయిన తెలిసినదా? మరల చెప్పుచున్నాను. ఈ ప్రజలకు మా నీడకూడ గిట్టదు. ఆ విరుపుడే ఇంతకు కారణము. ప్రజలు అతనిచే బాగుగ శిక్షణ నొంది

యున్నారు. వారికి భయపడి ప్రభువుగారి సైన్యమే వెను దిరుగునేమో!" అని వికారముగా నవ్వి, "ప్రభూ! ఇది అంత చుల్కనయని యెంచరాదు. అంతలేనిదే ఒక్కడు మీ ఆజ్ఞ తిరస్కరించునా? విరుపున కెంత కావరము?! మీ ఆజ్ఞకు, ధర్మశాస్త్రములు వల్లించుటయా బదులు?! వాని బోధనలకు సమ్రాట్టులు ఊరకుండుటయా? పేదనోరివాడ నే నేమన గలను? ఆ సమయమున దావాగ్నిగా మండుచున్న గోష మును లోలోననే అణంచుకొంటిని. అంతటి కోమలదేహము నతని కిచ్చిన ఆ బ్రహ్మను తిట్టుచు నిశ్చేష్టుడనై యుంటిని. ఆ కనులు మోహనాస్త్రములు. అట్టివి స్త్రీకి ఈయక బ్రహ్మ ఆ దురాత్ముని కిచ్చి, సృష్టికే అపకార మొనర్చె నాడు. క్షమింపుడు అట్టివి మీ కిచ్చి యుండవలెను"- అను నంతలో వాని కనుసైగమేరకు ఒక యువతి సామ్రాట్టు పెద వికి పానపాత్ర నందిచ్చెను. అంతట రాజు శృంగారపరవశుడు కాగా, పలువురు స్త్రీలు సంగీతాది నృత్యములతో నతని నానందింప జేసిరి.

అపుడు ఆ ఖలుడు "ఇట్టి భోగములు విజయనగరా ధీశులకు తప్ప ఇతరులకు కెట్లు సాధ్యమగును?" అని అతనిని మరల్చి, "ప్రభూ! తమ ప్రభుత్వమును, ఘనతయే గదా ఈ సౌఖ్యము లన్నిటికి మూలము. మీ ఆజ్ఞలో న్యాయాన్యాయ ములు నిర్ణయింప నెవరికి శక్యము? మీ ఆన యున్నచో ఇక అదియే న్యాయము. మీఆనను మీరుట అన్నచో, తాను మిమ్ము మించినవాడనుటే గదా! ఇంత కంటెను ద్రోహ మొండైనను గలదా? ప్రభువులకిది తీరని తలవంపు. మీ

ఆనను త్రోసివుచ్చుట అను దోషమొక్కటి చాలు- ఆ దురాత్ముని తీవ్రముగ దండించుటకు. ఇందేకాదు. వాడు చేయని ద్రోహము లేదు. ప్రత్యక్షముగ నున్న వానిని వినుడు- చెప్పెదను- మీ యెదుట మీకే బుద్ధులు చెప్పెడి ,అహంభావమును చూపలేదా? ఇప్పుడు ప్రత్యక్షముగ ప్రజలను చెలరేపి రాత్రివేళ తుపాకులను ప్రేల్చి, మిమ్మే యెదిరింపలేదా? ప్రత్యక్షమునకు సాక్ష్యమేల? మీ యుప్పు దిని బ్రదికి, మీకే కీడొనరింతునా? అనిన అతడు తిన్నయింటి వాసము లెంచిన తీరును గమనింపుడు. స్వధనముతోనే దేవాలయము కట్టించితి నన్నాడు గదా! ఆ స్వధనస్వరూప మెట్టిదో పరికింపుడు" అని పలుకుచు వాడు ఒక దస్త్రమును విప్పి, రాజు నెదుట నుంచెను. కల్పించెడి వారు వానిని కల్పన లనునట్లు గావింపరుగదా! రాజు వానిని చూచి, నిశ్చేష్టుడయ్యెను.

రాజు ముఖభంగిమలనే చూచుచున్న ఆ ధూర్తుడు రాజు తననే చూచినంతనే, గొప్పధర్మజ్ఞునివలె తన వాదము నారంభించెను. "మీ ధనమంతయు లక్షలకు మ్రింగిన తీరు ఇది. అంతేగాదు దానిని తనదిగా ప్రకటించిన ద్రోహి ఇతడు. ఏ రారాజైనను భరింపజాలని ఇంత ఖర్చును ఒక సామాన్యు డెట్లు భరింపగలడు? పైసకు గతిలేక, కట్టిన కొట్టిన పన్నునీయ లేని ఈ ప్రజల పన్నులెంత? అందు రాజభాగమెంత? సామంతుని భాగమెంత? వాని విలాసములకు పోగా మిగిలినదెంత? మరి మీరే చూచితిరిగదా! ఆకాశమునంటు దేవాలయ నిర్మాణమున ఒకవైపు ప్రాకారమున కైనను వానిసర్వస్వము

చాలునా? బిచ్చమెత్తినను ఇట్టిది సాధ్యమా? అట్టిదినిర్మింప మీకును, నాకును సాధ్యమగునా? మీ ధనము నెల్ల కొల్ల గొట్టనిదే ఈ ఆలయ నిర్మాణము జరిగిన దన్నచో హాస్యాస్పదము కాదా?" అని గుక్క త్రిప్పక ఏమేమో వచించి, ఆలోచించుటకును రాజున కవకాశ మీయక ఇది-అది యని వాదించి, చివరకు రాజు మనస్సును కలుషితము గావించెను.

ఇమ్మట ఆ ధూర్తుడు "ప్రభూ! దగాలకు దోపిడీలకు శాస్త్రిమురీత్యాశిరశ్ఛేదమేశిక్ష. ఇట్టివానికంతకంటెను ఘోర శిక్ష శాస్త్రియుక్తము. ఇట్టివారికిశిక్షవిధింపనిచో, రాజే నరక బాధ ననుభవించితీరును. రాజాజ్ఞనుధిక్కరించిన వానిని శిక్షించిననే, ప్రజలలో భయభక్తులు స్థిరపడును. అన్నదాతలైన మీ యింటనే కన్నమిడిన వాని కన్నులు మీ లక్ష్మిపై బడినవి. కనుక ఆ కన్నులను పెరికించి వేసిననే ధర్మకిరీటము నిలబడును." అనుచు విషాగ్నులు క్రక్కుచు, వెంటనే ఆ ధూర్తుడు విరుపణ్ణ కన్నులు పెరికించుటకై సిద్ధముగా వ్రాసియుంచిన ఆజ్ఞాపత్రమును, రాజముద్రకై అతని యెదుట ను చెను. రాజు దానిని గాంచి ఇది అన్యాయమని తోచినను, పరబుద్ధికి వశుడైన కారణమున దానిపై రాజముద్ర నొత్తెను. ఇక ఆ ధూర్తుని ఆనందమును చెప్పవలెనా? వెంటనే ఆ పత్రమును తాను గ్రహించి, రాజును గొప్పగా స్తుతించి మనస్సున మీసాలు త్రిప్పుచు- ఆ చీకటిలోనే వెళ్ళెను. తర్వాత జగచ్చక్షువగు సూర్యుడు ఉదయించెను.

అప్పుడు రాత్రి తుపాకి దెబ్బలతో గాయపడిన వారి

నెల్ల పిలుచుకవచ్చి, పౌరులు దేవాలయమున నున్న విరుపణ్ణకు చూపి, "ప్రభూ! కన్నతండ్రివి నీ వుండగానే రాత్రి చీకటి వేళ నిరపరాధులైన ప్రజలపై తుపాకుల ప్రేల్చిరి సైనికులు. గాయపడిన వీరిని చూడుడు. ఇంత అన్యాయ మెందైన గలదా? రాజులైన నేమి! రారాజులైన నేమి! ఇట్టి అకృత్యమును సహింపవచ్చునా? నిరపరాధులను హింసించు నీచులకు సిగ్గుమాలి తలవంచుటకంటె తలలు పోయినను బాధలేదు. ఎదుర్కొని రేని మా బలము తెలియగలదు" అనుచు నేమేమో పలుకుచుండ, వారి నందరిని ఆపి, చిరునవ్వుతో విరుపణ్ణ "ఓ అన్నలారా! ఇంత ఆరాటమేల? ఇంతటి దుడుకు పలుకులేల? తొందర పడినచో పనులు చెడును. ఒకింత ఓర్పు కలిగియుండుడు. మండలేశ్వరుడు భ్రాంతిలో పడి చెడుదారి పట్టినాడు. వీని మాయలో బడి రారాజు కూడ స్వబుద్ధిని కోల్పోయినాడు. అంతేగాని నీతిని విడువడు. మనపై కసితో మండలేశ్వరుడు రారాజుకు ఏవేవో చెప్పి, మనలను ద్రోహులుగా చూపుచున్నాడు. మిమ్మొకవైపున రేపుచు, మమ్ము అపరాధులుగ చూపుచు, మనపై రాజును క్రమ్మించి, స్వయముగ వినోదింప పన్నాగము పన్నినాడు, రారాజు హృదయమున విషమునిండియున్నది. ఇట్టిచో మనము ఏమాత్రము భక్తిని విడిచినను ముప్పుతప్పదు. మీ మనోనిగ్రహము, ధైర్యస్థైర్యములు, విశాలహృదయము, ప్రేమ, భక్తి పరీక్షింపబడు సమయము వచ్చినది. ఇపుడు కొంచెమైన ఇది దెబ్బతిన్నచో దేశమున మహాక్షోభము ఏర్పడును.

చల్లగ రక్షించు గాయత్రీ మంత్రమును తాంత్రికుడు తారుమారుగ చేసి మారణ ప్రయోగమునకు త్రిప్పి యున్నాడు. దానిని మీరు తిరుగు మంత్రముతో గాక, ప్రేమ భక్తితో సరిదిద్దుకొనవలెను. రారాజుకన్నుల దెరచి, సత్యము నతనికి చూపింపుడు. అతనిని తాకినచో, అగ్నిపర్వతము ప్రేలును, తరువాత దాని ధాటి కాగలేము. దానిచే సర్వ నాశనము జరుగును. ఇక మీరాలస్యము చేయక ఈ శిల్పిని, వీరణ్ణను ముందిడుకొని, మంగళ ద్రవ్యములతో, మంగళ నృత్యగీత వాద్యములతో పోయి రారాజును భక్తితో సేవించి, ఈ పవిత్రస్థలమునకు రండని ప్రార్థింపుడు." అనెను. అంతట ఇది మంచిదని యెల్లరును క్షణకాలములో నన్నియు సవరించుకొని, రారాజు శిబిరమును జేర పయనమైరి. విరుపణ్ణ దక్క తక్కిన వారెల్లరు రాజును పిలువ నేతెంచు చున్నారను వార్త తెలిసి, ఆ ధూర్తుడు మిక్కిలి సంతో షించెను.

అంతటి నిదియే తగిన సమయమని తలంచి, ఆ పాపా త్ముడు రాజాజ్ఞను నెరవేర్చదగు క్రూరభటులకై అటు నిటు వెదుకసాగెను. ఇంతలో రారాజు కొలువుదీరి, దూరమునుండి వచ్చు ఆ మంగళవాద్యముల శబ్దములను విని ఆకులత నొందెను. ఇట్లాశబ్దములు క్రమక్రమముగా వృద్ధియై, శిబి రము కడకువచ్చి, ఒక్కమారుగ నాగెను. అంతట ప్రతీహారి వచ్చి, "దేవా! తమ దర్శనార్థమై ప్రజలు వచ్చి, నిరీక్షించు చున్నారు" అని విన్నవించెను. వెంటనే రారాజు ఆశ్చర్యము

నొంది, "త్వరగా వారి నిచ్చటికే పిల్చుకు రమ్ము" అనెను. అంతట ప్రజల వెంటనిడుకొని, వీరణ్ణయు, ఆ శిల్పియు వచ్చి, యెదుట నిల్చిరి. వీరణ్ణ కన్నులను చూచినంతనే రారాజు ఉలికిపడి, విరుపణ్ణ కన్నులను దలచుకొని, లోలోన మూగబాధ నొందెను. ఇంతవరకు ఎవరిని దొంగలు, ద్రోహులు అని తలంచి, శిక్షించుటకై సమ్మతించెనో వారే తన యెదుట నిల్చి, ప్రేమామృత దృష్టితో తనను చూచుచుండ, రారాజు హృదయమున పెరుగు వడ్లు కలిపి నట్లయ్యెను.

అంతట శిల్పియు, వీరణ్ణయు "ఆర్షధర్మగ్లాని నరికట్టు టకు అవతార మెత్తినవారును, విద్యారణ్యుల పవిత్ర కాంతిలో దేశమును నడిపించు ధీరులును, ప్రజాక్షేమంకరు లును, కళాహృదయులును, దిగంతవ్యాప్త కీర్తివంతులును, ధర్మపాలకులును అగు శ్రీ విజయనగరాధీశులకు జయమగు గాత!" అని వినయముతో పలికిరి. పిదప శిల్పి "ప్రభూ! సచ్ఛీలుడగు విరుపణ్ణకు తోబుట్టువగు వీరణ్ణ యితడు. పెను గొండ మండలమును ధర్మయుక్తముగ పాలించి, వన్నె కెక్కిన ఈ సోదరులకు నేను మిత్రుడను." అని తననుగూర్చి విన్నవించుకొనెను. తరువాత వీరణ్ణ "ప్రభూ! ఈ శిల్పి సహా కారముతో నిర్మితమైన ఆ దేవాలయశోభ ప్రశంసనీయము. మీరు మనసారవచ్చి దర్శింపవలయునని మా ప్రార్థన. మీ రాకచే, మా నిరంతర శ్రమయంతయు సార్థకమగును" అని విన్నవించెను.

ఈ మాటలు రారాజు హృదయమును కలచివైచినవి గాని, అహంకారము, చెడుతలంపులకే తోడ్పడెను. రాజే మయు ననకుండెను. సభయు మౌనముదాల్చెను. అంతట శిల్పి మరల "ప్రభూ! నా కృషియేమియు లేదు. సకల నాయకుడగు ఆ భగవంతుడే ఆత్మలీలలతో సర్వమును ప్రకాశము చేయును. అందలి సుందరత్వమును మాత్రమే పైపైజూచి సంతసించువాడను. ఆ భగవానుని సత్కళయే జగత్కల్యాణసంధాయి. ఆ భగవత్కళకు ప్రతిబింబమే శిల్ప కళ. ఆ శిల్పకళామృతమును గ్రోలుటకు మీకు స్వాగతము!" అని పల్కెను. రారాజు హృదయమున శిల్పి పల్కినట్టిదంతయు సత్యము. కాని యేదో నా మదిలోజేరి అడ్డగించుచున్నది. శిల్పసౌందర్యము నెరిగిన వాడనయ్యు ఏలనో అరనిముసమైనను అందు మనస్సు నిల్పలేకున్నాను" అని తలంచెను.

వీరణ్ణ శిల్పసౌందర్యమును ప్రభువుకు నివేదించు చుండెను. విరుపణ్ణ శివ ధ్యానైక తత్పరుడు. అతడు విశ్వ కళాహృదయుడు. అతని హృదయమున మమతాహంకార ములు లేవు. అతనికి కనుదెరిచెనా కనుమూసినా శివుడే సాక్షాత్కరించును. ఆ భగవద్భక్తినిదప్ప, తక్కన తన సర్వ స్వమును త్యాగము చేసినాడు. పరమశివుని నమ్మినవారికి మాయాభయములెక్కడివి? సమస్తదేవతలు ఆ శివునియందే అతనికి గోచరింతురు. త్యాగము చేతనే అమృతత్వము సిద్ధించునను వేదవాక్యమును నమ్మి, ఆ పరమాత్మనే సేవించును. ఆ యానందపరవశుడై అతడు సర్వభోగములను త్యాగము చేసెను. ఆ భోగలాలసతలో అహంకారియై

ప్రభువు ఆ త్రిలో బడినాడు. ఆ కామతామసగుణుడై ఈ దురాత్ముడు విరుపణ్ణపై పగబూనెను. ఆ దురాత్ముని ఆజ్ఞగొని, ఇరువురు హంతకులు విరుపణ్ణ కన్నుల దెచ్చుటకై పోయిరి.

సకలైశ్వర్యములు, పరివారము, సమస్తము కల్గియు, ప్రభువు మనస్సు నొక్క క్షణమైన నిలుపు శక్తిలేక తల్లడపడుచు వీరణ్ణ పల్కులను వినుచుండెను. వీరణ్ణ శిల్పసౌందర్యమును వర్ణించి పిదప, "ప్రభూ! మా సర్వమును శిల్పమునకే అంకితము చేసినారము." అనెను. "అవునవు" నని ఆ ఖలుడు రారాజు ప్రక్కన నిలిచి వికృతముగానవ్వెను. రారాజుగూడ అహంకారియై "అవునవు" నని పండ్లు గొరికెను. ఈదృశ్యము చూచి వీరణ్ణ చాల ఆశ్చర్యపడెను. అంతట శిల్పి, "ప్రభూ! ఇదంతయు సత్యము." అని విరుపణ్ణ త్యాగమును, చరిత్రమును వివరింపదలచినవాడై "ప్రభూ! విరుపణ్ణ చరిత్రమును చెప్పెదను వినుడు" అని చెప్పబోగా, ఆ దుర్మార్గుడు తన పని నెరవేరుదాక, ఇదియు తగియున్నదని తలంచి, ప్రభూ! సావధానముగా వినుడు" అనెను.

ఆ పోయిన క్రూరాత్ములు మెల్లగా గుడిజొచ్చిరి. నిర్మానుష్యమైన ఆ స్థలమున కొంతసేపు నలువైపుల వెదకిరి. పొంచుకొని పొంచుకొని పోయి వెదకి వెనుకనుండి విరుపణ్ణను చూచిరి. ఇదే తగిన సమయమని యెంచి, ఇరువైపులనుండి వెళ్ళి, ఒక్కసూరుగ అతనిని బంధింపవలెనని ఆ క్రూరులు సైగలు చేసికొనిరి.

కనులుమూసికొనివిరుపణ్ణ పద్మాసనస్థుడైధ్యాననిమగ్నుడై యున్నాడప్పుడు. అంతట ఆ క్రూరులు వచ్చి విరుపణ్ణ

చేతులను బిగించి పట్టిరి. యోగమందున్న అతనికి పరమేశ్వరుని స్పర్శ అయినట్లు తోచగా, లేచి నిలబడి, కనులు దెరచి, ఇరువైపుల నున్న వారిని చూచెను. ఆ చూపులతో వారు పట్టువిడిచి, ముగ్ధులై దూరముగ నిలుచుండిరి. వారిని చూచి విరుపణ్ణ "అన్నలార! ఏల పోయెదరు? రండు. శిల్పసౌందర్యమును చూడగొనుడు. ఎవరెంత పంచుకొన్నను, ఇది హెచ్చునేగాని తగ్గదు. రండు" అనుచు భ్రాతృప్రేమతో పిలిచి, వారిని చేయి పట్టుకొని, శిల్పకళనంతయు చూపసాగెను.

ఆ క్రూరాత్ములు విరుపణ్ణ హస్తస్పర్శచేతను, శిల్పామృతపానముచేతను జ్ఞానమునొంది, పశ్చాత్తాపపడి, అతని పాదాలపైబడి "మహాత్మా! మమ్ము కరుణింపుడు. పాపాత్ములమైన మమ్ము క్షమింపుడు" అని ప్రార్థించిరి. విరుపణ్ణ దయాహృదయుడు కనుక వారిని లేవనెత్తి, తన కౌగిటజేర్చి, వారి భయమును మాన్పి, వారిద్వారా జరిగిన వృత్తాంతమంతయు నెరింగెను. ఆ రాజభటులు "ప్రభూ! ఇది చాల పాపపు ఆజ్ఞ. వారు చెడిపోదురుగాక! దీనిని చింపివేయుడు" అని కోరిరి. మునుపు సముఖమున నొకసారి విరుపణ్ణ రాజాజ్ఞకు బదులు చెప్పినందుకు, ఆ దురాత్ముడు ఆడిన నాటకమిది. వాడే ప్రభువుగారి మనస్సును పెడదారి పట్టించినాడు. ఇపుడును ఈ ఆజ్ఞను తిరస్కరించినచో సమ్రాట్టు మండిపడడా? అప్పుడు ధర్మాధర్మములు అతనికి కనుపించునా? విరుపణ్ణను, ప్రజలను శత్రువులని తలంపడా? దీనిని గురిగాగొని ఆ దుష్టుడింకను చెలరేగడా? ఇంతకంటె

ప్రమాదమింకేమున్నది ? అట్లని ఈ అధర్మపు ఆజ్ఞలను నెర వేర్చి, తాను, ప్రభువును నరకమునకు పోవుటా? వీరుడైన వాడిట్లు చేయునా ? ఆజ్ఞతీర్చిననొక తప్పు. తీర్చకున్న నొక తప్పు. మరి దీని నెదుర్చుటెట్లు? ఇంతయైనను దైవభక్తినిష్ఠు డయిన విరుపణ్ణ ఏ మాత్రము చలింపలేదు.

విరుపణ్ణ బాగుగ యోచించి, త్యాగమే తన కర్తవ్య ముగా నిర్ణయించి, ధైర్యముగా నొక లేఖను వ్రాసి, ప్రభువు నకు ఇమ్మని చెప్పగా, వారును భక్తితో గ్రహించి వెళ్ళిరి. అచ్చట శిల్పి అప్పటికి విరుపణ్ణ చరిత్రము నంతయు సమ్రా ట్టునకు విన్నవించెను. అంతయు సావధానముగ విన్న సార్వ భౌముని హృదయమును మిక్కిలి మథింపసాగెను. చివరకు శిల్పి "ప్రభూ! విరుపణ్ణ త్యాగధనుడు" అని తెల్పెను. సరిగా అదే సమయమున సేవకుడు వచ్చి, విరుపణ్ణ యిచ్చిన లేఖను రారాజునకు అందించెను. ప్రక్కన నిల్చున్న ఆ దురాత్ముడు మిగుల బాధపడెను. రారాజు మనస్సులో పలు భావములు ముప్పిరిగొనగా ఆ జాబును విప్పి, చదువుకొనెను. ఆ జాబు చదువుకొనుచున్నంతసేపు, ఆ వాక్యములలో, "ప్రభూ! మీ ప్రజలను గూర్చి మీరు ఏదేదో తలంచినారు, ఈ రాజభక్తునిపై మీకు దయలేదా? నిరపరాధిని అగు నాపైనా యీ తమ్ముడేదియో నిందమోపి, చెప్పరానివి చెప్పియుండును. వానిని వెంటనే నమ్ముటకంటె నన్నే ఒక మారు పిలిపించియుండగవచ్చునుగదా! నాకన్నులుపీకుటకుగా ఇచ్చిన మీ ఆజ్ఞ ధర్మయుక్తముగా లేదని విన్నవించుటకు అనుజ్ఞ కోరుచున్నాను. ఇట్టిది మున్నెన్నడును లేదు. ధర్మ

మూర్తులగు మీరిది స్వప్నముగా నిర్ణయించి, కావించినది కాదని నా తలంపు. కాని రాజముద్ర యున్నది కనుక ఆచరింత మన్నచో నాకును, మీకునుగూడ పాపము తప్పదు. కనుక నే నిట్టి దుష్కార్యము చేయజాలను. ధనమునకు ఆశపడి, నా తమ్ముడు పంపగా వచ్చిన భటులు చేతులాడక వెనుదిరిగినారు. ఇందువలన మీ ఆనతిని మీరితినని తలంపకుడు. అట్లు తలంచినచో ఆ తమ్ముడు నా యందును, మీ ప్రజలయందును, మీ మనస్సున పొగరేపుచున్న ద్వేషాగ్ని భగ్నమనును. కనుక మీకు నచ్చజెప్పి, సత్యమును తెల్పి, శిల్పమును, ప్రజలను కాపాడుటకై నే నొక మార్గ మాలోచించితిని.

మమత, ఆశ, సంగము-ఇవిమాయకు పట్టుగొమ్మలు. ఇవియే సత్యదృష్టికి ప్రతిబంధకములు. వీనిచేతనే కామక్రోధ ద్వేషాదులన్నియు జనించును. వీనినుండి కడతేరుటకు త్యాగ మొక్కటే మార్గము. తమ్ముడు కన్నులు కోరినాడు. సంతోషముతో నిత్తును. కాని మీ కన్నులు ఇకనైన సత్య స్వరూప సౌందర్యమును చూచునుగాక యని తలంతును. నేను త్యాగమునే యెప్పుడును నమ్మితిని. స్వార్థము నెన్నడును కోరను. ఈ ప్రబాత్క్షేమమునకు, సత్యప్రదర్శనకు కన్నులేగాదు, ప్రాణములైనను విడుతును. ఈ కార్యమును భగవంతుడు నాకు విధించినాడు. దీనిని తీర్చి, కన్నులిచ్చిన ఆ పరాత్పరునికే నా కన్నుల నప్పగింతును" అని పల్కి

చుండెను. అంతయు చదివి, రారాజు కనులు తమంత తామే విప్పారెను.

త్యాగ తేజము అతని మనస్సులో వెల్గుచుండగా, "ఔరా? విరుపణ్ణ యింతటి త్యాగైకధనుడా?" అనెను. వెంటనే "ఔను ప్రభూ!" యని శిల్పియు, వీరణ్ణయు పలుకుచుండ, ఇంతకు జాబులోని విషయ మేమిటో తెలియక చెంత నున్న ఆ దురాత్ముడు కుమిలిపోవుచుండెను. రారాజు, "ఔరా! తన కనులను తానే త్యాగము చేయుటా! ఎంత వింత! నే నెంత పాపము చేసితిని! ఇకేది దిక్కు?" అని పలు రీతుల తనలో తాను తహతహపడి "రాత్రి ప్రజలు శిబిరముపై తుపాకులు ప్రేల్చుట మీ భక్తికి గుర్తా?" అని వీరణ్ణ నడిగెను. అంతట వీరణ్ణ ఆశ్చర్యచకితుడై వినయముగా "ప్రభూ! ఇది మండలాధిపతి తంత్రమై యుండును. ప్రజలు ఏ పాపము నెరుగరు. మీ సైనికులే నిద్రించు ప్రజలను నిర్దాక్షిణ్యముగా తుపాకి గుండ్లతో కొట్టినారు. గాయపడియు, నొచ్చియు స్థైర్యమును విడువక, ప్రజలే వెనుకాడిరి. వారే చెడ్డవారైరా! ఇదేమి చిత్రము!" అని బదులిచ్చెను.

అంతట ఆ దురాత్ముడు "ప్రభూ! ఇది అంతయు మోసము! ప్రజ లెక్కడ? దెబ్బలు తిను టెక్కడ? అల్లని వచ్చి మీతో విన్నవించుకొనరా?" అనెను. అంతట వీరణ్ణ "సత్యమును ప్రభువులవారే గాంచుడు" అని ప్రజల కట్లు విప్పి, గాయము లన్నిటిని చూపించెను. సత్యాసత్య నిర్ణయమునకు దేవుడు లేడా? ఈ గాయములను చూచినంతనే రారాజు మహోగ్రుడై మండిపడి లేచి, సింహగర్జన గావించి,

"నిజమును చెప్పుడు. లేదా మీ తలలు వ్రక్కలగును. నన్ను టక్కుటెక్కులతో ఆడింతురా?" అని అదిలించెను. ఆ ఖలుని బంటు లెల్ల భయపడి కంపింపసాగిరి. బ్రాహ్మణులు గడగడ వణకుచు, ప్రభువుకు సాష్టాంగ నమస్కారములు చేసి, "స్వామీ! మమ్ము క్షమింపుడు. ధనాశకులోంగి సన్మార్గమును వీడి, ఈ దుష్టుని చేరి, ఎన్నెన్నో చెడుపనులు చేసితిమి. ఆ విరుపణ్ణ మహాత్మునకు ద్రోహుల మైతిమి. తప్పుడు లెక్కలు వ్రాసిన మమ్ము క్షమించి, దయ చూడుడు ఇక ఎన్నటికి ఇట్టి పాపము చేయము" అని విన్నవించి, తమ పాపమును ఒప్పుకొనిరి. అంతట రాజు భగ్గుమని మండిపడి, "ఆ దురాత్ముని పట్టి బధింపుడు" అని ఆజ్ఞాపించెను. కాని వాడేడి?

రారాజు తలతల కొట్టుకొనుచు, మూరు మాటాడక దిగ్భ్రమ జెంది, దేవాలయమువైపునకు నొక్క పరుగిడెను. జను లెల్లరు ఆశ్చర్యముతో నతనిని వెంబడించిరి. దైవనిర్ణయ మెవ రెరుంగగలరు? అప్పటికే శ్రీ విరుపణ్ణ మొగము నేత్ర విహీనమైయున్నది. అతని పాదములపై బడి, రారాజు క్షమాభిక్ష నర్థించెను. విరుపణ్ణ తన పవిత్ర హస్తములతో రారాజు మేను నిమిరి, తడినెత్తురు కారుచుండగా, కడు ప్రేమతో నతనిని లేవనెత్తి, అక్కున జేర్చెను. చూచు వారెల్ల నిదియేమి చోద్యమనుచు స్తబ్ధులైయుండిరి.

# 7 తీర్పు

ఆ దుర్మార్గుడగు మండలాధిపతి పారిపారి నిర్జనప్రదేశమందు గల ఒక శివలింగమునొద్ద పడి మూర్ఛ చెందెను. కొంచెము సేపటికి చల్లనిగాలికి తెప్పరిల్లెను. ఇంతలో ఒక గాలి వీచగా ఫెళఫెళమని వచ్చి విరుపణ్ణ పంపిన లేఖ అతని చెంపకు కొట్టెను. అతడు భయపడి దిసల పరికింపగా నెవ్వరును కానరారైరి. వెనుదిరిగి వచ్చి, శివలింగమునకు హత్తుకొనియున్న ఆ లేఖను దీసికొని చదువసాగెను. అందు "తమ్ముడు నా కన్నులను కోరెను. తప్పక త్యాగ మొనర్చెదను" అని యున్న వాక్యమును చదివి, హృదయము కరిగి ద్రవింపగా, అతని కన్నీరు శివలింగముపై బడినది. త్యాగ తేజముతో వాని చిత్తము ప్రకాశితమయ్యెను. అంతట వాడు తెలివి తెచ్చుకొని, తన పాపములను తలంచి, కలవరమంది, తనను మ్రింగుటకై వచ్చు భూతమును గాంచి ఏమి చేయుటకు దిక్కుతోచక- తటాలున తన హృదయమును ఆ శివలింగమునకు తాకించెను. శివలింగ మందలి శాంతి అతనికి శాంతి నిచ్చినది. ఊహ లెల్ల విడిచి- మనసును స్థిరపరచుకొని, ధైర్యము తెచ్చుకొని- వాడు విరుపణ్ణను చూచుటకై దేవాలయమువైపు నడువసాగెను,

వానిని చూచినంతనే ప్రజలు "మన స్వామి కన్నులు

తీసిన పాపి చిక్కినాడు బంధింపుడు. నిర్దయగా కొట్టుడు" అనుచు రెక్కలు విరిచి కట్టి, తిట్టుచు, కొట్టుచు విరుపణ్ణ కడకు తెచ్చి, త్రోసిరి. వాడు విరుపణ్ణను చూచినంతనే "అన్నా!" అని పాదములపై బడి, కన్నీటితో వాని అడుగులను కడుగుచుండ, కడువాత్సల్యముతో విరుపణ్ణ, "తమ్ముడూ! వచ్చితివా?" అని వానిని దగ్గరకు చేర్చెను. అట్టియెడ ప్రజలెల్లరు "ఆహా! విరుపణ్ణ ఎంతటి కరుణా సముద్రుడు. శరణాగత రక్షకుడు, సంసారాంధ జగత్తునకు నేత్ర ప్రదాత" అని నుతించిరి.

అన్న యిచ్చిన క్రొత్త చూపుతో వాడు దేవాలయము నంతయు దర్శించి, అందలి పవిత్ర సుందర శిల్ప రమణీయతకు తన్మయుడయ్యెను. విరుపణ్ణ తన కనులను పెరికి దేవాలయపు గోడకు విసరి వైచియుండెను. అవి పడినచోట గోడలో రెండు రంధ్రములు పడి నెత్తురు కారిన గుర్తులు నేటికిని నిల్చియున్నవి. ఈకన్నుగుర్తులు శిల్పము దైవ నిర్మితము. శిల్పి "శిల్ప సంపూర్ణతకై వీరసోదరులు చేయుచున్న కృషి చివరకు దైవవిధిచే నెట్లయినది?" అనుచు స్రవించిన రక్తధారలుగల విరుపణ్ణ కన్నుగుర్తులుగల శిల్పమునందలి పరమార్థమును తలపోయసాగెను. తుదకతడు త్యాగమే పరమార్థముగా కనుగొనెను. మహాత్యాగియగు విరుపణ్ణ జీవన్ముక్తుడయ్యెను. అట్టియెడ ఆ శిల్పి, "అమృతత్వము నొందించునది త్యాగమొక్కటే. ఈ నేత్రములిచ్చు దివ్య

సందేశము త్యాగమే. అజ్ఞానమును మాన్పి జ్ఞాననేత్రమును వికసింపజేయునది త్యాగమొక్కటే! ద్వేషాగ్నిని చల్లార్చి, సమతాదృష్టిని ప్రసాదించునది త్యాగమొక్కటే! శిల్ప సందేశములకెల్ల చిట్టచివరి సందేశము త్యాగమొక్కటే" అని మనసార ఆ అక్షిశిల్పమును దీవించెను.

అంతట పరమపదప్రాప్తికి సోపానములవలె నున్న దేవాలయార్చకు లిచ్చినహారిహారదేవప్రసాదములు స్వీకరించి అందరును సంప్రీతులయిరి. మరల ప్రజాసేవకై రారాజును, ప్రజలు, అప్పటి మండలాధిపతి అందరును కలసి, విరుపణ్ణ తమ్ముడగు వీరణ్ణను పెనుగొండ మడలాధిపతిగా నియోగించిరి. "త్యాగరాజు" అగు శ్రీ విరుపణ్ణ "త్యాగసంపద కల్పవృక్షమగుగాత!" అని భరత వాక్యము పల్కెను.

"న కర్మణా న ప్రజయాధనేన
త్యాగేనైకే అమృతత్వ మానశుః"

ఇతి శివమ్.

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

| | |
|---|---|
| పీఠిక | 24 |
| పద్యభాగం | 152 |
| గద్యభాగం | 52 |
| మొత్తము | 228 పేజీలు |

